
వంతుకొస్తారా.. అంతుచూడాలా?





ఎన్టీఆర్ జిల్లా మద్యం దుకాణాలు 113 దరఖాస్తులు 5,825
కృష్ణా జిల్లా 123 దరఖాస్తులు 2,942

ఈనాడు, అమరావతి

‘దుకాణం ఇస్తే మాకు ఇవ్వు లేదా 50 శాతం వాటా ఇవ్వు.. నువ్వు ఎన్ని డీడీలు (దరఖాస్తులు) కట్టావనేది మాకు అనవసరం లేదా నిర్వహణ మొత్తం మాకే ఇవ్వు.. లెక్కలు మేం తేలుస్తాం..!’

కృష్ణా జిల్లాలో ఒక నియోజకవర్గంలో దుకాణాలు దక్కించుకున్న మద్యం వ్యాపారులకు ఓ ప్రజాప్రతినిధి పేరుతో అందిన హెచ్చరిక ఇది..!

‘మా పరిధిలో మద్యం దుకాణం పెట్టాలంటే ఫార్మాలిటీస్ (మామూళ్లు) పూర్తి చేయాలి. లేకపోతే వ్యాపారం కూడా సాగదు..!’ మరో నియోజకవర్గంలో ప్రజాప్రతినిధే స్వయంగా చేసిన హెచ్చరికలు ఇవి. దీంతో ఆ నియోజకవర్గంలో దుకాణాలు పెట్టేందుకు వ్యాపారులు ఆసక్తి చూపడం లేదు. పక్క చూపులు చూస్తున్నారు. అక్కడ వసూల్ రాజాగా ముద్ర పడిన ప్రజాప్రతినిధితో తలనొప్పి ఎందుకని ఇతర ప్రాంతాల్లో పెట్టేందుకు దుకాణాల కోసం గాలిస్తున్నారు.’

- దుకాణం ఇవ్వు లేదా 50 శాతం వాటా
- మద్యం వ్యాపారులకు నేతల హెచ్చరికలు
- పలు ప్రాంతాల్లో తెరుచుకోని దుకాణాలు...

ఉమ్మడి కృష్ణా జిల్లాలో మద్యం దుకాణాల దందా ప్రారంభమైంది. దుకాణాల ఏర్పాటు నుంచే బెదిరింపులు మొదలయ్యాయి. మద్యం, ఇసుక వ్యాపారంలో జోక్యం చేసుకోవద్దని.. సీఎం చంద్రబాబు తమ్ముళ్లను హెచ్చరించినా పెడచెవిన పెట్టారు. తమ దోవ తమదే అంటున్నారు. ఉమ్మడి జిల్లాలో కొన్ని నియోజకవర్గాల్లో బరితెగించారు. ముందుగానే దరఖాస్తులు చేయవద్దని హెచ్చరించిన నేతలు.. తమ వ్యాపారులను సిండికేట్ చేయించి దరఖాస్తులు చేయించారు. వారికి ‘అదృష్టం’ కలిసి రాక లాటరీలో దుకాణాలు రాకపోవడంతో వచ్చిన వారిపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. 50 శాతం వాటా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఇవ్వకపోతే.. ‘అమ్మకాలు ఎలా సాగుతాయో చూస్తామని’ హెచ్చరికలు పంపుతున్నారు. దుకాణంలో వాటాతోపాటు.. గొలుసు దుకాణాలు మావాళ్లకే ఇవ్వాలని షరతులు పెడుతున్నారు. ఈ నెల 14న మద్యం దుకాణాలకు లాటరీల ద్వారా వ్యాపారులను ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లాలో విపరీతమైన పోటీ ఏర్పడింది. కృష్ణా జిల్లా కంటే ఎన్టీఆర్ జిల్లాకు అధిక దరఖాస్తులు అందాయి. అందిన దరఖాస్తులే పోటీ తీవ్రతను వెల్లడించాయి. కృష్ణా జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో సిండికేట్ ప్రయత్నాలు చాలా వరకు ఫలించడంతో తక్కువ దరఖాస్తులు అందాయి. ఇప్పుడు అదృష్టవంతులను నేతలు వెంటాడుతున్నారు.

ఈ సారి దుకాణాల ఏర్పాటులో ఆబ్కారీ శాఖ హేతుబద్ధత లేకపోవడంతో మద్యం దుకాణాల ఏర్పాటులో సమస్యలు వస్తున్నాయి. నగరాలు, పట్టణాలు, మండలాలు యూనిట్‌గా తీసుకుని దుకాణాలను ప్రకటించారు. ఎన్టీఆర్ జిల్లాలో 113 దుకాణాలు ఉన్నాయి. ఆయా మండలాలకు కేటాయించిన దుకాణాలు ఎక్కడైనా పెట్టుకోవచ్చు. ఇంతకు ముందు ప్రాంతాలను, గ్రామాలను నిర్దిష్టంగా పేర్కొనేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో నగరాలు, పట్టణాల్లో సమస్యలు వస్తున్నాయి. విజయవాడ కార్పొరేషన్ పరిధిలో 39 మద్యం దుకాణాలను కేటాయించారు. ఈ దుకాణాలు ఒకే ప్రాంతంలో ఎక్కడైనా పెట్టుకోవచ్చు. దీంతో

సెంట్రల్ అంటే హడల్..!

వ్యాపారులు సెంట్రల్‌కు వెళ్లేందుకు హడలెత్తుతున్నారు. స్థానికులు సైతం అక్కడి నుంచి తూర్పు వైపు కదులుతున్నారు. సెంట్రల్‌లో ఓ వసూల్ రాజా హెచ్చరికలు భరించలేక ఇతర వ్యాపారులు సైతం అక్కడ ఏర్పాటు చేయడం లేదు. ఈ నియోజకవర్గంలో ‘వసూళ్ల’ దందా భారీగా జరుగుతున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి.

300 దరఖాస్తులు.. 5 దుకాణాలు

నగర తెదేపాకు చెందిన ఓ నాయకుడు, ఓ ఎమ్మెల్యే అనుచరుడు, మైలవరానికి చెందిన మరో తెదేపా నాయకుడు సిండికేట్లకే ఎక్కువ దుకాణాలు వచ్చాయి. ఒక నాయకుడు సిండికేట్ 150 దరఖాస్తులు (రూ.3 కోట్లు) చేస్తే.. 4 దుకాణాలు వచ్చాయి. వీటిపైనే మొత్తం సంపాదించాలి. మరో సిండికేట్ ఏకంగా జిల్లాలో 300 వరకు దరఖాస్తులు చేశారని తెలిసింది. వారికి అయిదు వచ్చాయి. నగరంలో తూర్పు, పశ్చిమ, ఉత్తర, సెంట్రల్ మండలాలు ఉన్నాయి. కనీసం ఈ మండలాల వారీగా దుకాణాలు కేటాయించలేదని వ్యాపారులు వాపోతున్నారు. సెంట్రల్‌లో కొన్ని వ్యాపార కేంద్రాలు, మాస్ కాలనీలు ఉన్నాయి. అక్కడ మద్యం వ్యాపారం జోరుగా సాగే వీలున్నా.. దుకాణం ఏర్పాటుకు వెనుకంజ వేస్తున్నారు. తూర్పులో ఒకదాని వెంట ఒకటి ఏర్పాటు చేస్తుండగా దీనిని మరో నాయకుడు వ్యతిరేకిస్తున్నారు. తమ నియోజకవర్గంలో ఎలా పెడతారని ప్రశ్నిస్తున్నారు.

దుకాణాల కొనుగోలు...

తెలంగాణ సరిహద్దులో వ్యాపారం జోరుగా ఉంటుందని ఆశించి దరఖాస్తులు చేసిన వ్యాపారులకు చుక్కెదురైంది. తక్కువ ధరలకు మద్యం లభిస్తుందని తెలంగాణకు తరలించవచ్చని ఆశించారు. ఇది నెరవేరకపోవడంతో దుకాణాలను స్థానిక సిండికేట్‌కు విక్రయించారు. రూ.90 లక్షల నుంచి రూ.కోటి వరకు విక్రయించి చేతులు దులుపుకొన్నారు. వత్సవాయి. పెనుగంచిప్రోలు మండలాల్లో అయిదు దుకాణాలు విక్రయించారు. నిబంధనల ప్రకారం దుకాణాల అద్దెకు తీసుకునేందుకు కొంత సమయం పడుతుందని ఎక్సైజ్ అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు.

భౌగోళిక మార్పులకు ఆర్కిటెక్చర్ అద్దం

కరెన్సీనగర్ (విజయవాడ), న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి జీవితంలో గ్రాడ్యుయేషన్ కీలక ఘట్టమని డిజైన్ యాక్షన్ గ్రూప్ కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ఇండియా(దిల్లీ) మాజీ అధ్యక్షులు ఎ.ఆర్.ప్రేమేంద్రరాజ్ మెహతా అన్నారు. విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్(స్పా) 8వ స్నాతకోత్సవం గురువారం సంస్థలో నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రేమేంద్రరాజ్ మెహతా మాట్లాడుతూ.. ఆర్కిటెక్చర్, ప్లానింగ్ వృత్తులు అసాధారణమైనవని, పట్టణాల భౌగోళిక మార్పులకు అవి అద్దం పడతాయన్నారు. సృజనాత్మక అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. 2022-23 విద్యా సంవత్సరానికి స్పా విజయవాడ సాధించిన సమగ్ర నివేదికను డైరెక్టర్ రమేష్ శ్రీకొండ వివరించారు. గత విద్యా సంవత్సరంలో విద్యార్థులు సాధించిన వివిధ అవార్డులను ఆయన వెల్లడించారు. మొత్తం 253 మంది విద్యార్థులకు పట్టాలు బహూకరించారు. 2023-24 విద్యా సంవత్సరానికి 10 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, 10 మందికి ఉత్తమ పరిశోధన అవార్డులు ప్రదానం చేశారు. స్నాతకోత్సవానికి స్పా విజయవాడ బోర్డు ఆఫ్ గవర్నర్స్ ఛైర్మన్ అమోగ్‌కుమార్ గుప్తా అధ్యక్షత వహించగా, ఆచార్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పట్టాలందుకున్న ఆనందంలో కేరింతలు



మాట్లాడుతున్న ప్రేమేంద్ర రాజ్ మెహతా, వేదికపై రమేష్ శ్రీకొండ, అమోగ్ కుమార్ గుప్తా తదితరులు

స్పందించారు... చక్కదిద్దారు



రాళ్లు, మట్టి పోసి రోడ్డు అంచులను సరిచేశారిలా..



బాగుచేసిన రోడ్డు

బుడమేరు వరద విధ్వంసంతో రామవరప్పాడు నుంచి ముస్తాబాద వెళ్లే మార్గం అంచులు కోతకు గురై సుమారు నాలుగు అడుగుల మేర మట్టి



స్పందనకు వందనం

కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారింది. దీనిపై ఈనాడులో సెప్టెంబరు 26న ‘వరద గాయం.. దారులు మాయం’ శీర్షికతో చిత్ర కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు కోతకు గురైన రోడ్డు అంచులు రాళ్లు, మట్టితో కప్పివేశారు. దీంతో ప్రమాదం తప్పిందని చోదకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

–ఈనాడు, అమరావతి

దుర్గగుడి హుండీ ఆదాయం రూ.6.26 కోట్లు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : దసరా ఉత్సవాల్లో దుర్గగుడి హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను మల్లికార్జున మహామండపం ఆరో అంతస్తులో రెండో విడత గురువారం లెక్కించారు. సీసీ కెమెరాలు, ఎస్పీఎఫ్ సిబ్బంది భద్రత పర్యవేక్షణలో కానుకలు లెక్కించారు. రెండు విడతల్లో కలిపి రూ.6,26,97,047 ఆదాయం వచ్చింది. బంగారం 412 గ్రాములు, వెండి 15.823 కిలోలు భక్తులు మొక్కుల రూపంలో చెల్లించారు. విదేశీ కరెన్సీ 355 యూఎస్ఏ డాలర్లు, 35 ఇంగ్లాండ్ పౌండ్లు, 160 ఆస్ట్రేలియా డాలర్లు, 50 కెనడా డాలర్లు, వచ్చినట్లు దేవస్థానం ఈవో రామారావు తెలిపారు. మరికొన్ని హుండీలను ఈ నెల 21న లెక్కిస్తారని ఈవో పేర్కొన్నారు. కానుకల లెక్కింపును డిప్యూటీ ఈవో రత్నంరాజు, దేవాదాయ శాఖ అధికారులు పర్యవేక్షించారు.



కానుకలు లెక్కిస్తున్న దేవస్థానం సిబ్బంది

జలవనరుల శాఖలో అదనపు బాధ్యతలు!


ఈనాడు, అమరావతి: జల వనరుల శాఖలో ఇంజినీర్ల కొరత ఉండడంతో పలువురికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ... రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రత్యేక ముఖ్య కార్యదర్శి సాయి ప్రసాద్ ఈ మేరకు మెమో జారీ చేశారు. ✪ విజయవాడలోని సీఈ కార్యాలయంలో చిన్ననీటి పారుదల విభాగం డీఈఈగా ఉన్న రవికిరణ్ రావెళ్లకు జలవనరుల శాఖ విజయవాడ సర్కిల్ కేసీ డివిజను ఈఈగా ఎఫ్ఏసీ అప్పగించారు. ✪ కేసీ డివిజనులోనే డిప్యూటీ ఈఈగా ఉన్న చెల్లబోయిన గోపీనాథ్‌కు గుడివాడ డ్రెయినేజీ డివిజను ఈఈగా నియమిస్తూ అదనపు బాధ్యతలు అప్పగించారు. ✪ పోలవరం కాలువ గన్నవరం డివిజన్-5కు చెందిన డీఈఈ వీవీ కిశోర్ మేడిశెట్టిని కాకినాడ డ్రెయినేజీ డివిజనుకు ఇన్‌ఛార్జిగా నియమించారు. ✪ సెంట్రల్ డిజైను విభాగం ఎస్ఈ కార్యాలయంలో డీఈఈగా ఉన్న కోటా రీనా విజయవాడ హైడ్రాలజీ విభాగం ఈఈ-2గా ఎఫ్ఏసీ ఇచ్చారు. ✪ విజయవాడలో ప్రాధాన్య ప్రాజెక్టుల పర్యవేక్షణ యూనిట్‌కు ఎస్ఈగా ఉన్న కె.నాగరాజును అనంతపురం హంద్రీనీవా సుజల స్రవంతి సర్కిల్ 2కు ఎస్ఈగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ✪ కృష్ణా పశ్చిమ డివిజను (గుంటూరు) ఈఈ వెంకట రత్నానికి జలవనరుల శాఖ గుంటూరు సర్కిల్ ఎస్ఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

పెట్టుబడి కెళితే.. పట్టుబడినట్లే?

ఈనాడు, అమరావతి

‘మేం సూచించిన స్టాక్‌లో పెట్టుబడి పెడితే మంచి ఫలితాలు వస్తాయి.. క్రిప్టో ట్రేడింగ్‌లో పెట్టుబడులతో మీరు ఊహించిన దాని కంటే అధికంగా లాభాలు కళ్లజూస్తారు.. అని సామాజిక మాధ్యమాల్లో ఊరించే ప్రకటనలతో కేటుగాళ్లు అమాంతం ముంచుతున్నారు. పెట్టుబడుల పేరుతో పెద్దమొత్తంలో మోసం చేస్తున్న ఘటనలు నగరంలో ఎక్కువ నమోదు అవుతున్నాయి. తక్కువ సమయంలోనే ఎక్కువ సంపాదించవచ్చని నమ్మించి నిలువునా ముంచుతున్నారు. అధిక రాబడులు వస్తాయనే ఆశతో పెద్ద మొత్తంలో డబ్బులు పెట్టి మోసపోతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.’

- భారీగా లాభాలు వస్తాయని వల
- డబ్బు జమ చేశాక స్పందన శూన్యం
- రూ.కోట్లు పోగొట్టుకుంటున్న బాధితులు



సంవత్సరం	2023	2024
ఫిర్యాదులు	338	192
పోగొట్టుకున్న సొమ్ము (రూ. కోట్లలో)	17.01	11.01
రికవరీ (ఇప్పటికి)	56.14 రూ. లక్షలు	1.1 రూ. కోట్లు

✪ గుణదలకు చెందిన ఓ వ్యక్తికి ఇటీవల వాట్సాప్ గ్రూప్ నుంచి సందేశం వచ్చింది. అందులో ఇద్దరు వ్యక్తులు క్రిప్టో కరెన్సీలో ట్రేడింగ్ చేయమని.. ఇందులో మంచి లాభాలు వస్తాయని ఆశ చూపించారు. బాండ్ జోన్స్ అనే ఓ క్రిప్టో కంపెనీ మేనేజర్‌తో మాట్లాడమని నంబరు ఇచ్చారు. వారు చెప్పినట్లే ఆ నంబరుకు వాట్సాప్ కాల్ చేసి మాట్లాడారు. అతను క్రిప్టో ట్రేడింగ్‌కు సంబంధించి ఒక లింక్‌ను పంపాడు. లింక్‌పై క్లిక్ చేసి.. క్రిప్టో కరెన్సీలో పెట్టుబడి పెట్టమని బాండ్ జోన్స్ సూచించాడు. ఆ మాటలు నమ్మి.. పలు దఫాలుగా ఏడు బ్యాంకు ఖాతాలకు రూ.1.21 కోట్లు దాకా పెట్టుబడి పెట్టాడు. తర్వాత ఈ మొత్తాన్ని డ్రా చేసుకునేందుకు ఫిర్యాదుదారుడు ప్రయత్నించినా సాధ్యం కాని పరిస్థితి. ఈ మొత్తం ఉత్తరాది రాష్ట్రాల్లో వివిధ బ్యాంకుల ఖాతాలకు తరలాయని తెలిసింది. చివరకు తాను మోసపోయాననని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

✪ కార్మెల్ నగర్‌వాసి ఒకరు ఓ ప్రైవేటు కంపెనీలో సేల్స్ మేనేజర్. స్టాక్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులపై అవగాహన ఉంది. ఈ మధ్య ‘వెల్త్ క్లాస్ రూమ్’ అనే వాట్సాప్ గ్రూప్ నుంచి సందేశం వచ్చింది. అందులో కొందరు సభ్యులు తాము ప్రఖ్యాత కంపెనీకి ఆర్థిక సలహాదారులమని పరిచయం చేసుకున్నారు. తాము సూచించిన స్టాక్‌లలో పెట్టుబడి పెడితే 30-40 శాతం లాభాలు వస్తాయని నమ్మబలికారు. నిజమని నమ్మి. . వారు ఇచ్చిన 13 బ్యాంకు ఖాతాలకు యాప్ ద్వారా రూ.36.72 లక్షల వరకు డబ్బు జమ చేశాడు. యాప్‌లో రూ.1.24 కోట్లు లాభం చూపగా.. ఆ మొత్తాన్ని డ్రా చేసుకుంటానని పట్టుబట్టడంతో వెంటనే ఆ వాట్సాప్ గ్రూప్‌ను తొలగించారు.

చిన్న మొత్తాలుగా..

పోగొట్టుకుంటున్న సొమ్ము రూ.కోట్లలో ఉంటుండగా.. రికవరీ రూ.లక్షల్లోనే ఉంటోంది. కారణం.. మోసగాళ్లు దోచిన సొమ్మును అనేక బ్యాంకు ఖాతాలకు బదిలీ చేస్తున్నారు. ఒక్కో కేసులో సొమ్మును బట్టి సుమారు 40 నుంచి 100 వరకు ఖాతాలకు చిన్న మొత్తాలుగా విభజించి పంపిస్తున్నారు. అక్రమ లావాదేవీల నిర్వహణకు అమాయకుల బ్యాంకు ఖాతాలను వాడుతున్నారు. వారికి డబ్బు ఆశ చూపి మోసగాళ్లే వీటిని నిర్వహిస్తున్నారు. పోలీసుల దర్యాప్తులో అమాయకులే దొరుకుతున్నారు. వీరి పాస్‌బుక్, బ్యాంకింగ్ ఐడీ, పాస్‌వర్డ్‌లను తమ ఆధీనంలోనే ఉంచుకొని అంతా నడిపిస్తున్నారు. వీరెవరికి తమ ఖాతాల ద్వారా రూ.లక్షల్లో లావాదేవీలు జరుగుతున్నట్లు తెలియదు. ఇందుకు ప్రతి నెలా వారికి కొంత నగదు చెల్లిస్తున్నారు.

దర్యాప్తులో అడ్డంకులు..

ఎక్కువ ఖాతాలకు డబ్బు బదిలీ అవుతుండడంతో. . వీటి వివరాలు తీసుకోవడం పోలీసులకు కష్టంగా మారుతోంది. పైగా అధిక సమయం పడుతుండడంతో దర్యాప్తు, రికవరీకి ప్రతిబంధకంగా ఉంటోంది. చివరకు ఈ నగదును మోసగాళ్లు ఈకామర్స్ సైట్లలో వివిధ వస్తువులు కొనుగోలు చేస్తున్నారు. చాలా సందర్భాలలో క్రిప్టో కరెన్సీ రూపంలో ఇతర దేశాలకు చేరుతోంది. డబ్బు పోగొట్టుకున్న వెంటనే బాధితులు 1930 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయడం లేదు. స్టేషన్‌కు రావడం కూడా ఆలస్యం అవుతోంది. దీని వల్ల రికవరీ శాతం తక్కువగా ఉంటోంది. వేగంగా ఫిర్యాదు చేస్తే.. 60 శాతం వరకు తిరిగి రాబట్టే అవకాశం ఉంది.

కట్టనేలేదు.. గుల్లవుతున్నాయ్!

పరిశీలన

ప్రారంభానికి ముందే విలేజ్ క్లినిక్‌లకు నెర్రెలు

ఈనాడు, అమరావతి

గ్రామీణుల చెంతకే వైద్య సేవలు తీసుకొస్తున్నామని గత వైకాపా ప్రభుత్వం హడావుడి చేసింది. ప్రతి 2 వేల మందికి ఒక విలేజ్ క్లినిక్ ఏర్పాటు చేస్తున్నామని నిర్మాణాలు ప్రారంభించారు. ఉపాధి హామీ పథకం కింద పనులు మొదలుపెట్టారు. చాలా చోట్ల ఇవి మధ్యలోనే నిలిచిపోయాయి. తాడిగడప పురపాలికలో విలేజ్ క్లినిక్‌లు గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఆనవాళ్లుగా నిలుస్తున్నాయి. ఇంకా ప్రారంభం కాక ముందే నాసిరకం పనులతో నెర్రెలు ఇచ్చాయి.

2020లో నాటి వైకాపా ప్రభుత్వం గ్రామాల్లో వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల పేరుతో నిర్మాణాన్ని ప్రారంభించింది. ఒక్కో క్లినిక్‌ను రూ.17.50 లక్షలు ఉపాధి హామీ నిధులను వెచ్చించారు. ఇందులో భాగంగా యనమలకుదురు, కానూరు, తాడిగడప, పోరంకి ప్రాంతాల్లో 18 క్లినిక్‌లు నిర్మించాలని తలపోశారు. ఏడు చోట్ల స్థలాలు దొరకలేదు. మిగిలిన చోట్ల పనులు ప్రారంభమయ్యాయి. 2021లో ఈ ప్రాంతాలన్నీ కలిపి అప్పటి ప్రభుత్వం తాడిగడప పురపాలికగా ఏర్పాటు చేసింది. ఉపాధి నిధులు గ్రామీణ ప్రాంతాల్లోనే వెచ్చించాలి. మున్సిపాలిటీగా ఏర్పాటైన తర్వాత ఏడాది వరకు సాగుతున్న పనులు పూర్తి చేసేందుకు గడువు ఉంది. 2022లో గడువు కూడా ముగిసింది. అయినా నిర్మాణాలు కొలిక్కి రాలేదు. ఉపాధి నిధులు కూడా చాలకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచాయి. రెండేళ్లు వీటిని పట్టించుకోలేదు. ఈ భవనాల పనులను వైద్య, ఆరోగ్య శాఖ ఇంజినీరింగ్ విభాగానికి బదిలీ చేసి.. నిధుల మంజూరు సంగతి గాలికొదిలేశారు.



ఎక్కడికక్కడ పగుళ్లు



గడ్డ కట్టిన సిమెంట్ బస్తాలు



అసంపూర్తిగా కానూరు-3 విలేజ్ క్లినిక్ భవనం



యనమలకుదురులో సిమెంటు గచ్చు ఇలా..

అరకొర పనులతో మమ అనిపించారు

పనులను గాలికి వదిలేయడంతో భవనాలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. దాదాపు రూ.18 కోట్ల పనులపై పర్యవేక్షణ కొరవడింది. పెనమలూరు పోలీసుస్టేషన్ వెనుక ఉన్న కానూరు-3 విలేజ్ క్లినిక్ భవనం పూర్తి అయింది. లోపల ఎలాంటి పనులు చేయలేదు. పలుచోట్ల నాసిరకం పనుల కారణంగా పగుళ్లు ఏర్పడ్డాయి. లోపల ఉన్న సిమెంటు బస్తాలు గడ్డ కట్టాయి. యనమలకుదురులో ఉన్న రెండు క్లినిక్‌లు పనులు పూర్తి కాకుండానే బయట రంగులు వేసి చేతులు దులుపుకొన్నారు. ఇందులో ఓ క్లినిక్ మెట్ల పక్కన పలుచోట్ల పగుళ్లు కనిపిస్తున్నాయి. పోరంకిలోని రెండు క్లినిక్‌లు కేవలం ప్లాస్టరింగ్ చేసి వదిలేశారు. పురపాలికగా మారడంతో వీటిని అర్బన్ క్లినిక్‌లుగా మార్చడంతో పాటు కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు. వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని సరిదిద్దితే ప్రజలకు ఉపకరించే వీలుంది.

నగరంలో శ్రీవారి లడ్డూ

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : ఎంజీరోడ్డులోని తితిదే కల్యాణ మండపం ప్రాంగణంలో వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ప్రత్యేక కౌంటర్‌లో శుక్రవారం మూడు వేల శ్రీవారి లడ్డూలు అందుబాటులో ఉంటాయని తితిదే విజయవాడ గ్రూప్ దేవాలయాల ఇన్‌స్పెక్టర్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయం 8.30 నుంచి విక్రయాలు ప్రారంభమవుతాయని వెల్లడించారు.

జెత్వానీ కేసులో నిందితుడికి రిమాండ్ పొడిగింపు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ముంబయి నటి కాదంబరి జెత్వాని కేసులో నిందితుడు కుక్కల విద్యాసాగర్ రిమాండ్‌ను ఈ నెల 29వ తేదీ వరకు పొడిగించారు. తనను, తన కుటుంబ సభ్యులను ఇబ్రహీంపట్నం పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారంటూ నటి జెత్వాని ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై వైకాపా నేత కుక్కల విద్యాసాగర్‌పై పోలీసులు కేసు నమోదు చేసి, అతడిని అరెస్టు చేశారు. మొదటి నిందితుడిగా అరెస్టై అతడు జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. రిమాండ్ గడువు ముగియడంతో.. గురువారం 4వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో ప్రవేశపెట్టారు. విచారణ అనంతరం.. ఆయన రిమాండ్‌ను ఈ నెల 29వ తేదీ వరకు పొడిగిస్తూ న్యాయమూర్తి యు.రామ్మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా విద్యాసాగర్ బెయిల్, పోలీస్ కస్టడీ పిటిషన్లపై వాదనలు వినేందుకు కేసును ఈ నెల 23వ తేదీకి న్యాయమూర్తి వాయిదా వేశారు.

వడివడిగా అడుగులు..

రూ.22.5 కోట్లతో సీసీ రోడ్ల అభివృద్ధి

మైలవరం, ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

అసంపూర్తి రహదారులకు నిధులొచ్చాయి. పనులు చేసే గుత్తేదారుల్లో ఆశలు చిగురించాయి. బురదకయ్యలుగా మారిన రహదారులపై నడుస్తున్న గ్రామీణులకు రోడ్లు కొత్త రూపులో కనిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ప్రణాళికాబద్ధ అభివృద్ధితో పల్లెల్లో పండగొచ్చింది. నియోజకవర్గ వ్యాప్తంగా సీసీ రోడ్ల అభివృద్ధికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. నియోజకవర్గంలోని నాలుగు మండలాలతో పాటు, నియోజకవర్గ పరిధిలో గల రూరల్ మండలంలోని 5 గ్రామాల్లో సీసీ రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం నరేగా ద్వారా పెద్ద ఎత్తున నిధులు కేటాయించింది. గత ప్రభుత్వ హయాంలో అంతర్గత రహదారుల పనులు చేపట్టినా, నిధులు కేటాయించకపోవడంతో గుత్తేదారులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. ఫలితంగా చాలా వరకు గ్రామాల్లో అంతర్గత రహదారులు నేటికీ వానపడితే బురదమయంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో నిధుల కేటాయింపు, రాష్ట్ర వ్యాప్తంగా ఒకేరోజు చేపట్టిన గ్రామసభల్లో పనుల ఆమోదం తెలపడంతో పనులు ఊపందుకున్నాయి. వాస్తవానికి రెండు వారాల నుంచే ఎక్కడికక్కడే పనుల్లో మునిగిపోగా.. పల్లె పండగ పేరిట ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంతో పూర్తిస్థాయిలో ప్రారంభిస్తున్నారు.

పండగ వాతావరణం

పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో ఇప్పటికే రెండు మండలాల్లోని 12 గ్రామ పంచాయతీల్లో పనులను లాంఛనంగా ప్రారంభించారు. గ్రామీణ రహదారుల రూపు మార్చాలన్న ఆలోచనతో పనులు చేపట్టిన పలు గ్రామాల్లో సీసీ రహదారులు పూర్తికాగా, ప్రారంభోత్సవాలు చేస్తూ వినియోగంలోకి తెస్తున్నారు. తొలి విడతలో నియోజకవర్గ వ్యాప్తంగా 200లకు పైగా పనులను గుర్తించి ఆమోదంతో ప్రారంభించినట్లు పంచాయతీరాజ్ డీఈ సుధ తెలిపారు. ఇప్పటికే పూర్తయిన పనులకు సంబంధించిన బిల్లులకు చెల్లింపులపై చర్యలు చేపట్టినట్లు వివరించారు.

నిధుల కేటాయింపు (రూ.కోట్లలో)

మండలం	పనులు	నిధులు
మైలవరం	50	5
రెడ్డిగూడెం	48	5
జి.కొండూరు	41	5
ఇబ్రహీంపట్నం	57	5
రూరల్ గ్రామాలు	13	2.50
మొత్తం	209	22.50



మైలవరంలో సీసీ రోడ్డుగా మారుస్తున్న అంతర్గత రహదారి



సిద్ధమవుతున్న గ్రావెల్ రోడ్డు

గ్రామాల్లో మహర్దశ

ఇబ్రహీంపట్నం గ్రామీణ మండల పరిధిలోని పది గ్రామాల్లో 57 మట్టి రోడ్లను సిమెంటు రహదారులుగా మార్చేందుకు అనుమతులు ఇచ్చారు. 6.16 కిలో మీటర్ల మేర నిర్మించనున్నారు. వీటికి రూ.5.12 కోట్లు కేటాయించారు. అత్యధికంగా మేజర్ పంచాయతీ అయిన గుంటుపల్లిలో 2.24 కిలో మీటర్ల నిడివిన 19 రోడ్లకు రూ.165.00 లక్షలు కేటాయించారు. మైనర్ పంచాయతీ చిలుకూరులో 0.28 కిలో మీటర్ల పొడవున ఒక రహదారిని సీసీ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు రూ.20 లక్షలు మంజూరు చేశారు. అన్ని గ్రామాల్లో సంక్రాంతి నాటికి రోడ్లు పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేసి ఈ నెల 19వ తేదీన భూమిపూజకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మండల పరిషత్తు సహాయక ఇంజినీరు శ్రీనివాసరావు తెలిపారు.

దేశంలోనే అత్యుత్తమ పారిశ్రామిక విధానాలు



మాట్లాడుతున్న పొట్లూరి భాస్కరరావు. వేదికపై అపర్ణ, రాధిక, రాజశేఖర్, ఫణిచంద్ర, రామచంద్రరావు, తరుణ్

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, ఉద్యోగ కల్పనను దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించిన ఆరు పారిశ్రామిక విధానాలను స్వాగతిస్తున్నామని, దేశంలోనే ఇవి అత్యుత్తమైనవని ఏపీ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ అన్నారు. విజయవాడలోని ఛాంబర్స్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలంటే ప్రధానంగా పారిశ్రామికరంగాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అందుకు అనుగుణంగా ఉపాధి కల్పించే పరిశ్రమలకు వివిధ ప్రోత్సాహకాలు ఇచ్చేలా విధానాలు రూపొందించారన్నారు. రతన్ టాటా పేరుతో ఐదు ఇన్నోవేషన్ హబ్‌లు ఏర్పాటు చేయడం వల్ల ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తారని పేర్కొన్నారు. ఎంఎస్ఎంఈ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్, ఆహారశుద్ధి, ఎలక్ట్రానిక్స్, ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ, ఏపీ ప్రైవేట్ పార్కుల విధానాలతో పారిశ్రామిక రంగం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. వీటిని త్వరితగతిన అమలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. తాము సూచించిన అంశాలను పారిశ్రామిక విధానాల్లో పొందుపరచడంపై ఆనందం వ్యక్తం చేశారు. సమావేశంలో ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు ఎస్.రామచంద్రరావు, తరుణ్ కాకాని, బి.ఫణిచంద్ర, జి.రాధిక, డి.అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

రూ.5 లక్షల విరాళం అందజేత

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: వరద బాధితుల సహాయార్థం ర్యాపిడ్ ప్రొటెక్షన్ ఫోర్సు మేనేజింగ్ డైరెక్టర్ సుంకర రాజేష్ రూ.5 లక్షల విరాళాన్ని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌కు అందజేశారు. ఆయనతోపాటు ఆర్‌పీఎఫ్ ప్రతినిధులు, ఎన్టీఆర్ కాలనీ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



మంత్రి లోకేశ్‌కు చెక్కు అందజేస్తున్న సుంకర రాజేష్ తదితరులు

నిత్యావసరాలు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

పటమట, న్యూస్‌టుడే: సరకుల నాణ్యత, ధరలపై పటమట రైతుబజార్, ఉషోదయ సూపర్ మార్కెట్లను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. రైతుబజారులో సరకుల అమ్మకాల్లో వ్యత్యాసాలపై అధికారులను ప్రశ్నించారు. బియ్యం, కందిపప్పు పంపిణీకి ఏర్పాటు చేసిన కౌంటర్ల నిర్వహణకు సమయపాలన పాటించకపోవడాన్ని గుర్తించారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. వంటనూనెలు, ఉల్లి, టమాట విక్రయాలపై వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. గురునానాక్ కాలనీలోని ఉషోదయ సూపర్ మార్కెట్ సరకుల ధరలు పరిశీలించారు. ప్రభుత్వం కందిపప్పు కిలో రూ.67లకు నిర్ణయించిన విధంగా అమ్మకాలు లేకపోవడం గమనించిన మంత్రి సూపర్‌మార్కెట్ నిర్వాహకులను నిలదీశారు. అధిక ధరకు అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ ధరల కంటే తక్కువ ధరలకే నిత్యావసర సరకులు వినియోగదారులకు అందిస్తున్నామన్నారు. ధరల స్థిరీకరణ విషయంలో ప్రభుత్వ ఆదేశాలను అన్ని రైతుబజార్లు, సంస్థాగత రిటైల్ దుకాణాలు అమలు చేయాలని మంత్రి ఆదేశించారు.



పటమట రైతుబజారులో వినియోగదారులతో మాట్లాడుతున్న మంత్రి మనోహర్

ఎంబీబీఎస్ ఎన్‌సీసీ ప్రాధాన్యక్రమం వెల్లడి

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: ఈ విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో అందుబాటులో ఉన్న ఎంబీబీఎస్ సీట్ల ప్రవేశానికి సంబంధించి ఎన్‌సీసీ ప్రాధాన్య క్రమం వెల్లడైంది. దరఖాస్తు చేసుకున్న 417 మందితో కూడిన ప్రాధాన్య క్రమంలో అనర్హుల జాబితా కూడా పొందుపర్చారు. ప్రాధాన్యక్రమంలో ఏమైనా అభ్యంతరాలుంటే శుక్రవారం 11 గంటల్లోగా విశ్వవిద్యాలయానికి తెలియపర్చాల్సి ఉంటుంది. అభ్యంతరాలు సరిచేశాక సీట్లు కేటాయిస్తామని విశ్వవిద్యాలయ అధికారులు పేర్కొన్నారు.

‘కొత్త సీసాలో.. పాత సారా’

విజయవాడ (సత్యనారాయణపురం), న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మద్యం విధానం కొత్త సీసాలో పాత సారాలా ఉందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. విజయవాడ నగరం, దుర్గాపురంలో నూతనంగా ప్రారంభించిన మద్యం దుకాణాన్ని గురువారం ఆయన సందర్శించారు. ధరలు ఎలా ఉన్నాయో ఆరా తీశారు. దుకాణదారుడి వద్ద ఒక సీసా తీసుకుని, దాని ధర అడిగారు. రూ.180 అని చెప్పగా.. ప్రభుత్వం రూ.99లకే ఇస్తామని ప్రకటించింది కదా అని ప్రశ్నించారు. దుకాణదారుడు.. బ్రాండ్లు కొత్తవి వచ్చాయని, అందుకే ధర పెరిగిందని సమాధానం చెప్పగా ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. మద్యాన్ని ఆదాయ వనరుగా చేయడం ప్రజాశ్రేయస్కరం కాదన్నారు. దీనిద్వారా ఇప్పటికే రూ.3వేల కోట్లు వచ్చాయని, డిపాజిట్ల ద్వారా మరో రూ.3వేల కోట్లు వస్తాయని ప్రభుత్వం అంటోందని.. ఇది మంచిది కాదన్నారు. గత ప్రభుత్వం మద్యాన్ని కేంద్రీకరించి అవినీతికి పాల్పడిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం.. వికేంద్రీకరణ అంటోందన్నారు. మద్యం విక్రయాలపై సెస్సు విధించి.. దానితో మందుబాబులకు పునరావాసం కల్పిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. సీపీఐ నాయకులు హరినాథ్‌రెడ్డి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.



మద్యం సీసా పరిశీలిస్తున్న నారాయణ

జిల్లా ప్రగతికి కలిసికట్టుగా కృషి

పటమట, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా సామినేని ఉదయభాను గురువారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉదయభానును శివనాథ్ శాలువా కప్పి అభినందించారు. అనంతరం ఎన్డీయే నాయకులు, కార్యకర్తలతో ఎంపీ శివనాథ్, ఉదయభాను సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలనే ఆకాంక్షతో జనసేనలో చేరిన సామినేని ఉదయభానుకు అభినందనలు తెలిపారు. జిల్లా అభివృద్ధి కోసం కలిసికట్టుగా కృషి చేద్దామన్నారు. ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామని తెలిపారు. ఉదయభాను మాట్లాడుతూ జిల్లా జనసేన అధ్యక్షుడిగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్డీయే కూటమి బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. జనసేన పార్టీ ఆంధ్ర జోన్ కన్వీనర్ బాడిత శంకర్, జనసేన నాయకులు బోలిశెట్టి వంశీ కృష్ణ, అక్కల గాంధీ, కామేష్, టంకసాల సుబ్బారావు, శ్యామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఉదయభానును సన్మానిస్తున్న ఎంపీ శివనాథ్

‘సాక్షి’పై కేసు

పటమట(విజయవాడ), న్యూస్‌టుడే: ప్రముఖ హైకోర్టు న్యాయవాది గూడపాటి లక్ష్మీనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విజయవాడ పటమట పోలీసులు ‘సాక్షి’ పత్రికపై కేసు నమోదు చేశారు. సాక్షి పత్రికలో ప్రచురిస్తున్న కథనాలు ప్రజల మధ్య ద్వేషాలు పెంచేలా ఉన్నాయని, ఆ పత్రికపై చర్యలు తీసుకోవాలని ఈనెల 10న లక్ష్మీనారాయణ పటమట సీఐ వి.పవన్‌కిషోర్‌కు ఫిర్యాదు చేశారు. తప్పుడు వార్తలు రాసి ప్రజలను తప్పుదోవ పట్టించి వారి మధ్య ద్వేషం పెంచుతున్న సాక్షి పత్రిక ఎడిటర్ మురళీపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై న్యాయ సలహా తీసుకున్న అనంతరం గురువారం పోలీసులు వివిధ సెక్షన్ల కింద సాక్షి ఎడిటర్ మురళీతో పాటు ఇతరులపై కేసు నమోదు చేశారు.

సమాజ సేవకుడు.. మన్నేపల్లి అప్పారావు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : సమాజ సేవే పరమావధిగా తన జీవితాన్ని అంకితం చేసిన సేవాతత్పరుడు మన్నేపల్లి అప్పారావు అని, ఆయన జీవితం భావితరాలకు స్ఫూర్తిదాయకమని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు టి.డి.జనార్దన్ అన్నారు. నందిగామ మండలం తొర్రగుడిపాడుకు చెందిన మన్నేపల్లి అప్పారావు సేవలపై వక్తల ప్రసంగాలతో కూడిన అ‘సామాన్యుడు’ పుస్తకాన్ని గురువారం గాంధీనగర్‌లోని ఓ హోటల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ.. సమాజం పట్ల అప్పారావుకు ఉన్న బాధ్యత, పేదలకు సేవ చేయాలనే తపన.. ఆయన్ని ముందుకు నడిపిస్తున్నాయన్నారు. చిరుద్యోగం చేస్తూనే.. తన సంపాదనలో కొంత భాగాన్ని సేవా కార్యక్రమాలకు వెచ్చించడం గొప్ప విషయమన్నారు. స్వగ్రామంలోని తనకున్న లక్షలు విలువ చేసే 13 సెంట్ల స్థలాన్ని ప్రభుత్వానికి విరాళంగా అందజేయడం గర్వకారణమన్నారు. సభాధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. అప్పారావు మనసులో ఎన్నో ఉదాత్తమైన ఆలోచనలు, ఉద్వేగభరిత భావాలు అతన్ని ప్రేరేపిస్తున్నాయని చెప్పారు. అమరావతి బహుజన ఐకాస అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య, నేషనల్ చైల్డ్‌లేబర్ ప్రాజెక్టు మాజీ డైరెక్టర్ పమిడిముక్కల సుధాకర్‌లు మాట్లాడుతూ.. ప్పారావు తన సొంత నిధులతో పేదలకు సేవ చేయడం గొప్ప విషయమన్నారు. అప్పారావు మాట్లాడుతూ.. ‘మాది పేద కుటుంబం. తల్లిదండ్రులకు సహకరించడానికి నేను 6వ తరగతి నుంచే పని చేస్తూ చదువుకునేవాడిని. చదువుపై దృష్టిపెట్టే అవకాశం కలగలేదు. సమాజంలో గౌరవప్రదమైన జీవితం గడపాలని తనలా ఇబ్బందిపడే వాళ్లను కొందరినైనా ఆదుకోవాలని సంకల్పించాను. తల్లిదండ్రులు విమలమ్మ, వెంకటేశ్వర్లు స్ఫూర్తితో చేసే సేవా కార్యక్రమాలకు భార్య సీతారామ సహకారం మరువలేనిదని’ వివరించారు. అనంతరం అప్పారావు కుటుంబ సభ్యులను అతిథులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి లంక దినకర్, బాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణలో జనార్దన్, శ్రీనివాస్, సుధాకర్, బాపిరెడ్డి, దినకర్, బాలకోటయ్య, అప్పారావు

మహర్షి వాల్మీకి జీవితం స్ఫూర్తిదాయకం

కృష్ణలంక, న్యూస్‌టుడే: మహర్షి వాల్మీకి జీవితం, ఆయన సమాజానికి అందించిన రామాయణ మహాకావ్యం స్ఫూర్తిదాయకమని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా అన్నారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో గురువారం వాల్మీకి జయంతి నిర్వహించారు. అధికారులతో కలిసి ఇన్‌ఛార్జి కలెక్టర్ నిధి మీనా వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆమె మాట్లాడుతూ మనిషి సంకల్పిస్తే ఏదైనా సాధించగలమని వాల్మీకి జీవితం ద్వారా తెలుసుకోవచ్చన్నారు. డీఆర్వో వి.శ్రీనివాసరావు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి కె.శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకి చిత్రపటానికి నమస్కరిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ నిధిమీనా, అధికారులు

కేజీబీవీల్లో ఖాళీల భర్తీకి ధ్రువపత్రాల పరిశీలన నేడు

ఎ.కొండూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: జిల్లాలోని రెడ్డిగూడెం, ఎ.కొండూరు, గంపలగూడెం మండలాల్లోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పార్ట్ టైమ్ టీచర్స్, ఎకౌంటెంట్, కుక్, వాచ్‌మెన్ పోస్టులకు దరఖాస్తు చేసిన వారి ధ్రువీకరణ పత్రాల పరిశీలన శుక్రవారం జరుగుతుందని సమగ్ర శిక్ష జిల్లా ఏపీసీ జి.మహేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకున్న మహిళలు ఉదయం 9.30 గంటలకు విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎంకే.బేగ్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలోని కార్యాలయానికి ఒరిజినల్ ధ్రువపత్రాలతో చేరుకోవాలని ఆయన కోరారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 135, 144, 155 చికెన్ విత్ స్కిన్ - 260 చికెన్ స్కిన్‌లెస్ - 270.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 510 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

20 నుంచి బీసీసీఐ అండర్-23 క్రికెట్ మ్యాచ్‌లు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఆంధ్రా క్రికెట్ సంఘం(ఏసీఏ)ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి వచ్చే నెల 11వ తేదీ వరకు మూలపాడులోని డాక్టర్ గోకరాజు లైలా గంగరాజు ఏసీఏ క్రికెట్ కాంప్లెక్స్‌లో కల్నల్ సీకే నాయుడు ట్రోఫీ కోసం బీసీసీఐ అండర్-23 మల్టీ డే (నాలుగు రోజుల)మ్యాచ్‌లు జరగనున్నాయి. ఆంధ్రా జట్టు మేఘాలయ, విదర్భ, రైల్వేస్ జట్లతో తలపడనుంది. దీనిలో భాగంగా ఆంధ్రా, మేఘాలయ జట్ల మధ్య తొలి మ్యాచ్ ఈనెల 20న ప్రారంభం కానుంది. ఇరు జట్లు గురువారం నగరానికి చేరుకున్నాయి. ఈ నెల 18, 19వ తేదీల్లో ఇరు జట్లు మూలపాడులోని క్రికెట్ మైదానంలో ప్రాక్టీసు చేయనున్నాయి. ఈ మ్యాచ్‌ల నిర్వహణకుగాను మైదానాన్ని ఏసీఏ సిద్ధం చేసింది. వర్షం కారణంగా క్రికెట్ మైదానంపై టార్పాలిన్‌తో కప్పివేశారు.



నగరానికి చేరుకున్న మేఘాలయ క్రికెటర్లు

20న విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

పెడన గ్రామీణం: కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఈ నెల 20న నాలుగు అంశాల్లో నిర్వహించనున్నట్లు ఆ పాఠశాలల జిల్లా సమన్వయకర్త కె.ప్రేమావతి తెలిపారు. సైన్స్ (వ్యవసాయం, శక్తివనరులు, ఆరోగ్యం), సోషల్ సైన్సెస్, లెక్కలు, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ అంశాలపై గన్నవరం సమీప వీరపనేనిగూడెంలో ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు ప్రదర్శన ప్రారంభం అవుతుందని తెలిపారు. 6, 7, 8 తరగతుల విద్యార్థులు జూనియర్లుగా, 9, 10, ఇంటర్మీడియట్ విద్యార్థులు సీనియర్ విభాగంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్యతో బయటపడ్డ చీటీపాటల ఎగవేత

- రూ.4కోట్లకు పైగా బకాయిలు ఉన్నట్లు ఫిర్యాదులు
- నిర్వాహక మహిళ అరెస్టు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: మండలంలోని చిల్లకల్లు గ్రామంలో ఒక యువకుడి బలవన్మరణం అదే గ్రామంలోని ఒక మహిళ చీటీపాటల ఎగవేత బాగోతాన్ని బయటపెట్టింది. గ్రామానికి చెందిన అశోక్ అనే యువకుడు ఆర్థిక సమస్యలతో ఆత్మహత్యకు పాల్పడడంతో రావాల్సిన సొమ్ములు రాకపోవడమే మృతికి కారణమని అతని తల్లి చిల్లకల్లు పోలీసులను ఆశ్రయించింది. దీనిపై విచారించిన పోలీసులు చీటీ పాటలు నిర్వహించే సుశీలపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. దీంతో అదే గ్రామానికి చెందిన మరో 20 మందికిపైగా బాధితులు తమకు కూడా ఆమె రూ.లక్ష మొదలుకొని రూ.5లక్షల వరకూ బాకీ ఉందంటూ పోలీస్‌స్టేషన్‌కి వచ్చి మొరపెట్టుకున్నారు. దీంతో వీరందరినీ జగ్గయ్యపేట సీఐ కార్యాలయానికి పిలిపించిన సీఐ జానకీరాం వారి నుంచి విషయాలు అడిగి తెలుసుకున్నారు. తమకు సొమ్ములు ఇప్పించాలంటూ వారు పట్టుబట్టడంతో ఫిర్యాదులు అందిస్తే అదనంగా కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని పంపారు. చీటీలు కట్టినవారిలో పురుషులతోపాటు అనేక మంది మహిళలు కూడా ఉన్నారు. మొత్తం బకాయిలు రూ.4కోట్ల వరకూ ఉంటాయని వారు తమ మౌకిక ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంకా వారి నుంచి రాతపూర్వక ఫిర్యాదులు అందాల్సి ఉందని, అశోక్ ఆత్మహత్య విషయంలో అరెస్టయిన ఆమెను కోర్టుకు హాజరుపర్చగా రిమాండ్‌కి పంపినట్లు సీఐ తెలిపారు.

సమర్థంగా విధులు నిర్వర్తిస్తా

విజయవాడ సిటీ: రాష్ట్రంలో పారా మెడికల్ కోర్సులు చేసిన వారి సర్టిఫికెట్ల రిజిస్ట్రేషన్, రెన్యువల్స్ విషయంలో బాధ్యతలు సమర్థంగా నిర్వహిస్తానని రాష్ట్ర పారామెడికల్ బోర్డు కార్యదర్శి బి.సుమైల అన్నారు. పాత ఆసుపత్రి ప్రాంగణంలోని పారా మెడికల్ కార్యాలయంలో గురువారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు ఉద్యోగులు అభినందించారు. అనంతరం సుమైల మాట్లాడుతూ రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి పారా మెడికల్ కోర్సులు చేసిన వారు రిజిస్ట్రేషన్, రెన్యువల్స్ కోసం వస్తుంటారని, అలాంటి వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా సత్వరమే సేవల పొందేందుకు తమ వంతు కృషి చేస్తానని తెలిపారు.



సుమైల

తిరువూరు

• తిరువూరు • మైలవరం

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని రాజవరం, పెనుగొలను, సత్యాలపాడు, మేడూరు, ఆర్లపాడు, దుందిరాలపాడు, తునికిపాడు, జింకలపాలెం, చల్లగుండ్లవారిపాలెం, రాజులపాలెం, చెన్నవరం గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఆపేస్తున్నట్లు డిస్కం ఏఈ వి. జగదీష్ తెలిపారు. గ్రామస్థులు సహకరించాలని కోరారు.

పల్లెపండగ వాయిదా

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: తిరువూరు, గంపలగూడెం మండలాల్లో శుక్రవారం నిర్వహించాల్సిన పల్లె పండగా కార్యక్రమాలు 20వ తేదీకి వాయిదా పడినట్లు ఆ మండలాలకు చెందిన ఎంపీడీవో పీవీఎస్. నాగేశ్వరరావు, ఈవోపీఆర్డీ డి. బాబూరావు తెలిపారు. ఆ గ్రామాల్లో సీసీ రహదారుల నిర్మాణాలకు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం శంకుస్థాపనలు జరుగుతాయన్నారు.

ఎస్టీయూ మండల ప్రధాన కార్యదర్శి ఎంపిక


మోహన కృష్ణ

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఎస్టీయూ రెడ్డిగూడెం మండల ప్రధాన కార్యదర్శిగా వై. మోహన కృష్ణ ఎంపికైనట్లు ఆ శాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. అనుగ్రహ ప్రసాద్ తెలిపారు. గురువారం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో మోహన్ కృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల శాఖ నాయకులు బి. అనిల్ కుమార్, వై. పిచ్చియ్య, ప్రేమ్‌కుమార్, శేఖర్‌రెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాలు



రాంకీ సంస్థ నిరంతరం ప్రజల తరపున సేవా కార్యక్రమాలు చేస్తూనే ఉంటుందని ఫ్యాక్టరీ హెడ్ ఆనందరావు పేర్కొన్నారు. సంస్థ ఆధ్వర్యంలో పశ్చిమ ఇబ్రహీంపట్నం వద్ద వరద బాధితులకు నిత్యావసరాలను గురువారం పంపిణీ చేశారు. వరదలు తగ్గుముఖం పట్టగానే కొన్ని ప్రాంతాల్లో, ప్రస్తుతం మరి కొన్ని చోట్ల పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం

గ్రామీణ ప్రజల సౌకర్యాలకు ప్రాధాన్యం

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: ఎన్డీయే ప్రభుత్వం గ్రామీణ ప్రజలకు సౌకర్యాలు కల్పించేందుకు ప్రాధాన్యం ఇస్తోందని.. పల్లె పండుగ కార్యక్రమం ద్వారా తొలుత అంతర్గత రహదారులను అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని ఎ. కొండూరు, ఎ. కొండూరు తండా, మత్రియా తండా, రేపూడి తండా, మాధవరం, కుమ్మరికుంట్ల, కృష్ణారావుపాలెం, కేశ్యాతండా, చీమలపాడు, పెదతండా, రామచంద్రాపురం గ్రామాల్లో గురువారం నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో సిమెంట్ రహదారుల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. రూ. 5 కోట్లు ఉపాధి హామీ పథకం నిధులతో మండల పరిధిలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఎంపీడీవో పి. హరిప్రియ, ఆయా గ్రామాల్లో ఎన్డీయే కూటమి నాయకులు ఆయన వెంట ఉన్నారు.


కృష్ణారావుపాలెంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తదితరులు

పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం

కొండపల్లి, న్యూస్‌టుడే

జ్వరాలతో అల్లాడుతున్న పురపాలిక ప్రజలు

జ్వరాలతో పురపాలిక జనం అల్లాడుతున్నారు. బుడమేరు కట్ట తెగి కొండపల్లి శాంతినగర్, దిగువ ప్రాంతాలు, కృష్ణమ్మ వరదకు ఇబ్రహీంపట్నం ఫెర్రీ, గాజులపేట, ఖాజీపేటలు గత నెల మొదటి వారంలో నీట మునిగాయి. పది రోజులకు నీరంతా పోయి సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. పారిశుద్ధ్య సిబ్బంది రేయింబవళ్లు శ్రమించి వారం రోజుల్లో పరిస్థితులను సాధారణ స్థితికి తెచ్చారు. అయితే అసలు సమస్య అక్కడే మొదలైంది. పెద్ద ఎత్తున నిలిచిపోయిన వరద, మురుగు నీటికి దోమలు పుర ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకొన్నాయి. ఖాళీగా ఉన్న స్థలాలతో పాటు మురుగు నిలిచిపోయిన కాలువల్లో కోట్ల కొలది స్థావరాలు ఏర్పరుచుకుని ప్రజలపైకి దండయాత్రకు దిగాయి. దీంతో పక్షం రోజుల్లో ఓ పారిశుద్ధ్య కార్మికుడు, ఓ బాలుడు మరో ఇద్దరు జ్వరాలతో మృత్యువాత పడ్డారు.


కొండపల్లి రైల్వే ట్రాక్ వద్ద వ్యర్థాలు తొలగిస్తున్న సిబ్బంది


మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్త

అంతంత మాత్రంగానే పనులు

పురపాలిక పరిధిలోని ఇబ్రహీంపట్నం, కొండపల్లిలో 29 వార్డులు ఉన్నాయి. వాటిల్లో పారిశుద్ధ్యానికి 155 మంది కార్మికులు ఉన్నారు. వారిలో వివిధ వాహనాల డ్రైవర్లు 18 మంది, కాలనీల నిర్వహణకు నలుగురు, పబ్లిక్ టాయిలెట్లకు ఆరుగురు పర్యవేక్షకులు, కుళాయిల పర్యవేక్షణకు నలుగురు, వీధి దీపాల నిర్వహణలో మరో నలుగురు, పుర కార్యాలయ నిర్వహణకు ఐదుగురు ఉన్నారు. వాహన సిబ్బంది 42 మంది ఉన్నారు. మొత్తం కార్మికుల్లో 83 మందికి పై విధులు కేటాయించడంతో మిగిలిన 72 మంది కార్మికులు పారిశుద్ధ్య పనులు నిర్వహించాల్సి ఉంది. లక్ష మంది జనాభా ఉన్న ప్రాంతంలో 72 మంది పారిశుద్ధ్య కార్మికులపై పని భారం పెరగడంతో గగ్గోలు పెడుతున్నారు. దీనికి తోడు రెండేళ్ల నుంచి శానిటరీ ఇన్‌స్పెక్టర్ లేకపోవడం పర్యవేక్షణ అంతా మేస్త్రీలపైనే పడి పారిశుద్ధ్యం అంతా అస్తవ్యస్తంగా మారింది. ఫాగింగ్ మిషన్లు మూలన పడడంతో వారి మరమ్మతులకు రూ. లక్షలు ఖర్చు అవుతుందని అధికారులు పక్కన పెట్టారు. కొత్తవి రెండు మిషన్లు కొనుగోలు చేసినా వాటిని ఉపయోగించలేని పరిస్థితి.


కొండపల్లి వినాయకుని ఆలయం వద్ద మురుగు కాలువలోనే తాగునీటి పైపులైన్

ప్రాధాన్య క్రమంలో చేయిస్తున్నాం

పురపాలిక పరిధి భిన్న స్వరూపం కలిగి ఉంది. ఉన్న సిబ్బందితో పారిశుద్ధ్యం సవాలుగా మారింది. ప్రాధాన్యత క్రమంలో పనులు చేయిస్తున్నాం.
– **పారిశుద్ధ్య మేస్త్రీలు, పవన్, మధు**

అప్రమత్తంగా ఉండండి

దోమ కాటు వల్ల జ్వరాలు విజృంభించాయి. నివాస ప్రాంతాలను ప్రతి ఒక్కరూ పొడిగా ఉంచుకోవాల్సిన అవసరం ఉంది. డెంగీ, మలేరియా వంటి వ్యాధులు లేకపోయినా వైరల్ జ్వరాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించాం. దోమ తెరలతో పాటు దోమల నివారణ పద్ధతులను వినియోగించాల్సిన అవసరం ఉంది.
– **జిల్లా మలేరియా అధికారి మోతీబాబు**

రైతులకు అవగాహన సదస్సు


కరపత్రాలు ప్రదర్శిస్తున్న వ్యవసాయాధికారులు, రైతులు

గోసవీడు (గంపలగూడెం), న్యూస్‌టుడే: ప్రభుత్వం ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పంట విక్రయించే రైతులకు కల్పించే అదనపు సౌకర్యాలపై గురువారం గోసవీడు రైతు సేవా కేంద్రంలో వ్యవసాయాధికారులు అవగాహన కల్పించారు. ప్రభుత్వం తాజాగా జారీ చేసిన మార్గదర్శకాల మేరకు ధాన్యం సేకరణకు అవసరమైన గోనె సంచులు ఉచితంగా అందించనున్నారు. కల్లంలో ధాన్యం కేంద్రాలకు తరలించేందుకు అయ్యే కూలీలు, రవాణ ఖర్చు కూడా ప్రభుత్వమే భరిస్తుంది. ధాన్యం ధర క్వింటాల్‌కు, 75 కిలోలకు సాధారణ రకం అయితే రూ. 2,300, రూ. 1,725, ఏ గ్రేడ్ అయితే రూ. 2,320, రూ. 1,740 చెల్లిస్తారన్నారు. పంట కొనుగోలు మార్గదర్శకాల కరపత్రాలను వీఏఏ ఎం. ఆరోగ్యరావు, తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి కొత్తా రజనీకాంత్ పాల్గొని రైతులకు అందజేశారు.

మధిర శాఖ కాల్వకు 876 క్యూసెక్కుల సాగర్ జలాలు

గంపలగూడెం, న్యూస్‌టుడే: ఎన్నెస్పీ రెండో జోన్ పరిధిలోని మధిర బ్రాంచి కెనాల్‌కు గురువారం ఖమ్మం జిల్లా కల్లూరు మండలం కప్పలబంధం వద్ద ప్రధాన కాల్వ నియంత్రిక నుంచి 876 క్యూసెక్కులు సాగర్‌జలాలు విడుదలైనట్లు ఏఈ మహేష్ తెలిపారు. గంపలగూడెం మండల సరిహద్దులోని 23వ కి.మీ వద్దకు 294 క్యూసెక్కులు చేరగా, దిగువున మేజర్ల వారీగా గంపలగూడెం 25, ఊటుకూరు 40, పెదకొమిర 20, మధిర 20, నిదానపురం 30 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయకట్టు రైతులు మిరప, పత్తి, వరి పంటలకు నీటి తడులు అందించేందుకు కాల్వలకు సరఫరా చేస్తున్న సాగర్‌జలాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


పత్తి చేలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

యాజమాన్య పద్ధతులు పాటించండి

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: పత్తిలో అధిక దిగుబడులు సాధించేందుకు అన్నదాతలు మేపిక్వాట్ క్లోరైడ్ రసాయనం ఉపయుక్తంగా ఉంటుందని గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ భాగ్యలక్ష్మి సూచించారు. మండలంలో పత్తి చేలను గురువారం ఆమె పరిశీలించి నాణ్యమైన దూది దిగుబడులకు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. అధిక సాంద్రతలో సాగు చేసే పద్ధతిలో చెట్ల పెరుగుదల నియంత్రణ, శాఖల విస్తరణ, గులాబీ రంగు పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. శాస్త్రవేత్తలు ఎన్. రాజశేఖర్, జి. శోభితరాణి పాల్గొన్నారు.

సత్వరమే మౌలిక వసతులు కల్పించాలి


కాలనీ నివాసితులతో సీపీఎం బృందం

కొండపల్లి, న్యూస్‌టుడే: కొండపల్లి జగనన్న కాలనీలో యుద్ధ ప్రాతిపదికన మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మండల సీపీఎం బృందం గురువారం ఆ ప్రాంతంలో పర్యటించి అక్కడి రహదారులను, మురుగు నీటి పారుదల వ్యవస్థను పరిశీలించింది. ఈ సందర్భంగా వాళ్లు మాట్లాడుతూ నాలుగేళ్ల నుంచి అనేక మంది సెంటు స్థలాల్లో నిర్మాణాలు ఏర్పాటు చేసుకుని ఉంటున్నా వారికి ఏ మాత్రం మౌలిక వసతులు కల్పించకపోవడం దుర్మార్గమన్నారు. ఇంకా అనేక మందికి విద్యుత్తు కనెక్షన్లు లేవన్నారు. రహదారులు అన్ని బురదమయంగా ఉండి రాకపోకలకు ఏ మాత్రం అనువుగా లేని ప్రాంతంలో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సెంటు స్థలాల పరిధి ఇంకా పురపాలిక పరిధిలోకి రాకపోవడంతో ఈ ప్రాంతం అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉండిపోయిందన్నారు. దీనిపై సంబంధిత అధికారులు దృష్టి పెట్టి మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మహేష్, బాలాజీ, సూర్య, దేవి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉదయభానుకు జనసైనికుల అభినందన


జనసేన జిల్లా అధ్యక్షుడు ఉదయభానుతో గంపలగూడెం మండల నాయకులు

గంపలగూడెం, న్యూస్‌టుడే: జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన సామినేని ఉదయభానును మండల పార్టీ నాయకులు గురువారం కలిసి అభినందనలు తెలిపారు. జనసేన మండలాధ్యక్షుడు సీహెచ్. వెంకటకృష్ణారావు, గాదెవారిగూడెం సర్పంచి సీహెచ్. శ్రీనివాసరావు, నాయకులు సీహెచ్. సత్యనారాయణ, వి. కృష్ణ, ఎస్‌కే. నాగులమీరా, పి. మాధవరావు, హెచ్. సంపత్‌కుమార్ బి. గణేష్, గోపిచంద్, అమరయ్య తదితరులు ఆయన్ను కలిశారు. జిల్లాలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేసేందుకు మండల స్థాయిలో నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరినట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక


రామిశెట్టి సాయి

జి.కొండూరు, న్యూస్‌టుడే: జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌లో అండర్-14 బాలుర వాలీబాల్ పోటీల్లో గంగినేని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి రామిశెట్టి సాయి ఉత్తమ ప్రతిభచూపాడు. గత రెండు రోజులుగా విజయవాడ పటమట బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనందుకు ప్రధానోపాధ్యాయుడు జీవీ. రామకృష్ణ, ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామస్థులు సాయిని అభినందించారు. శిక్షణ ఇచ్చిన పీడీ సాంబశివరావుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా దుర్గమ్మ గ్రామోత్సవం



దసరా ఉత్సవాలను పురస్కరించుకొని రెడ్డిగూడెం రజక కాలనీలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారి విగ్రహానికి గురువారం రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. బతుకమ్మల ఊరేగింపు, మహిళల కోలాటాలు, నృత్యాల మధ్య ఊరేగింపు వైభంగా సాగింది. అనంతరం స్థానికంగా ఉన్న చెరువులో నిమజ్జనం చేశారు.
– న్యూస్‌టుడే, రెడ్డిగూడెం

కల్యాణమస్తు సాయం అందజేత

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: కృష్ణా మిల్క్ యూనియన్ ప్రవేశపెట్టిన కల్యాణమస్తు పథకం ద్వారా రూ. 20 వేల విలువగల గోల్డ్ కాయిన్‌ను గురువారం తిరువూరు క్లస్టర్ పరిధిలోని కూనపరాజుపర్వ మహిళా పాల కేంద్రంలో పాలు పోస్తున్న కపులూరి కల్పన కుమార్తె సాయిచందన వివాహం సందర్భంగా అందజేశారు. కార్యక్రమంలో తిరువూరు మేనేజర్ టి. సాంబశివమూర్తి, పాల కేంద్రం అధ్యక్షురాలు చింతా అరుణ కుమారి, సూపర్‌వైజర్ శివనాగేశ్వరరావు, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోండి


మాట్లాడుతున్న తిరువూరు న్యాయస్థానం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మోతీలాల్

విస్సన్నపేట, న్యూస్‌టుడే: విద్యార్థులకు చట్టాలపై పూర్తి అవగాహన ఉండాలని తిరువూరు న్యాయస్థానం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె. మోతీలాల్ సూచించారు. విస్సన్నపేట సిద్ధార్థ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యాభ్యాస దశలోనే హక్కులతో పాటు బాధ్యతలను తెలుసుకుని మంచి పౌరులుగా ఎదగాలన్నారు. చట్టాలపై అవగాహన ఉంటేనే గ్రామాల్లో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించేందుకు కృషి చేయొచ్చన్నారు. బ్రిటీష్ కాలం నాటి 'ఫ్యాటిల్ యాక్సిడెంట్ యాక్ట్'పై అవగాహన ఉంటే అనుకోని పరిస్థితుల్లో జరిగే ప్రమాదాల్లో ప్రాణాలు పోయినా, ఆస్తులకు నష్టం జరిగినా ప్రభుత్వం నుంచి పరిహారం పొందే అవకాశం ఉంటుందన్నారు. తిరువూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వాకదాని లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన సదస్సులో సీనియర్ న్యాయవాదులు ఎం. సత్యం, బి. శ్రీనివాసరెడ్డి, కళాశాల డైరెక్టర్ శ్రీహర్ష పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 85005 44088 మైలవరం: 80085 74705

? స్థానిక ఎస్వీఎస్ నగర్ వెళ్లే మార్గం వెంబడి మురుగు కాలువలు పూడికలతో నిండి, మురుగంతా రోడ్డుపైకి చేరుతోంది. నీటి నిల్వతో దుర్వాసన వస్తోంది.
– రామారావు, స్థానికుడు

✔ ఒకసారి పూడిక తీయించినా తూము పల్లంగా ఉండడంతో ఇబ్బందిగా ఉంది, తూము పైకి లేపి మురుగు పారేలా చర్యలు తీసుకుంటాం. **– ఎం.డి.రఫీ, కార్యదర్శి మైలవరం**

? తారకరామానగర్ ప్రధాన రహదారి పెద్ద రోడ్డు వద్ద మురుగు నీరంతా రహదారిపైకే చేరుతోంది.
– ప్రవీణ్, స్థానికుడు

✔ కల్వర్టులో తేడాతో నీరు ముందుకు పారడం లేదు. అడ్డుగా ఉన్నవాటిని తొలగించి మురుగుపారుదల జరిగేలా చూస్తాం. **– రఫీ, కార్యదర్శి**
– న్యూస్‌టుడే, మైలవరం

స్పందనకు వందనం

❖ పట్టణంలోని 7వ వార్డు సచివాలయం పరిధిలోని 13వ వార్డు రజక బజార్‌లో పిచ్చి మొక్కలు పెరిగాయని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి సిబ్బందితో తొలగింపజేశారు.

❖ పట్టణంలోని 9, 16వ వార్డు సచివాలయం పరిధిలోని తంగెళ్ల బీడు ప్రధాన రహదారి అంచులో పిచ్చి మొక్కలు పెరిగాయని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి సిబ్బందితో తొలగింపజేశారు.

❖ 18వ వార్డు సచివాలయం పరిధిలోని తపాలా కార్యాలయం వీధిలో చెత్త పేరుకుపోయిందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి సిబ్బందితో తొలగింపజేశారు.

❖ 5వ వార్డు సచివాలయం పరిధిలోని బాలికోన్నత పాఠశాల రహదారిలో చెత్త పేరుకుపోయిందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి సిబ్బందితో బయటకు తరలింపజేశారు.
– న్యూస్‌టుడే, తిరువూరు

విద్యార్థులకు కంచాల వితరణ

ఇబ్రహీంపట్నం గ్రామీణం: చిలుకూరు ప్రాథమికోన్నత పాఠశాలలో విన్నకోట రజనీ జ్ఞాపకార్థం ఆమె కుమార్తె అంజనీదేవి 170 మంది విద్యార్థులకు భోజనం కంచాలు, వాటర్ బాటిళ్లను గురువారం వితరణ అందించారు. కార్యక్రమంలో సర్పంచి గొంది సురేష్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామి గుడికి పాదయాత్ర

మేడూరు(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి ఆలయం నుంచి మేడూరు వీరాంజనేయస్వామి గుడికి గురువారం పౌర్ణమి సందర్భంగా శ్రీరామ సేవకుల ఆధ్వర్యంలో పాదయాత్ర చేశారు. జైశ్రీరామ్, జైహనుమాన్ నినాదంతో పాదయాత్రలో భక్తులు పాల్గొన్నారు. వీరాంజనేయస్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వంట ఏజెన్సీ మార్చాలని వినతి


ఎంఈవోకు ఫిర్యాదు లేఖ అందజేస్తున్న విద్యార్థినులు, తల్లిదండ్రులు

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక బాలికోన్నత పాఠశాల ప్లస్‌లో మధ్యాహ్న భోజన పథకం నిర్వహిస్తున్న ఏజెన్సీని మార్చాలంటూ గురువారం ఆ పాఠశాలలో చదువుతున్న పలువురు విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు ఎంఈవో ఎల్. బాలుకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. భోజనంలో నాణ్యతాలోపంతో విద్యార్థినులు పలుమార్లు అస్వస్థతకు గురైనా గత ప్రభుత్వ హయాంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేని వాళ్లు ఆరోపించారు. పైగా పథకంలో ఉపయోగించే పదార్థాలను అమ్ముకుంటున్నారని పేర్కొన్నారు. ఫిర్యాదును పరిశీలిస్తామని ఎంఈవో తెలిపారు. దీనిపై ఎంఈవో బాలును సంప్రదించగా.. ఫిర్యాదు విషయాన్ని ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లామని, తామే పాఠశాలలో స్వయంగా విచారిస్తామని వెల్లడించారు.

వైభవంగా నెమలి కృష్ణుడి మాసకల్యాణం

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో గురువారం రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఉత్సవ మూర్తులకు అర్చకులు గోపాలాచార్యులు ఆధ్వర్యంలో మాస కల్యాణం వైభవంగా నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన పలువురు దంపతులు పీటలపై ఆసీనులైన స్వామివారి కన్యాదాన క్రతువులో పాల్గొన్నారు. మూలవిరాట్‌ను శోభాయమానంగా అలంకరించగా భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి


తిరువూరు బోయబజార్‌లో వాల్మీకి విగ్రహానికి ఎమ్మెల్యే శ్రీనివాసరావు నివాళి


జి.కొండూరులో..

విస్సన్నపేట, తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరు నగర పంచాయతీ కార్యాలయంలో పురపాలిక ఛైర్మన్ జి. కస్తూర్బాయి, కమిషనర్ జి. లోవరాజు, 12వ వార్డులో బోయబజార్‌లో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, తెదేపా నాయకులు, విస్సన్నపేటలో ఎంపీడీవో చిన్నరాట్నాలు, పరిపాలనాధికారి చందా ప్రసాద్, ఎ. కొండూరు మండలంలో గ్రామ సచివాలయాల సిబ్బంది, గంపలగూడెం మండలం పెనుగొలను అంగన్‌వాడీ కేంద్రం మహిళలు పాల్గొని వాల్మీకి విగ్రహాలు, చిత్రపటాలకు నివాళులర్పించారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే: స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో ఎంఈవో-1 పి.వి. నరసింహారావు, ఎంఈవో-2 ఎం. వీరాస్వామి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సిబ్బంది మూర్తి, శ్రీహరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: గుంటుపల్లి పంచాయతీ కార్యాలయంలో సర్పంచి భుక్యా కవిత ఆధ్వర్యంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి మునేశ్వరరావు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఫర్వీన్, నాయకులు సూర్యనారయణ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, మండలంలోని పొందుగలలో వాల్మీకి చిత్రపటాలకు, విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఉప ప్రిన్సిపల్ రంగారావు, అధ్యాపకులు దేవానంద్‌కుమార్, రాముడు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


మైలవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుల ఆధ్వర్యంలో


గంపలగూడెం : పెనుగొలనులో..

ఉచిత ఇసుక అమలుకు వినతి

తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరులో ఇసుక సమస్యను పరిష్కరించాలని, సీఐటీయూ మండల కార్యదర్శి బి. వెంకటేశ్వరరావు, భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షుడు ఎన్. వేలాద్రి ఆధ్వర్యంలో నాయకులు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుకు గురువారం వినతిపత్రం అందజేశారు.

ప్రకటన

నా క్లయింట్ యన్.టి.ఆర్. జిల్లా విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడు గ్రామ కాపురస్తులు పరస లేటు క్రిష్ణయ్య గారి కుమారుడు పరస రవి గారి నుండి సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా.. ఈ దిగువ షెడ్యూలు ఆస్తి, నా క్లయింట్ యన్.టి.ఆర్ జిల్లా విస్సన్నపేట మండలం కొర్లమండ గ్రామ కాపురస్తులు దబ్బిగొడ్ల లేటు వెంకటేశ్వర్లరావు గారి కుమారుడు భాస్కరరావు గారి నుండి ది. 30-06-2022న క్రయము చేసి వారి నుండి విస్సన్నపేట సబ్-రిజిస్ట్రారు వారి ఆఫీసులో విక్రయ [illegible]

D.S.V. PRASADA RAO, B.Com., B.A., B.L.,
S.K. SUBHASHINI, Advocates
Flat No: 502, Datta Sai Towers, Alluri Sitarama Raju Road, Azit Singh Nagar, Vijayawada-15. Cell: 90322 26262.

విజయవాడ తూర్పు

రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి కృషి


శాప్ ఛైర్మన్ రవినాయుడును సన్మానిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్

విజయవాడ (క్రీడలు), న్యూస్‌టుడే: రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)పేర్కొన్నారు. స్థానిక ఐజీఎంసీ స్టేడియంలోని శాప్ కార్యాలయంలో శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడును గురువారం ఆయన మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీసీ తరఫున క్రికెట్ పాటు క్రికెటేతర క్రీడలను కూడా ప్రోత్సాహిస్తామన్నారు. ఛైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మార్గదర్శకం మేరకు అందరి ప్రోత్సాహంతో రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు.

ఎంపీ శివనాథ్‌ను కలిసిన మంత్రి సుభాష్

పటమట, న్యూస్‌టుడే: కృష్ణాజిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా నియమితులైన కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ గురువారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో ఎంపీ కేశినేని శివనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఉమ్మడి కృష్ణాజిల్లాలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితుల గురించి చర్చించుకున్నారు. కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి బలపరిచిన మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ భారీ మెజార్టీ వచ్చేందుకు కార్యాచరణపై సమాలోచన చేశారు.

రూ.కోట్ల వ్యయం.. నెరవేరని లక్ష్యం

మార్జిన్లు యథావిధిగా ఆక్రమణల పాలు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

రోజురోజుకూ నగరంలో వివిధ రూపాల్లో కాలుష్యం పెరుగుతోంది. వీటిని తగ్గించడానికి నగరపాలక సంస్థ పలు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా కోట్లాది రూపాయలు వెచ్చించి పనులు నిర్వహించినా ప్రయోజనం లేకపోయింది. గతంలో రహదారి, ఫుట్‌పాత్‌ల మధ్య కొంత ఖాళీ ఉండేది. వర్షం పడితే సులువుగా నీరు ప్రవహించడానికి, మరికొంత ఇంకడానికి ఉపయోగపడేది. ఆ ప్రాంతంలో మట్టి, చెత్త ఉన్నందున వాహనాల రాకపోకల సమయంలో దుమ్ము లేచేది. పాదచారులు, వాహనదారుల కళ్లలో దుమ్ము పడి ఇబ్బంది పడేవారు. వర్షం పడితే గుంతల్లో నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బంది కలిగేది. ఈ క్రమంలో దుమ్ము, ధూళి లేవకుండా ఖాళీ ప్రదేశంలో పేవర్ బ్రిక్స్ ఏర్పాటు చేశారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడం, నిర్వహణ లోపంతో అవి ఆక్రమణదారులకు అడ్డాగా మారాయి. వాహనాల పార్కింగ్‌కు ఉపయోగపడుతున్నాయి తప్ప.. అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదు.


పాలిక్లినిక్ రోడ్డులో పేవర్ బ్రిక్స్‌పై వ్యాపారాలు


బృందావన్ కాలనీలో ఇలా..

పాదచారులకు దారేదీ..?

నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకొని పాదచారుల నిమిత్తం దారులు ఏర్పాటు చేశారు. అధికారుల నిర్లక్ష్యం, రాజకీయ నాయకుల సిఫార్సుల వల్ల అవి ఆక్రమణకు గురవుతున్నాయి. ఫలితంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. విజయవాడ తూర్పు నియోజకవర్గంలో 353 కి.మీ మేర ప్రధాన, అంతర్గత రహదారులు ఉన్నాయి. రహదారుల పక్కన పేవర్ బ్రిక్స్ ఏర్పాటుకు 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.17.65 కోట్లు ఖర్చు చేశారు. రహదారికి రెండు వైపులా వాటిని ఏర్పాటు చేసి ఫుట్‌పాత్‌లను అనుసంధానం చేయడంతో ఖాళీ ప్రాంతం కనిపించడం లేదు. కాలుష్య సమస్యలు కొంతవరకు తగ్గినా ఆశించిన ప్రయోజనం కనిపించడం లేదు. వాటిని ఇష్టానుసారం ఆక్రమించి కొందరు వ్యాపారాలు చేస్తున్నారు. వాహనాలు నిలుపుతున్నారు. పాదచారులు నడవడానికి వీలు లేకుండా చేస్తున్నారు.


తోపుడు బళ్లు, ఆటోలు పెట్టి...

పార్కింగ్‌గా మార్చేశారు..

పిన్నమనేని పాలిక్లినిక్‌రోడ్డులో వీబీ సిద్దార్థ కళాశాల పక్కన పేవర్ బ్రిక్స్ ఏర్పాటు చేశారు. చిరువ్యాపారులు అక్కడ తోపుడు బండ్లు పెట్టుకొని వ్యాపారాలు చేస్తున్నారు. నిర్మల కాన్వెంట్ రోడ్డులో కూడా అదే పరిస్థితి. వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. మున్సిపల్ ఎంప్లాయిస్ కాలనీ, వెంకటేశ్వరపురంలో ఎంజీరోడ్డు నుంచి తంతి తపాలా కార్యాలయం, బృందావన కాలనీలోని అంతర్గత రహదారుల్లో తోపుడు బళ్లు పెట్టుకుని వ్యాపారాలు చేస్తున్నారు. కొన్ని చోట్ల నిర్మాణ సామగ్రి ఉంచుతున్నారు. వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. ఫలితంగా ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. అధికారులు స్పందించి ఆక్రమలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పారిశుద్ధ్య నిర్వహణలో లోపాలు లేకుండా చూడాలి

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలో పారిశుద్ధ్య కార్యక్రమ నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగరంలోని సింగ్‌నగర్, బుడమేరు వంతెన, ఇందిరానాయక్‌నగర్ ప్రాంతాల్లో ఆయన గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా బుడమేరు కెనాల్ బండ్‌ను పరిశీలించి అక్కడ పెరిగిపోయిన గుర్రపుడెక్కను వెంటనే తొలగించాలని, ప్రజలు వ్యాధుల బారిన పడకుండా డ్రోన్ల సాయంతో ఎంఎల్ ఆయిల్‌ను పిచికారీ చేయాలని ఆదేశించారు. సింగ్‌నగర్ పైవంతెన ప్రాంతంలో పర్యటించి వంతెనపై రహదారికి అవసరమైన మరమ్మతులు త్వరగా చేపట్టి పూర్తిచేయాలని సూచించారు. ఇందిరానాయక్ నగర్ పరిసర ప్రాంతాల్లో పర్యటించి అక్కడ పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేదని గుర్తించారు. బాధ్యులైన అధికారులు, సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ ఖాళీస్థలాల్లో నిల్వఉన్న నీటిని యంత్రాల సాయంతో తొలగించాలని ఆదేశించారు. పర్యటనలో ఆయన వెంట అధికారులు శ్రీనాథ్‌రెడ్డి, పి.సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్, రామకోటేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

రాష్ట్ర వాలీబాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక


ఎంపికైన బాలుర జట్టుతో సమాఖ్య ప్రతినిధులు, ఎంపిక కమిటీ సభ్యులు, పీఈటీలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: విజయనగరం జిల్లా భోగాపురంలో వచ్చే నెల 9 నుంచి 11వ తేదీ వరకు జరిగే ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్-14 బాలబాలికల వాలీబాల్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను గురువారం ఎంపిక చేశామని జిల్లా సమాఖ్యల కార్యనిర్వాహక కార్యదర్శులు ఎం.శ్రీనివాసరావు (ఎన్టీఆర్), డి.శ్రీనివాసరావు (కృష్ణా)లు సంయుక్తంగా తెలిపారు. పటమటలోని కేబీసీ జడ్పీహెచ్ స్కూల్ మైదానంలో గురువారం నిర్వహించిన ఉమ్మడి కృష్ణా జిల్లా అండర్-14 బాలబాలికల వాలీబాల్ జట్ల ఎంపిక పోటీల్లో పలువురు క్రీడాకారులు ఉత్సాహంగా తలపడ్డారని వెల్లడించారు. హాజరైన క్రీడాకారులకు నిర్వహించిన పోటీలో ప్రతిభగల వారిని జిల్లా జట్లకు ఎంపిక చేశామని వివరించారు. ఎంపికైన క్రీడాకారులను స్కూల్ ప్రధానోపాధ్యాయిని జి.ఎస్తేర్ రాణి, ఎస్‌ఏ పీఈ ఎల్.దుర్గారావు, పీఈటీ సింహాద్రి రమేష్, ఎంపిక కమిటీ సభ్యులు అభినందించారు. ఎంపికైన క్రీడాకారుల వివరాలు ఇలా ఉన్నాయి.

బాలుర జట్టు: ఎ.సంపత్‌కుమార్, బి.కిరణ్, పి.అయ్యప్ప, కె.రాంబాబు, ఎన్.శ్రీనివాస్, కె.సుహాస్, ఆర్.సాయి, బి.యజిద్య, ఎం.యశ్వంత్, పి.ధనుష్, వి.సంతోష్‌శామ్యూల్, జి.కౌశిక్‌శ్రీనివాస్‌కుమార్, పి.రేవంత్‌కుమార్, జి.గౌతమ్, పి.డానియేల్, జి.జీవన్‌కుమార్, బి.లోహిత్‌నాయక్, ఎం.షాబన్య.

బాలికల జట్టు: ఆర్.మనస్వి, కె.వర్షితాలక్ష్మి, జె.హేమాదేవి, వై.నిరుపమ, ఎస్.ఝాన్సీ, కె.దివ్య, టి.గీతాంజలి, సీహెచ్ సుప్రియ, ఒ.జ్యోతి, సీహెచ్ సుకన్య, పి.వైష్ణవి, కె.అక్సా, యు.మేఘన, పి.యోగశ్రీ, జి.వైష్ణవి, కె.దుర్గ, ఆర్.శ్రావణి, కె.హారిక, జి.ఫణి నాగదీపిక.

బదిలీ అయ్యారు.. రిలీవ్ కాలేదు..

విజయవాడనగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళికా విభాగంలో సుదీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తున్న పలువురు ప్రణాళికాధికారులను ప్రభుత్వం సెప్టెంబరు నెలలో బదిలీచేసింది. అప్పై నగరంలో వరదలు సంభవించడంతో తాత్కాలికంగా వారు ఇక్కడే కొనసాగేందుకు వీలుగా ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. దీంతో నగరంలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న వీఎంవీ రమణారెడ్డి, కె.అరుణ, కె.ఆషా, కె.వెంకటేశ్వరరావు, శేషశైల, కొండలరావు తదితర టీపీవోలు, టీపీఎస్‌లు నాటి నుంచి ఇక్కడే విధుల్లో కొనసాగుతున్నారు. ఆపై వీరిని రిలీవ్ చేసేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించినా సంబంధిత అధికారులు వారిని రిలీవ్ చేయడం లేదు. దీని ఫలితంగా ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చినవారు సైతం ఇక్కడ విధుల్లో చేరడం లేదు. నగరపాలక సంస్థ ఉన్నతాధికారులు కావాలనే వారిని రిలీవ్ చేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. అదే అదనుగా వీరిలో కొందరు ప్రణాళికాధికారులు పలు అక్రమాలకు పాల్పడుతూ అనుమతి లేని, అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి.

డీసీపీ జూబెన్‌కు స్థానచలనం

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థలో డిప్యూటీ సిటీ ప్లానర్(డీసీపీ)గా విధులు నిర్వహిస్తున్న జూబిన్ చీరన్ రాయ్ బదిలీ అయ్యారు. ప్రభుత్వం ఆయన్ను సీఆర్‌డీఏకు బదిలీ చేసింది. దీంతో ఆయన విధుల నుంచి రిలీవ్ అయ్యారు. డిప్యూటేషన్‌పై నగరపాలక సంస్థకు వచ్చిన ఆయన ఆమధ్య సీఆర్‌డీఏకు బదిలీ అయ్యారు. అయితే 10 రోజుల్లోనే నగరపాలక సంస్థకు తిరిగి బదిలీ చేయించుకున్నారు. అప్పటి నుంచి సర్కిల్-3 ఏసీపీ బాధ్యతలతోపాటు, ప్రకటనలు, నగర ప్లానింగ్ వంటి పలు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. చాలా కాలంగా ఇక్కడే పనిచేస్తుండడంతో టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్, ఎంఏయూడీ అధికారుల సూచనలకు అనువుగా ఆయన్ను ప్రభుత్వం ప్రస్తుతం బదిలీ చేసింది.

అంతర్గతంగా ఏసీపీలకు..

★ నగరపాలక సంస్థ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఏసీపీలకు అంతర్గత బదిలీ అయ్యింది. కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు ప్రణాళికాధికారులు వారిని అంతర్గతంగా బదిలీ చేశారు. నగరంలోని సర్కిల్-2 పరిధిలో పనిచేస్తున్న పి.మోహన్‌బాబును అక్కడ నుంచి సర్కిల్-3కి బదిలీ చేశారు. మరోవైపు గుడివాడ నుంచి ఇటీవల నగరానికి బదిలీపై వచ్చిన వై.రాంబును సర్కిల్-2కు సర్దుబాబు చేశారు.

జాతీయ స్థాయిలో సత్తా చాటండి


రాష్ట్ర రోయింగ్ క్రీడాకారులను అభినందిస్తున్న శాప్ ఎండీ గిరీషా, చిత్రంలో తరుణ్ కాకాని

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: జాతీయ స్థాయిలో సత్తా చాటి రాష్ట్రానికి పతకాలు అందించాలని శాప్ ఎండీ పీఎస్ గిరీషా స్కల్లింగ్, రోయింగ్ క్రీడాకారులకు సూచించారు. రాష్ట్ర స్కల్లింగ్, రోయింగ్ సంఘం అధ్యక్షుడు తరుణ్ కాకాని ఆధ్వర్యంలో ఈనెల 24 నుంచి మూడు రోజుల పాటు ఉత్తరప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి ఛాంపియన్‌షిప్‌లో తలపడే క్రీడాకారులు, శిక్షకుడు గురువారం శాప్ కార్యాలయంలో ఎండీ గిరీషాను కలిశారు. రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న కుశాల్, లిఖిత్‌లను, రోయింగ్ పోలీస్ కోచ్ కృష్ణమూర్తిని పరిచయం చేశారు. జట్టు సభ్యులను ఎండీ గిరీషా అభినందిస్తూ.. రాష్ట్రంలో వాటర్ స్పోర్ట్స్, రోయింగ్ అభివృద్ధికి తమ వంతు పూర్తి సహకారం ఉంటుందన్నారు.

గౌరంగబాబు సేవలు చిరస్మరణీయం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

బెంజిసర్కిల్(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: తెదేపా ఆవిర్భావం నుంచి తుదిశ్వాస వరకు పార్టీ అభివృద్ధికి గౌరంగబాబు చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. దుర్గగుడి మాజీ ఛైర్మన్, కృష్ణాజిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు యలమంచిలి గౌరంగబాబు సంస్మరణ సభ బెంజిసర్కిల్‌లోని లారీ ఓనర్స్ అసోసియేషన్ హాలులో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వచ్ఛమైన మనసుతో ఎవరికి చిన్న అపాయం కలిగించకుండా జీవితాన్ని కొనసాగించారని కొనియాడారు. రవాణా శాఖ కార్యాలయం గన్నవరంలో కాకుండా విజయవాడలో నిర్మించడంలో గౌరంగబాబు చేసిన కృషిని పలువురు గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, తెదేపా జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్, లారీ యజమానుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.వి.ఈశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు నాగుమోతు రాజా, స్టోర్స్ ఛైర్మన్ కేవీ రమేష్, ఫౌండేషన్ అధ్యక్షులు రావి గోపాలరావు తదితరులు పాల్గొన్నారు. గౌరంగబాబు చిత్రపటం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

అవార్డు ప్రదానం

గుణదల(పటమట), న్యూస్‌టుడే: గుణదలకు చెందిన పెద్దపూడి సునీతకు గ్లోబల్ విమెన్ ఇన్‌స్పిరేషన్ అవార్డు దక్కింది. గురువారం దిల్లీలో టెలివిజన్ నటి వైష్ణవి మెక్‌డోనాల్డ్స్ నుంచి అవార్డును అందుకున్నారు. ఏటా సాధికారత సాధించిన మహిళలకు ఈ అవార్డు ప్రదానం చేస్తారు. మహిళలకు పలు అంశాలపై శిక్షణనిచ్చి ఎంటర్‌ప్రెన్యూనర్‌గా తీర్చిదిద్దుతునందుకు ఈ అవార్డు దక్కిందని సునీత తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
80085 74652

చెత్తకుప్పల తొలగింపు

స్పందనకు వందనం

☛ పటమట యార్లగడ్డ వారి వీధిలో గత ఆరు నెలలుగా చెత్త కుప్పలు తిష్ఠ వేసినా అధికారులు పట్టించుకోవట్లేదంటూ స్థానికుడు కె.ఎస్.వి.సురేష్ బాబు మేమున్నాం...మీకు తోడుగా ద్వారా శానిటరీ అధికారి రాయలు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన చెత్త కుప్పలను తొలగించారు.

☛ పదవ డివిజన్ పంటకాలువ రోడ్డు ఎన్‌ఎస్‌ఆర్ నగర్‌లో 10-42/107 విద్యుత్తు స్తంభానికి ఉన్న దీపం వెలగడం లేదని స్థానిక నివాసి గరికపాటి రామారావు మేమున్నాం...మీకు తోడుగా ద్వారా ఏఈ నారాయణ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కొత్త దీపాన్ని ఏర్పాటు చేయించారు.

? పటమట కరణంగారి బజారులో భూగర్భ డ్రైనేజీ పొంగి రోడ్డంతా మురుగునీరు రావడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోంది. **-నాగ మల్లేశ్వరరావు**

✔ పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. **-జశ్వంత్, ఏఈ**

-న్యూస్‌టుడే, కరెన్సీనగర్

విద్యుత్తు పొదుపు తప్పనిసరి


సోలార్ ప్లాంట్ ప్రారంభోత్సవంలో పీసీఈఈ మిశ్రా, డీఆర్ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్, సీఎంఎస్ సౌరిబాల తదితరులు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : భవిష్యత్తు అవసరాల దృష్ట్యా విద్యుత్తును పొదుపుగా వాడాలని దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్(పీసీఈఈ) పి.డి.మిశ్రా అన్నారు. గురువారం రైల్వే ఆసుపత్రిలో కొత్తగా ఏర్పాటు చేసిన 60కేడబ్ల్యూపీ ఆన్ గ్రిడ్ సోలార్ ప్లాంట్‌ను డీఆర్ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్‌తో కలిసి ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. విద్యుత్తు స్థానంలో సౌరశక్తిని వినియోగించడం ద్వారా రూ. లక్షలు ఆదా అవుతాయన్నారు. ఇప్పటికే డివిజన్ వ్యాప్తంగా రైల్వే కార్యాలయాలు, ఆసుపత్రులు, రైల్వేస్టేషన్లు, ఇతర భవనాల్లో సౌరశక్తిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విజయవాడ డివిజన్‌లో విద్యుత్తు వినియోగాన్ని గణనీయంగా తగ్గిస్తూ డీఆర్ఎంతో పాటు ఇతర అధికారులు ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రశంసించారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు కొండా శ్రీనివాసరావు, ఎడ్విన్, రైల్వే ఆసుపత్రి సీఎంఎస్ డాక్టర్ సౌరిబాల, సీనియర్ డీఈఈ(నిర్వహణ) టి.సురేష్‌బాబు, డీఈఈ ఎన్.గురుశ్రీనివాస్, విద్యుత్తు సీనియర్ సెక్షన్ ఇంజినీర్ శ్రీహరి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, చిత్రంలో ఎండీ పీఎస్ గిరీషా


జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో...


వాల్మీకి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ ధ్యానచంద్ర, ఉద్యోగులు


వాల్మీకి చిత్రపటానికి నమస్కరిస్తున్న రాధికా రెడ్డి

వాల్మీకి మహర్షి యువతకు స్ఫూర్తిదాయకం

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక ఐజీఎంసీ స్టేడియంలోని రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్)కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి నిర్వహించారు. శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, మేనేజింగ్ డైరెక్టర్ పీఎస్ గిరీషాలు.. వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ రవి నాయుడు మాట్లాడుతూ వాల్మీకి మహర్షి సమాజానికి, యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన జయంతిని రాష్ట్ర పండగగా ప్రభుత్వం గుర్తించడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో శాప్ అధికారులు, ఉద్యోగులు పాల్గొని వాల్మీకి మహర్షి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం : డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయంలో గురువారం మహర్షి వాల్మీకి జయంతి నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి రిజిస్ట్రార్ డాక్టర్ రాధికా రెడ్డి నివాళులు అర్పించారు.

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : వాల్మీకి మహర్షి జయంతిని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఎం.సుహాసిని, ఎన్‌హెచ్‌ఎం డీపీఎం డాక్టర్ నవీన్, డాక్టర్ కార్తీక్, డాక్టర్ శ్రావణి, స్టాటిస్టికల్ అధికారి లక్ష్మోజి, ఉప డెమో ప్రభాకరరెడ్డి, సూపరింటెండెంట్ రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: వాల్మీకి మహర్షి వంటి వారిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు వాల్మీకి జయంతి సందర్భంగా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గురువారం వాల్మీకి చిత్రపటానికి ఉద్యోగులతో కలిసి వీరు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాల్మీకి రచించిన రామాయణం ద్వారా ఎన్నో విషయాలు తెలుసుకునేందుకు అవకాశం కలిగిందన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్(పి) చంద్రశేఖర్, ఇతర అధికారులు జీవీజీఎస్‌వి ప్రసాద్, సురేష్‌బాబు, సత్యకుమారి, సత్యనారాయణ, రామ్మోహనరావు, సోమశేఖర్‌రెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారంలో సమష్టి కృషి

ఆటోనగర్, న్యూస్‌టుడే: ప్రజలకు ఉపయోగపడే ప్రభుత్వ కార్యక్రమాలను ప్రచారం చేయడంలో సమష్టి కృషి అవసరమని ప్రతికా సమాచార కార్యాలయ అదనపు డైరెక్టర్ జనరర్ రాజిందర్ చౌదరి అన్నారు. గురువారం ఆటోనగర్‌లోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయ సముదాయంలో ఏర్పాటు చేసిన ఇంటర్ మీడియా పబ్లిసిటీ కోఆర్డినేషన్ కమిటీ(ఐఎంపీసీసీ) సమావేశంలో వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ రంగ సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్న అధికారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసేందుకు ప్రభుత్వ శాఖల్లోని వారందరి మధ్య సమగ్ర సమాచార మార్పిడి, నిర్వహణ వ్యూహాన్ని రూపొందించడం సమావేశం ముఖ్య ఉద్దేశమన్నారు. వివిధ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాజిందర్ చౌదరి

ముగిసిన 'గ్లోబల్ ఇంగ్లిష్ ఫెస్ట్' పోటీలు


విజేతలతో ఫాదర్ కిరణ్, రంగబాబు తదితరులు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ఆంధ్ర లయోల కళాశాల ఆంగ్ల భాష విభాగం, ఈఎల్‌టీ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో 'గ్లోబల్ ఇంగ్లిష్ ఫెస్ట్-2024' వేడుకలు గురువారం ముగిశాయి. రెండో రోజున జరిగిన పోటీల్లో మిస్టర్ గ్లోబల్ ఫెస్ట్‌గా శరత్ చంద్ర ఐఏఎస్ అకాడమీ విద్యార్థి మేఘాశ్యామ్, మిస్ గ్లోబల్ ఫెస్ట్‌గా ఆంధ్రా లయోల కళాశాల విద్యార్థిని సాయి చరిత నిలిచారు. వక్తృత్వంలో షేక్ హ్యూమెరే బేగం, ఎం.రేణుక(ఆదిత్య కళాశాల) విద్యార్థులు గెలిచారు. జామ్‌లో కేబీఎన్ కళాశాల విద్యార్థులు షణ్ముక ప్రియకు ప్రథమ, వై.కోమలికి ద్వితీయ స్థానం సాధించారు. క్విజ్‌లో శరత్ చంద్ర అకాడమీ విద్యార్థులు ఎన్.గుణశేఖర బృందం ప్రథమం, ఎస్.హేమంత్ బృందం ద్వితీయ స్థానంలో నిలిచారు. బృంద నృత్య విభాగంలో అన్వేష్ టీం (శరత్ చంద్ర అకాడమీ) మొదటి, క్రాంతి టీం (పిఎస్‌సిఎంఆర్ కళాశాల) ద్వితీయ స్థానంలో నిలిచారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ కిరణ్ కుమార్, ఆంగ్ల భాషా విభాగాధిపతి ఎన్.రంగబాబు, ఈఎల్‌టీ డైరెక్టర్ బి.రాజు, సీనియర్ ఆంగ్ల అధ్యాపకులు డి.ప్రవీణ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం


సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రామ్మోహన్

కృష్ణలంక, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే తాను అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. 17వ డివిజన్ మల్లెల తిరుపతమ్మ వీధిలో గురువారం ఆయన పర్యటించి డ్రైనేజీలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ స్థానికంగా ఉన్న సమస్యలను తెదేపా, భాజపా, జనసేన నాయకులకు లేదా తన కార్యాలయంలో నేరుగా తెలియజేస్తే వాటిని సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించనున్నట్లు చెప్పారు. తాను నిత్యం నియోజకవర్గంలో పర్యటిస్తూ స్థానిక సమస్యలను తెలుసుకుంటున్నట్లు తెలిపారు. స్థానిక నాయకులు తలపాటి ప్రసాద్, వేల్పుల శౌరి, మర్రి వెంకట సుబ్బయ్య, వెంకటేశ్వరరెడ్డి, షేక్ అమీనా, భద్ర, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

'బాధితులకు అందని వరద సాయం'

కృష్ణలంక, న్యూస్‌టుడే: వరద బాధితులు పరిహారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ గత నెలరోజులుగా తిరుగుతున్నా ఫలితం లేదని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. వరద ప్రభావిత తారక రామానగర్‌లో గురువారం సీపీఎం బృందం పర్యటించింది. ఆపార్టీ జిల్లా కమిటీ సభ్యుడు పి.కృష్ణ మాట్లాడుతూ బాధితులందరికీ పరిహారం ఇచ్చినట్లు ప్రభుత్వం చెబుతున్నా..సగానికి పైగా బాధితులు పరిహారం అందలేదని చెబుతున్నారన్నారు. ఇళ్లు దెబ్బతిన్న వారికి, చిరువ్యాపారులకు ఇంకా పరిహారం అందలేదన్నారు. విద్యార్థులకు పుస్తకాలు అందించలేదన్నారు. సీపీఎం నగర నాయకులు తమ్మిన చంద్రశేఖర్, కోటిరెడ్డి, కె.వెంకటేశ్వరరావు, ఆదాం తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పఠనంతో నైతిక విలువలు

పున్నమ్మతోట(విజయవాడ సిటీ): పాఠశాల విద్య నుంచే విద్యార్థులు భగవద్గీత పఠనం చేయాలనే లక్ష్యంతో తితిదే 'మానవులందరికీ భగవద్గీత' పుస్తకాలను పంపిణీ చేస్తోంది. అందులో భాగంగా నగరంలోని సుబ్బారావు పాఠశాలలో 750, ఎస్‌కేపీవీవీ హిందూ పాఠశాలలో 250 పుస్తకాలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ధార్మిక ప్రచార కమిటీ సభ్యుడు బీవీబీ కోటేశ్వరరావు, తితిదే ధర్మప్రచారపరిషత్ కార్యక్రమాల సహాయకుడు సీవీకే ప్రసాద్ మాట్లాడుతూ భగవద్గీత పఠనంతో విద్యార్థులకు క్రమశిక్షణ, నైతికవిలువలు అలవడతాయని, సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తారని తెలిపారు.

నందిగామ

• నందిగామ • జగ్గయ్యపేట

సాయి అయ్యప్పస్వామి ఆలయంలో కేరళ తరహాలో పూజలు



కేరళ అర్చకులకు ఒప్పందపత్రాలు అందజేస్తున్న వంశీధర్, సభ్యులు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ శ్రీరామలింగేశ్వరనగర్‌లోని సాయి అయ్యప్పస్వామి దేవాలయంలో జస్టిస్ కేరళ తరహా పూజలు నిర్వహించనున్నారు. గురువారం ఈమేరకు కేరళలోని కాలడికి చెందిన ఆదిశంకరాచార్యమఠం (తెలగాణాలు) ఆధ్వర్యంలో ఉన్నికృష్ణన్ నంబూద్రి స్వామికి(అర్చకుడు) ఒప్పంద పత్రాలు అందజేశారు. మురుగం కేరళ అర్చకులు ప్రమాణస్వీకారం చేశారు. స్థానిక దేవాలయంలో అయ్యప్పస్వామికి శబరిమల అయ్యప్పస్వామి సన్నిధానంలో నిర్వహించే విధానం ప్రకారం పూజలు నిర్వహిస్తారు. ఈకార్యక్రమంలో దేవాలయ కమిటీ ఛైర్మన్ శఖమూరు వంశీధర్, సభ్యులు దాట్ల గజేంద్ర, నల్లాని అయ్యన్న, కోవెలమూడి వెంకటనారాయణ, మహంకాళి వెంకన్న, ఏమూరి శ్రీనివాసరావు, నరసింహ శ్రీను, చిరుమామిళ్ల నారాయణ, రెడ్డి స్వామి, పీట్ల ఆంజనేయులు, మోహనరావు, మల్లెల గాంధీ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ మూర్తులకు గరుడ వాహన సేవ



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు



ఉత్సవకమిటీ సభ్యులకు సత్యమ్మతల్లి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో హరిగోపీనాథ్‌బాబు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: పల్లగిరిపై కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని స్వామివారి ఉత్సవమూర్తులకు గరుడ వాహనసేవ నిర్వహించారు. అర్చకులు నాగసీతారామారావు, వెంకటమహాలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో భక్తులు ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవాలయ కమిటీ ఛైర్మన్ కొత్త హనుమేశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ★ మండలంలోని అంబారుపేట సత్యమ్మతల్లి దేవాలయంలో దసరా ఉత్సవాలను విజయవంతం చేసిన ఉత్సవ కమిటీ సభ్యులను ఈవో హరిగోపీనాథ్ సన్మానించారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్ ఎం.మాధవ్, సభ్యులు వాసు, అర్చకులు వెంకటసుబ్బారావు తదితరులను సన్మానించి అమ్మవారి చిత్రపటాలను బహూకరించారు.

తిరుపతమ్మ దేవాలయ ఆదాయం రూ.1.04కోట్లు



నగదు లెక్కింపు పర్యవేక్షిస్తున్న ఛైర్మన్ శ్రీనివాసరావు, ఈవో కిశోర్‌కుమార్

న్యూస్‌టుడే, పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలు తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం హుండీల ఆదాయాన్ని గురువారం లెక్కించగా రూ.1.04కోట్లు సమకూరినట్లు ఆలయ ఈవో కిశోర్ కుమార్ తెలిపారు. నగదు రూ.1,03,85,016, 65 గ్రాముల మిశ్రమ బంగారం, 1.050 కిలోలు మిశ్రమ వెండి, 620 యూఎస్ డాలర్లు, 120 ఇతర దేశాల నగదు లభ్యమైనట్లు ఈవో పేర్కొన్నారు. ఈ మొత్తం 102 రోజుల వ్యవధిలో సమకూరినట్లు చెప్పారు. లెక్కింపు కార్యక్రమాన్ని నందిగామ డివిజన్ దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ జి.పవన్‌కల్యాణ్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఛైర్మన్ జె.శ్రీనివాసరావు, పాలకవర్గ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

పశు వైద్యం.. దైన్యం

శిథిల భవనాల్లోనే సేవలు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే



భవనం పైకప్పు ఇలా..



మాగల్లు పశువైద్యశాల భవనం ఇలా..

పశువైద్యశాల భవనాలు శిథిలావస్థకు చేరడంతో సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. వర్షాలకు భవనం పైకప్పు నుంచి నీరు కారడంతో కూర్చునేందుకు వీలు కావడం లేదని వాపోతున్నారు. పశువైద్య పరికరాలు, మందులు తడిసిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైకాపా ప్రభుత్వం అయిదేళ్లలో భవనాల మరమ్మతులకు పైసా నిధులివ్వకపోవడంతో పరిస్థితి దారుణంగా మారింది.

నందిగామ డివిజన్లోని కొన్ని పశువైద్యశాలలు శిథిలావస్థకు చేరుకున్నాయి. నందిగామ మండలంలోని మాగల్లు పశువైద్యశాల పరిధిలో 15 గ్రామాలకు సేవలు అందుతున్నాయి. 5 వేల పశువులు, 15 వేల జీవాలకు వైద్యం అందజేస్తున్నారు. చాలా ఏళ్ల కిందట నిర్మించిన పశువైద్యశాల భవనం శిథిలమైంది. వర్షం కురిసిన సమయంలో శ్లాబు నీరు కారుతోంది. పశువైద్యురాలు, సిబ్బంది కూర్చునే పరిస్థితి లేదు. వైద్యశాలకు ప్రహరీ లేదు. రాత్రి వేళ కొందరు ఆసుపత్రిలో మద్యం తాగుతున్నారు. పశువులకు వైద్యం చేసే బోనుకు చాటు లేక ఇబ్బంది అవుతోంది. ప్రహరీ నిర్మిస్తే కొంతమేర అవస్థ తీరుతుంది. చందర్లపాడు మండలం కొడవటికల్లు, పెనుగంచిప్రోలు మండలం ముండ్లపాడు, ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు, జుజ్జూరు పశువైద్యశాలల భవనాలు శిథిలావస్థకు చేరాయి. వీటికి మరమ్మతులు చేయించాలి. ఇటీవల వరదలకు పశువైద్యశాలల్లోకి నీరుచేరాయి.

నీరు కారుతోంది

పశువుల ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరింది. వర్షం కురిస్తే భవనం పైకప్పు నుంచి నీరుకారి కూర్చోలేకపోతున్నాం. మందులు, పరికరాలను ఓ గదిలో నిల్వ చేశాం. ప్రహరీ లేక రాత్రి వేళ ఇక్కడే మద్యం తాగుతున్నారు. పంచాయతీ నిధులతో మరమ్మతులు చేయించాలని కోరాం.
- **సాగరిక, వీఏఎస్, మాగల్లు**

ప్రతిపాదనలు పంపుతాం

డివిజన్లో మరమ్మతు చేయాల్సిన భవనాల వివరాలను పశువైద్యుల నుంచి తెప్పిస్తాను. శిథిలావస్థకు చేరిన పశువైద్యశాలల మరమ్మతులకు ప్రతిపాదన పంపుతా. పశువైద్య సేవలు సక్రమంగా సాగేలా చర్యలు తీసుకుంటా. - **మోసెస్‌వెస్లీ, పశువైద్యశాల డిప్యూటీ డైరెక్టర్, నందిగామ**

కళావేదిక నిర్మాణం.. భావితరాలకు ఆదర్శం



రిబ్బను కత్తిరిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: తాను చదువుకున్న పాఠశాలకు, తాను ప్రస్తుతం ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న విద్యాలయానికి తనవంతుగా రుణం తీర్చుకోవాలని బాదె నాగేశ్వరరావు దంపతులు రూ.5లక్షలతో నిర్మించిన కళావేదిక భావితరాలకు ఆదర్శమని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య అన్నారు. జగ్గయ్యపేట బాలుర హైస్కూల్లో నూతనంగా నిర్మించిన కళావేదికను ఆయన గురువారం ప్రారంభించారు. దాతలైన నాగేశ్వరరావు దంపతులను సత్కరించారు. ప్రధానోపాధ్యాయిని మాధవీలత, మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పల్లెలకు పూర్వ వైభవం తీసుకొస్తాం

వత్సవాయి, న్యూస్‌టుడే: పల్లెలకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య పేర్కొన్నారు. పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని మంగొల్లులో 35, తాళ్లూరులో రూ.20 లక్షలతో చేపట్టనున్న సిమెంటు రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షుడు వడ్లముడి రాంబాబు, మన్నెం నారాయణరావు, బొల్లం పురుషోత్తం, సర్పంచి అన్నెపాక ప్రణీత, ఎంపీడీవో రాంబాబు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సామినేనికి అభినందనల వెల్లువ

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభానును పలువురు అభినందనలతో ముంచెత్తారు. గురువారం విజయవాడలో ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)ని మర్యాదపూర్వకంగా కలిసిన ఉదయభానుకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. విజయవాడ ఆటోమొబైల్ టెక్నీషియన్ల సంఘం అధ్యక్షుడు రాజనాల బాల్జి తమ ప్రతినిధులతో కలిసి వచ్చి ఉదయభానును సత్కరించారు. గురువారం నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి జనసేనలో చేరిన వారికి ఉదయభాను కండువాలు కప్పి ఆహ్వానించారు. గోపినేనిపాలెం ఎంపీటీసీ తేజావతు హుస్సేన్‌నాయక్ తదితరులు జనసేనలో చేరినవారిలో ఉన్నారు.

లోకేశ్ చొరవ అందరికీ ఆదర్శం

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: జగ్గయ్యపేట పట్టణం సత్యనారాయణపురానికి చెందిన పదిల వెంకట మహేష్ దంపతుల కుమారుడికి సకాలంలో సమయానికి ఖరీదైన వైద్యం అందించేలా మంత్రి లోకేశ్ చూపిన చొరవ అందరికీ ఆదర్శమని ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య అన్నారు. గురువారం ఆయన సత్యనారాయణపురంలోని మహేష్ ఇంటికి వెళ్లి ప్రాణాపాయం నుంచి బయటపడి డిశ్చార్జి అయిన చిన్నారి ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వార్డు పార్టీ ఇన్‌ఛార్జి పితాని శ్రీనాథ్ ద్వారా విషయం తెలుసుకున్న ఆయన ప్రజాదర్బార్ వంటి వినూత్న ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి ఎన్నో సమస్యలను పరిష్కరిస్తోందన్నారు. నారా లోకేశ్‌కి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వైద్య ఖర్చులకు తోడ్పాటు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని గోళ్లమూడి గ్రామానికి చెందిన కటారపు నాగరాణి వైద్య ఖర్చులకు రూ.60 వేలు ఎల్‌వోసీ పత్రాన్ని ఎమ్మెల్యే తాతయ్య అందజేశారని తెదేపా గ్రామ అధ్యక్షుడు జి.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ వైద్యానికి ఎల్‌వోసీ పత్రం ఇచ్చినందుకు ఆయన కృతజ్ఞతలు చెప్పారు.

నాట్య సమ్మేళనంలో చిన్నారుల ప్రతిభ



బంగారు పతకాలు, ధ్రువపత్రాలతో చిన్నారులు

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ఈ నెల 13న ఒంగోలు లిటిల్ ఛాంప్స్ అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన కూచిపూడి నాట్య సమ్మేళనంలో జగ్గయ్యపేటకు చెందిన భవానీ నాట్య అకాడమీ చిన్నారులు ప్రతిభ చూపారు. వారికి గురువారం బంగారు పతకాలు, షీల్డ్, సర్టిఫికెట్లు అందించారు. నాట్య గురువు భవానీ వారిని అభినందించారు. సాయి దీక్షిత, షేక్ రేష్మా, మనస్వీలు ఈ నాట్య సమ్మేళనంలో ప్రతిభచూపారు.

నట్టల నివారణ మందుల పంపిణీ

కంచికచర్ల, న్యూస్‌టుడే: నట్టల కారణంగా గొర్రెలు, మేకలు ఆహారం సరిగా తినక బరువు తగ్గుతాయని మండల పశు వైద్యాధికారి విజయ్ విశ్వనాథ్ అన్నారు. మండలంలోని గండేపల్లి, మోగులూరు గ్రామాలలో నట్టల నివారణకు గురువారం మందులు పంపిణీ చేశారు. జీవాల పెంపకం దారులకు పలు సూచనలు చేశారు.

స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకొని స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై స్వర్ణకార సంఘం అధ్యక్షుడు, తెదేపా బీసీ విభాగం నాయకుడు కర్రి శేషగిరిరావు (చిన్నా) హర్షం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక బంగారు కొట్ల సెంటర్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. నాడు నారాలోకేశ్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీని అమలు చేసి స్వర్ణకార కార్మికులకు ఎంతో మేలు చేశారన్నారు. సంఘం ప్రతినిధులు బసవోజు శశి, బాజీ, అఫ్జల్, ప్రభాకర్, చిన్నా, శశిధర్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

జగ్గయ్యపేట: 8008 574714, నందిగామ: 8008 574713

స్పందనకు వందనం

★ కంచికచర్ల ప్రణీత కాలనీలో చర్చి పక్కన దారిలో మురుగు నీరు నిల్వ ఉండడంతో దుర్వాసన, దోమలతో ఇబ్బంది పడుతున్నామని గ్రామానికి చెందిన హనుమంతరావు మేమున్నాం..మీకు మీతోడుగా ద్వారా పంచాయతీ కార్యదర్శి బ్రహ్మంకు తెలియజేశారు. స్పందించిన ఆయన మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టారు

★ వేములపల్లి-పెండ్యాల రహదారి పక్కన కాలువలో వ్యర్థాలు పేరుకుపోయి మురుగు నీరు ప్రధాన రహదారిపైకి చేరుతుందని గ్రామానికి చెందిన రమేష్ మేమున్నాం..మీకు తోడుగా ద్వారా పంచాయతీ కార్యదర్శి రాంజీకి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన సిబ్బందితో కాలవలో పేరుకున్న వ్యర్థాలను తొలగింపజేశారు

★ గండేపల్లి ఆర్సీఎం చర్చి వద్ద చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వస్తుందని గ్రామానికి చెందిన వీరారావు పంచాయతీ కార్యదర్శి జె.రత్నాకర్‌కు ఫిర్యాదు చేయడంతో స్పందించిన ఆయన సిబ్బందితో చెత్తను తొలగింపజేశారు.

★ బత్తినపాడు-మున్నలూరు రహదారిలో వీధి దీపం వెలగడం లేదని గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావు పంచాయతీ కార్యదర్శి హరికృష్ణకు ఫిర్యాదు చేయగా, స్పందించిన ఆయన వీధి దీపాన్ని మార్పించారు. **-న్యూస్‌టుడే, కంచికచర్ల**

పుణ్యక్షేత్రం మార్గానికి మరమ్మతులు



ఈనాడు కథనానికి స్పందన

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుమలగిరి క్షేత్రానికి వెళ్లే దారిలో జాతీయ రహదారి వద్ద ఉన్న మలుపు ప్రమాదకరంగా ఉన్న విషయమై గత నెల 4న ఈనాడులో 'దైవదర్శనం కావాలంటే.. ఈ ప్రమాదాన్ని దాటాల్సిందే' శీర్షికన ప్రచురితమైన కథనంపై స్థానిక స్వపరిపాలన సంస్థ వారు స్పందించారు. గుంతలను పూడ్చి వాహనాల రాకపోకలకు మార్గాన్ని సుగమం చేశారు.

నీటి సంఘం మాజీ అధ్యక్షుడు నరసింహారావు మృతి

పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలు నీటి సంఘం మాజీ అధ్యక్షుడు, తెదేపా సీనియర్ నాయకుడు బిక్కి నరసింహారావు (53) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, మండల తెదేపా అధ్యక్షుడు చింతల సీతారామయ్య తదితరులు మృతదేహానికి నివాళులు అర్పించారు.

ఘనంగా వాల్మీకి జయంతి



రాఘవాపురంలో వాల్మీకి విగ్రహానికి పూజలు చేస్తున్న తెదేపా నాయకులు సాంబశివరావు, వీరాస్వామి



కంచికచర్ల గ్రంథాలయంలో ..

నందిగామ గ్రామీణం, కంచికచర్ల, న్యూస్‌టుడే: మండలంలోని రాఘవాపురంలో వాల్మీకి మహర్షి జయంతిని గురువారం వైభవంగా నిర్వహించారు. వాల్మీకి విగ్రహానికి సొసైటీ మాజీ అధ్యక్షుడు సీహెచ్.సాంబశివరావు, జి.పూర్ణచంద్రరావు, తెదేపా మండల అధ్యక్షుడు వి.వీరాస్వామి నివాళులర్పించారు. గ్రామ తెదేపా అధ్యక్షుడు కె.సత్యనారాయణ, వాల్మీకి అభిమాన సంఘం నాయకులు కృష్ణా రాము, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

★ కంచికచర్ల గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయాధికారి ఎ.రామచంద్రుడు వాల్మీకి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకొని జగ్గయ్యపేటలో పలుచోట్ల కార్యక్రమాలను నిర్వహించారు. పట్టణంలోని మిట్టగూడెంలో ఉన్న వాల్మీకి మందిరంలో ఆ సంఘం ఆధ్వర్యంలో విశేష పూజలు, కార్యక్రమాలు జరిగాయి. బాలుర హైస్కూల్లో నూతనంగా ప్రారంభించిన కళావేదికపై నిర్వహించిన వాల్మీకి మహర్షి జయంతిలో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర పాల్గొన్నారు. చేగు విద్యాలయంలో చేగు వెంకటప్పయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి వందనాలు సమర్పించారు.

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని గండ్రాయి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం వాల్మీకి జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్‌బాబు మాట్లాడుతూ.. భారతీయులు పరమపవిత్రంగా భావించే రామాయణం సృష్టికర్త అని, వాల్మీకి జీవిత చరిత్రను పిల్లలకు వివరించారు. ఉపాధ్యాయులు సుబ్బారావు, కృష్ణంరాజు, ఆయా వెంకటరావమ్మ తదితరులు పాల్గొన్నారు.



జగ్గయ్యపేటలో..



జగ్గయ్యపేటగ్రామీణం: గండ్రాయి ప్రాథమిక పాఠశాలలో..

వరద బాధితులకు సాయం

కొత్తపేట(కంచికచర్ల), న్యూస్‌టుడే: గత నెలలో వరద బారిన పడిన కొత్తపేట వరద బాధితులకు నందిగామ క్రీస్తు సంఘం ఆధ్వర్యంలో గురువారం దుప్పట్లు, నిత్యావసరాలు పంపిణీ చేశారు. అమెరికాకు చెందిన డా.మణి ఆనంద్ ఆర్థిక తోడ్పాటుతో వరద బాధితులకు వీటిని పంపిణీ చేసినట్లు పాస్టర్ పి.దేవ సహాయం తెలిపారు. బాధితులు సంఘం ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.



నిత్యావసరాలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న సంఘం ప్రతినిధులు

సీసీ రహదారులకు శంకుస్థాపన

చెన్నారావుపాలెం(వీరులపాడు), న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'పల్లె పండగ' కార్యక్రమంలో భాగంగా చెన్నారావుపాలెంలో నిర్మించనున్న సీసీ రహదారులకు గురువారం శంకుస్థాపన నిర్వహించారు. ఎన్డీయే కూటమి గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉందని నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

చందర్లపాడు, న్యూస్‌టుడే: గుడిమెట్లలో పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా సిమెంటు రోడ్డు ఏర్పాటు పనులకు ఇన్‌ఛార్జి ఎంపీడీవో నాంచారయ్య గురువారం భూమి పూజ చేశారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఏపీవో వెంకటేశ్వరరావు, ఈవోఆర్డీ ఏసుబాబు, రామారావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ విఫలమైందని యువకుడి ఆత్మహత్య

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: మండలంలోని ముచ్చింతాలకు చెందిన చందు (20) ప్రేమ విఫలమైన బాధతో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై అర్జున్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం... నందిగామ మండలం కేతవీరునిపాడు గ్రామానికి చెందిన చందు తన అమ్మమ్మ ఊరైన ముచ్చింతాలలో గత కొంతకాలంగా ఉంటున్నాడు. ఈ నెల 14న పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. తన కుమారుడు ప్రేమ విఫలమైందన్న బాధతో ఆత్మహత్య చేసుకున్నాడని తండ్రి వెంకయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అనారోగ్య సమస్యలతో బలవన్మరణం

జగ్గయ్యపేట: జగ్గయ్యపేట పట్టణంలోని డాంగెనగర్‌కి చెందిన బరిశెట్టి శ్రీనివాస్ (59) అనారోగ్య సమస్యలను తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై వెంకటేశ్వరరావు కథనం ప్రకారం.. రెండేళ్ల కిందట పక్షవాతానికి గురైన శ్రీనివాస్ మంచానికే పరిమితమై తీవ్రమైన నొప్పులతో బాధపడుతున్నాడు. బుధవారం రాత్రి పట్టణ శివారులోని పొలం వద్దకు వెళ్లి పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. రాత్రివేళలో ఇది గుర్తించిన కొడుకు మహేష్ స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమంగా ఉందని విజయవాడకు తరలించారు. విజయవాడలో ఆయన చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

భర్త వేధింపులపై భార్య ఫిర్యాదు

జగ్గయ్యపేట: భర్త తనను వేధిస్తున్నాడంటూ పట్టణానికి చెందిన వేముల సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు వేముల సాంబశివరావు అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారు.

భవన నిర్మాణ కార్మికుల కష్టాలు తీర్చండి

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ విధానాల వల్ల తీవ్రంగా కష్టాలను ఎదుర్కొన్న భవన నిర్మాణ కార్మికులు కూటమి ఇచ్చిన ఎన్నికల హామీపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని సీఐటీయూ ప్రతినిధులు ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్యకు విన్నవించారు. గురువారం భవననిర్మాణ కార్మిక సంఘంతో కలిసి వచ్చిన వారు ఎన్నికల మానిఫెస్టోలోని భవననిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించేలా చూడాలని, అన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. జిల్లాలో సుమారు 1.5లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు గత వైకాపా ప్రభుత్వంలో ఆపేసిన ఇసుక క్వారీల వల్ల ఇబ్బంది పడ్డారని, సంక్షేమ పథకాలు ఆపేస్తూ ఇచ్చిన 1214 మెమో తమ నడ్డి విరిచిందని పేర్కొన్నారు. స్వయంగా పలువురు మంత్రులు సైతం తమ సమస్యలను గురించి ప్రస్తావించినా సంక్షేమ బోర్డు అమలు ఇంకా జరగలేదని, ప్రభుత్వానికి తమ వినతి తెలియజేయాలని కోరారు. గత నెల నుంచి వరదల కారణంగా ఆగిపోయిన ఇసుక సరఫరా తర్వాత ప్రారంభమైనా ఆన్‌లైన్ విధానం కొందరికే అనుకూలంగా ఉండడంతో కార్మికులు పని లేకుండా ఉపాధి కోల్పోతున్నారన్నారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు షేక్ గౌసమియా, బి.రాము, రామనాథం, కె.రవి, కె.రాంబాబు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఫ్లెక్సీల తొలగింపు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: జగ్గయ్యపేట పట్టణాన్ని ఫ్లెక్సీ రహిత పురపాలక సంఘంగా మార్చాలన్న సంకల్పంతో మూడు రోజుల కిందట ప్రారంభించిన ఫ్లెక్సీల తొలగింపు కార్యక్రమం కొనసాగుతోంది. పురపాలిక సిబ్బంది ప్రధాన రహదారిలోని ఫ్లెక్సీలను పూర్తిగా తొలగిస్తున్నారు. కేవలం దీపావళి శుభాకాంక్షలతో ఉన్న బ్యానర్లు మినహాయించి అన్నింటిని తొలగించాలని తీసుకున్న నిర్ణయం అమలు చేస్తున్నామని ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు.

876 క్యూసెక్కుల సాగర్ జలాలు

గంపలగూడెం, న్యూస్‌టుడే: ఎన్నెస్పీ రెండో జోన్ పరిధిలోని మధిర బ్రాంచి కెనాల్‌కు గురువారం ఖమ్మం జిల్లా కల్లూరు మండలం కప్పలబంధం వద్ద ప్రధాన కాల్వ నియంత్రిక నుంచి 876 క్యూసెక్కులు సాగర్‌జలాలు విడుదలైనట్లు ఏఈ మహేష్ తెలిపారు. గంపలగూడెం మండల సరిహద్దులోని 23వ కి.మీ వద్దకు 294 క్యూసెక్కులు చేరగా, దిగువున మేజర్ల వారీగా గంపలగూడెం 25, ఊటుకూరు 40, పెదకొమిర 20, మధిర 20, నిదానపురం 30 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయకట్టు రైతులు మిరప, పత్తి, వరి పంటలకు నీటి తడులు అందించేందుకు కాల్వలకు సరఫరా చేస్తున్న సాగర్‌జలాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిబంధనల ప్రకారం మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాలి

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మద్యం షాపులను ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏర్పాటు చేయాలని కోరుతూ పట్టణంలోని తహసీల్దారుకు, ఎక్సైజ్ సీఐ గురమయ్యకు సీపీఐ నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అంబోజి శివాజి మాట్లాడుతూ మద్యం షాపులను గుడి, బడి, ఆస్పత్రులు, ప్రజల నివాస ప్రాంతాలకు దూరంగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు అమలు చేయకపోతే ప్రజల పక్షాన సమస్య పరిష్కారం అయ్యేవరకు పోరాటం చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ గురవయ్య మాట్లాడుతూ నిబంధనలు మీరితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పోతుపాక వెంకటేశ్వర్లు, మెటికల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కారును ఢీకొట్టి కారు బోల్తా

ముగ్గురికి తీవ్ర గాయాలు



కంచికచర్ల, న్యూస్‌టుడే: వెనుక నుంచి వేగంగా వస్తున్న కారు ముందు వెళ్తున్న కారును ఢీకొని బోల్తా పడి ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన కంచికచర్ల శివారు జాతీయ రహదారి వద్ద గురువారం చోటుచేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం... విజయవాడ నుంచి హైదరాబాద్ వెళుతున్న కారు కంచికచర్ల ఫ్లైఓవర్ వద్దకు వచ్చే సరికి అదే సమయంలో సర్వీస్ రహదారి నుంచి జాతీయ రహదారి పైకి వచ్చిన మరో కారును వెనుక నుంచి ఢీకొట్టి బోల్తా పడింది. కారులో ప్రయాణిస్తున్న తులసి, సత్యవతి, రాధారమణి అనే ముగ్గురికి తీవ్ర గాయాలవ్వగా, చికిత్స నిమిత్తం విజయవాడ తరలించినట్లు తెలిపారు. వేగంగా కారు నడిపి ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విజయవాడ పశ్చిమ


అన్నప్రసాదం వితరణ ఇలా..

ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలి

చిట్టినగర్, న్యూస్‌టుడే : ప్రజలంతా ఆయురారోగ్యాలతో పాటు సుఖశాంతులతో ఉండాలని తెలుగు యువత పశ్చిమ నియోజకవర్గ అధ్యక్షుడు ఆర్.మాధవ్ అన్నారు. అమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆంజనేయ సెంటర్‌లో అన్నప్రసాద వితరణ కార్యక్రమం గురువారం నిర్వహించారు.

17 మందికి జరిమానా

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : నగరంలో రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై చర్యలు తీసుకుంటున్నారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ఆదేశాల మేరకు నగర వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. 2, 4 ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల అధికారులు.. 17 మందిపై కేసులు నమోదు చేశారు. సంబంధిత కోర్టులో ప్రవేశపెట్టగా.. ఆరుగురికి రూ.15వేలు, 11 మందికి రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి లెనిన్‌బాబు తీర్పు చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

విజయవాడ పశ్చిమ: 80085 74638

? కలరా ఆసుపత్రి ఎదురువీధి, ప్రధాన రహదారిలో వాహనాలు వేగంగా వెళ్తున్నాయి. వేగనిరోధకాలు ఏర్పాటు చేయాలి.
– గుగ్గిలం విజయకుమార్, సిండికేటు బ్యాంకు కాలనీ
✔ పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం.
– ప్రసావ్, సర్కిల్‌–1 ఈఈ

? మరుపిళ్ల చిట్టి పార్కు ఎదురుగా రోడ్డుపై పెద్ద గొయ్యి పడి ప్రమాదంగా ఉంది. మరమ్మతులు చేయాలని కోరుతున్నాం.
– వినయ్‌కుమార్, కేఎల్‌రావునగర్
✔ మరమ్మతులు చేయిస్తాం. – శ్రీనివాస్, ఏఈ

? గుజ్జరి ఎల్లారావు కూరగాయల మార్కెట్ సముదాయంలో మురుగుదొడ్డి అధ్వానంగా ఉన్నాయి. శుభ్రం చేయించాలి.
– టి.రామకృష్ణ, చిట్టినగర్
✔ మరుగుదొడ్డు శుభ్రం చేయిస్తాం.
– వేణుగోపాల్, శానిటరీ అధికారి

? లంబాడీపేట కొండప్రాంతంలో తాగునీరు సరఫరా సక్రమంగా అందడం లేదు. – ఆస్మా, లంబాడీపేట
✔ పరిశీలించి తాగునీటి ఇబ్బంది లేకుండా చూస్తాం.
– రాజేష్ ఏఈ – చిట్టినగర్, న్యూస్‌టుడే

వరద బాధితులకు ఆసరా

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే : బుడమేరు కనీవినీ ఎరుగని రీతిలో వరదలు రావడంతో ప్రజలు తీవ్రంగా నష్టపోయారని.. వారిని ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని జగతి ఫౌండేషన్ అధ్యక్షురాలు దుర్గా కళ్యాణి పేర్కొన్నారు. హైదరాబాద్ కేర్ ఆసుపత్రి సహకారంతో సింగ్‌నగర్‌లోని బూడాల ఆడాం కల్యాణ మండపంలో వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. వరదలతో నష్టపోయిన వారికి తమ వంతు సాయంగా నిత్యావసరాలను అందిస్తున్నామని ఆమె చెప్పారు. అజిత్‌సింగ్‌నగర్ ఎస్సై సేనాపతి శ్రీనివాసరావు, ఏఎస్సై కోటేశ్వరరావు, జగతి ఫౌండేషన్, కేర్ ఆసుపత్రి ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆక్రమణల చెరలో రహదారులు

తప్పని ట్రాఫిక్ వెతలు


కృష్ణవేణి మార్కెట్ వద్ద ఆక్రమణలు ఇలా..

చిట్టినగర్, న్యూస్‌టుడే

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నగరంలో ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. వాహనాల రాకపోకలతో పశ్చిమ నియోజకవర్గంలో ట్రాఫిక్ వెతలు తప్పడం లేదు. అసలే ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడుతుంటే రహదారికి రెండువైపులా ఆక్రమణలతో సమస్య జటిలమైంది. అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో ఆక్రమణలకు హద్దులేకుండా పోతోంది. ప్రజలకు ట్రాఫిక్ అవస్థలు తప్పడం లేదు.


ప్రైజర్‌పేట రహదారిలో

పశ్చిమ నియోజకవర్గంలో ప్రధాన రహదారులు విస్తరించినప్పటికీ ఆక్రమణల చెరలోనే మగ్గుతున్నాయి. ప్రధానంగా పంజా సెంటర్ సమీపంలో జెండా చెట్టు ప్రాంతం, కృష్ణవేణి హోల్‌సేల్ క్లాత్ మార్కెట్ పక్కన ప్రధాన రహదారికి ఆనుకుని కస్తూరిబాయి నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాల, పోలేరమ్మ గుడి దుకాణాల సముదాయం ఉండేవి. ట్రాఫిక్ ఇబ్బందుల నేపథ్యంలో తెదేపా ప్రభుత్వం హయాంలో రోడ్డు విస్తరణలో భాగంగా వాటిని తొలగించి వేరే ప్రాంతానికి తరలించారు. అనంతరం గత ప్రభుత్వం కృష్ణవేణి మార్కెట్ నుంచి కొత్తపేట నెహ్రూబొమ్మ సెంటర్ వరకు, అక్కడ నుంచి చిట్టినగర్ వరకు రూ. కోట్లు వెచ్చించి రోడ్డు నిర్మించింది. పాఠశాల, దుకాణాల సముదాయం తొలగించిన ప్రాంతంలో వాహనాలు నిలుపుతున్నారు. అక్కడే ఆటోలు, ఇతర వాహనాల మరమ్మతులు చేయడం, పాత ట్రాక్టర్ల విడిభాగాల విక్రయాలు చేస్తున్నారు. దీంతో ఆక్రమణలతో రోడ్డు సగానికి పైగా కుంచించుకుపోయింది. అమ్మ హోటల్ నుంచి మిలాప్ హోటల్ వరకు రోడ్డు పక్కన పాత ట్రాక్టర్లు, పాత తలుపులు, చెక్కలు, గుమ్మాలు వంటి వ్యాపారులకు అవకాశం ఇచ్చారు. మళ్లీ గణపతిరావు రోడ్డులోకి ఆయా వ్యాపారాలు విస్తరించడం వల్ల రోడ్డు విస్తరించిన ప్రయోజనం లేకుండా పోయింది.

ఎర్రకట్ట రహదారి

చిట్టినగర్ నుంచి ఎర్రకట్ట, కేదారేశ్వరపేట వరకు రహదారి నిత్యం వేలాది వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. అసలే ఆ రహదారి ఇరుకుగా ఉంటుంది. దానికి తోడు రెండువైపులా చిరు వ్యాపారులు, ఆక్రమ కొనుగోలుదారులతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. చిట్టినగర్ నుంచి ప్రైజర్‌పేట, మసీదు వరకు అడ్డగోలుగా రోడ్డు ఆక్రమించారు. ఆ మార్గం బాగా కుంచించుకుపోయి ప్రమాదాలకు తావిస్తోంది. ఇటు ట్రాఫిక్ పోలీసులు గానీ, అటు నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ అధికారులు గానీ తమకేమీ పట్టనట్లు ఉంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

సాంకేతిక ఫలాలు సామాన్యులకు చేరినప్పుడే సార్థకత

చిట్టినగర్, న్యూస్‌టుడే : ప్రపంచ వ్యాప్తంగా సాధిస్తున్న సాంకేతిక ఫలాలు సామాన్యులకు చేరువైనప్పుడే వాటికి సార్థకత లభిస్తుందని బెస్ట్ టెక్నాలజీస్ డైరెక్టర్ షేక్ అష్రఫ్ అలీ అన్నారు. పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో వీఎల్ఎస్ఐ డిజైన్ టెస్ట్ బులిటీ అండ్ ఫిజికల్ డిజైన్ అనే అంశంపై ఐదు రోజుల పాటు నిర్వహించే కార్యశాల గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం సెమీ కండక్టర్ రంగంలో అద్భుతమైన ప్రగతిని సాధించిందన్నారు. విద్యార్థులు ఆయా రంగాల్లో చోటు చేసుకుంటున్న మార్పులను, అభివృద్ధిని గమనించి ఆధునాతన నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి అమరేసుదీర్, ఉపాధ్యక్షుడు సురేంద్రకుమార్, కోశాధికారి రామయ్య, బెస్ట్ టెక్నాలజీస్ కంపెనీ డైరెక్టర్ ఉపేంద్రవ, కళాశాల ప్రిన్సిపల్ పతంజలిశాస్త్రి, విభాగాధిపతి ఎం.రంగారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బెస్ట్ టెక్నాలజీస్ డైరెక్టర్ షేక్ అష్రఫ్ అలీ, వేదికపై ప్రిన్సిపల్ పతంజలిశాస్త్రి, తదితరులు

వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేస్తే చర్యలు : సుజనా చౌదరి

భవానీపురం, న్యూస్‌టుడే : శాసనసభ్యుడి తాలూకా మనుషులం అని, తన పేరును ఉపయోగించి వ్యాపారుల నుంచి ఎవరైనా వసూళ్లకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటానని పశ్చిమ శాసనసభ్యుడు సుజనా చౌదరి హెచ్చరించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెట్టారు. వ్యక్తిగతంగా తాను, ఎన్డీయే ప్రభుత్వం ఎల్లవేళలా వ్యాపారుల శ్రేయస్సు కోరుకుంటామని పేర్కొన్నారు. నియోజకవర్గంలో నూతనంగా వ్యాపారం ప్రారంభించే వారి వద్ద నుంచి లంచాలు ఇవ్వమని కోరినా, బెదిరించినా, లంచాలు వసూలు చేసినా భవానీపురంలోని పార్టీ కార్యాలయంలో సంప్రదించి సదరు వ్యక్తుల వివరాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. సదరు వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

నూతన వధూవరులకు ఉచిత వేద ఆశీర్వచనం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : ఇంద్రకీలాద్రిపై నూతన వధూవరులకు ఆశీర్వచన మండపంలో వేద పండితులు ఉచిత ఆశీర్వచనం చేస్తారని ఈవో రామారావు తెలిపారు. పెళ్లి దుస్తుల్లో వచ్చిన జంటలకు ఉచితంగా అమ్మవారి దర్శనంతో పాటు వేద ఆశీర్వచనం గురువారం చేశారు. నూతన జంటలు కొత్త జీవితం అమ్మవారి సన్నిధి నుంచి మొదలవుతుందన్న విశ్వాసం భక్తుల్లో నింపేందుకు ఈనిర్ణయం తీసుకున్నట్లు ఈవో తెలిపారు.


ఆశీర్వచన మండపంలో వధూవరులకు అమ్మవారి ప్రసాదం అందజేస్తున్న ఈవో రామారావు

రాత పుస్తకాల అందజేత

మధురానగర్, న్యూస్‌టుడే : గుణదల ఒకటో డివిజన్‌లోని మడోనా మూగ, చెవిటి పాఠశాల విద్యార్థులకు క్లైకూరు రాయల్ క్లబ్ ఆసోసియేషన్ వారు రాత పుస్తకాలు అందించారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు చేతుల మీదుగా 500 మంది విద్యార్థులకు ఏడాదికి సరిపడా పుస్తకాలు, జామెట్రీ బాక్సులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఇటువంటి విద్యార్థుల మాదిరిగానే బధిర విద్యార్థులకు చక్కని జీవిత అందిస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. రాయల్ క్లబ్ ఆసోసియేషన్ తరఫున సుంకర కృష్ణ, వల్లభనేని సతీష్, సురేష్, రామిశెట్టి విజయకుమార్ పాల్గొన్నారు.


విద్యార్థినికి రాత పుస్తకాలు అందిస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు. పక్కన కృష్ణ, సతీష్

రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి కృషి


శాప్ చైర్మన్ రవినాయుడుని సన్మానిస్తున్న ఎంపీ శివనాథ్

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పేర్కొన్నారు. స్థానిక బీజేపీ నివాసంలో శాప్ కార్యాలయంలో శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడును గురువారం ఆయన మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసీఏ తరఫున క్రికెట్ పాటు ఇతర క్రీడలకు కూడా ప్రోత్సాహిస్తామన్నారు. చైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మార్గదర్శకం మేరకు అందరి ప్రోత్సాహంతో రాష్ట్రాన్ని క్రీడాప్రదేశ్‌గా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు.

ఆర్టీసీ హౌస్‌లో ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు


వాల్మీకి చిత్రపటం వద్ద జ్యోతి వెలిగిస్తున్న ఈడీ చంగల్‌రెడ్డి

విజయవాడ బస్‌స్టేషన్, న్యూస్‌టుడే: పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లోని ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో గురువారం మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఇంజినీరింగ్) టి. చంగల్‌రెడ్డి పాల్గొని జ్యోతి వెలిగించారు. అనంతరం వాల్మీకి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్(పర్సనల్) స్వరూపానందరెడ్డి, విజిలెన్స్ ఏడీ శోభామంజరి, డీటీఏం సత్ర శ్రీనివాసరావు, వివిధ అసోసియేషన్ల నాయకులు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త సేకరణ బండ్ల పంపిణీ

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే : స్థానిక 58వ డివిజన్ సచివాలయాలకు గురువారం చెత్త సేకరణ బండ్లను అందించారు. పాతవి పాడైపోవడంతో తెదేపా నాయకులు అల తారక రామారావు తదితరులు నగరపాలక సంస్థ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. వారు స్పందించి ఆయిదు బండ్లను సమకూర్చారు. గురువారం వాటిని పారిశుద్ధ్య సిబ్బందికి అందించారు.

బదిలీ అయ్యారు.. రిలీవ్ కాలేదు..

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళికా విభాగంలో సుదీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తున్న పలువురు ప్రణాళికాధికారులను ప్రభుత్వం సెప్టెంబరు నెలలో బదిలీ చేసింది. ఆ సమయంలో నగరంలో వరదలు సంభవించడంతో తాత్కాలికంగా వారు ఇక్కడే కొనసాగేందుకు వీలుగా ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. దీంతో నగరంలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న వీఎంపీ రమణారెడ్డి, కె.అరుణ, కె.ఆష, కె.వెంకటేశ్వర్రావు, శేషుబాబు, కొండలరావు తదితర టీపీఎస్‌లు నాటి నుంచి ఇక్కడే విధుల్లో కొనసాగుతున్నారు. ఆ వెంటనే వీరిని రిలీవ్ చేసేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించినా సంబంధిత అధికారులు వారిని రిలీవ్ చేయడం లేదు. దీని పలితంగా ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చినవారు సైతం ఇక్కడ విధుల్లో చేరడం లేదు. నగరపాలక సంస్థ ఉన్నతాధికారులు కావాలనే వారిని రిలీవ్ చేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. అదే అదనుగా వీరిలో కొందరు ప్రణాళికాధికారులు పలు అక్రమాలకు పాల్పడుతూ అనుమతి లేని, అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి.

డీసీపీ జూబెన్ బదిలీ..!

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థలో డిప్యూటీ సిటీ ప్లానర్(డీసీపీ)గా విధులు నిర్వహిస్తున్న జూబిన్ వీరన్ రాయ్ బదిలీ అయ్యారు. ప్రభుత్వం ఆయన్ను సీఆర్‌డీఏకు బదిలీ చేసింది. దీంతో ఆయన విధుల నుంచి రిలీవ్ అయ్యారు. డిప్యూటేషన్‌పై నగరపాలక సంస్థకు వచ్చిన ఆయన అమృత్ సీఆర్‌డీఏకు బదిలీ అయ్యారు. ఆయితే 10 రోజుల్లోగా నగరపాలక సంస్థకు తిరిగి బదిలీ చేయించుకుని.. ఆ పదవి నుంచి సర్కిల్‌–1 ఏసీపీ బాధ్యతలతోపాటు, ప్రకటనలు, నగర ప్లానింగ్ వంటి పలు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. చాలా కాలంగా ఇక్కడే పనిచేస్తుండటంతో టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్, ఎంపీయూడీ అధికారుల సూచనలకు అనుగుణంగా ఆయన్ను ప్రభుత్వం ప్రస్తుతం బదిలీ చేసింది.

అంతర్గతంగా ఏసీపీలకు..

విజయవాడ నగరపాలక సంస్థ: నగరపాలక సంస్థ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఏసీపీలకు అంతర్గత బదిలీ అయ్యింది. కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు ప్రణాళికాధికారులు వారిని అంతర్గతంగా బదిలీ చేశారు. నగరంలోని సర్కిల్‌–2 పరిధిలో పనిచేస్తున్న పి.మోహన్‌బాబును అక్కడ నుంచి సర్కిల్‌–3కి బదిలీ చేశారు. మరోవైపు గుడివాడ నుంచి ఇటీవల నగరానికి బదిలీపై వచ్చిన వై.రాంబాబు సర్కిల్‌–2కు సర్దుబాటు చేశారు.

చెక్ బౌన్స్ కేసులో గుత్తేదారు అరెస్టు

భవానీపురం, న్యూస్‌టుడే : చెక్కు బౌన్స్ కేసులో గుత్తేదారును భవానీపురం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. గొల్లపూడిలో నివాసం ఉండే మరుపిళ్ల రవి దుర్గనగర్‌లో గుత్తేదారుగా ఉన్నారు. రవికి లక్ష్మీనారాయణ అనే వ్యక్తి కొన్నాళ్ల కిందట రూ.4లక్షలు ఇచ్చారు. డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరుతున్నా రవి స్పందించడం లేదు. దీంతో లక్ష్మీనారాయణ కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు భవానీపురం పోలీసులు రవిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

విజృంభిస్తున్న గ్రామ సింహాలు

కేదారేశ్వరపేట, న్యూస్‌టుడే

పశ్చిమ నియోజకవర్గ పరిధి 34వ డివిజన్‌లో గ్రామ సింహాలు విజృంభిస్తున్నాయి. రోడ్లపై గుంపులుగా చేరి ఒక్కసారిగా మీదపడి కరవడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. శునకాలు దారిన పోయే వాహన చోదకులపై కూడా తమ ప్రతాపాన్ని చూపుతున్నాయి. ఒకటో వీధి నుంచి ఐదో వీధి వరకు ఇదే పరిస్థితి నెలకొంది. గత పది రోజుల వ్యవధిలో సుమారు 20 మందికిపైగా వీటి బారినపడ్డారు. ఖుద్దూస్‌నగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఆర్‌వీ అందుబాటులో లేకపోవడంతో స్థానికులు బయట ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించారు. వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. లోటస్ ల్యాండ్ మార్క్‌కు వెళ్లే రహదారి, బసవతారకనగర్ తదితర ప్రాంతాల్లోనూ కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ఈ ప్రాంతంలో రైల్వే ఉద్యోగులు ఎక్కువగా నివసిస్తుంటారు. విధులు ముగించుకుని వచ్చే వారిని వెంబడించి మరీ కరవడంతో బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ఈ పరిస్థితి మరింత ఎక్కువగా ఉందని స్థానికులు చెపుతున్నారు.


రోడ్డుపై గుంపులుగా శునకాలు

మందులు అందుబాటులో ఉంచాలి

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో యాంటీ ర్యాబిస్ టీకా లేకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నా. సుమారు రూ. 14వేల వరకు ఖర్చయ్యాయి. ఈ ప్రాంతంలోని అన్ని వీధుల్లోనే ఇదే పరిస్థితి ఉంది. రాత్రి సమయాల్లో వాహనంపై రాకపోకలు సాగించాలంటేనే భయంగా ఉంది. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. నగరపాలక సంస్థ కమిషనర్ వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలి.



– వినుకొండ జార్జి, బసవతారకనగర్

పారిశుద్ధ్య నిర్వహణలో లోపాలు లేకుండా చూడాలి

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలో పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగరంలోని సింగ్‌నగర్, బుడమేరు వంతెన, ఇందిరానాయక్‌నగర్ ప్రాంతాల్లో ఆయన గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా బుడమేరు కెనాల్ బండ్‌ను పరిశీలించి అక్కడ పేరుకుపోయిన గుర్రపుడెక్కను వెంటనే తొలగించాలని, ప్రజలు వ్యాధుల బారిన పడకుండా డ్రైన్లలో సాయంతో ఎంఎల్ ఆయిల్‌ను పిచికారీ చేయాలని ఆదేశించారు. సింగ్‌నగర్ పైవంతెన ప్రాంతంలో పర్యటించి వంతెనపై రహదారి అవసరమైన మరమ్మతులు త్వరగా చేపట్టి పూర్తిచేయాలని సూచించారు. ఇందిరానాయక్ నగర్ పరిసర ప్రాంతాల్లో పర్యటించి అక్కడ పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేదని గుర్తించారు. బాధ్యులైన అధికారులు, సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ కాలువల్లో నిల్వున్న నీటిని యంత్రాల సాయంతో తొలగించాలని ఆదేశించారు. పర్యటనలో ఆయన వెంట అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, పి.సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్, రామకోటేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.


అధికారులకు సూచనలు చేస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

బీసీ రక్షణ చట్టం ఏర్పాటుపై సంబరాలు

మధురానగర్, న్యూస్‌టుడే : బీసీ కులాల ప్రజలు గౌరవప్రదమైన జీవనం కోసం తొలిసారిగా బీసీ రక్షణ చట్టం రూపొందించడం అభినందనీయమని బీసీ జన సేన అధ్యక్షుడు పి.వి.ఎల్.ఎన్.రాజు పేర్కొన్నారు. గురువారం మధురానగర్‌లోని నగర కార్యాలయంలో సంబరాలు నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ పిల్లి లక్ష్మీతులసి తదితరులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు బీసీ రక్షణ చట్టం తీసుకువచ్చారని కొనియాడారు. బీసీ డిక్లరేషన్‌లో భాగంగా అధికారం చేపట్టిన 3 నెల్లలోనే దీనిని తీసుకురావడం ముదావహమన్నారు. బీసీ ఎట్రాసిటీ కేసుల విచారణకు ప్రత్యేక కోర్టుల ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవడం పై హర్షం వ్యక్తం చేశారు. 183 కులాల బీసీ ఐక్యవేదిక తరఫున ప్రభుత్వ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.


నేతల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న రాజు, లక్ష్మీతులసి


సోలార్ ప్లాంట్ ప్రారంభోత్సవంలో పీసీఈఈ మిశ్రా, డీఆర్ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్, సీఎంఎస్ సారిబాల తదితరులు

విద్యుత్తు పొదుపు తప్పనిసరి

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : భవిష్యత్తు అవసరాల దృష్ట్యా విద్యుత్తును పొదుపుగా వాడాలని దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్(పీసీఈఈ) పి.డి.మిశ్రా అన్నారు. గురువారం రైల్వే ఆసుపత్రిలో కొత్తగా ఏర్పాటు చేసిన 60కేడబ్ల్యూపీ ఆన్ గ్రిడ్ సోలార్ ప్లాంట్‌ను డీఆర్ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్‌తో కలిసి ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. విద్యుత్తు స్థానంలో సౌరశక్తిని వినియోగించడం ద్వారా రూ. లక్షలు ఆదా అవుతున్నాయన్నారు. ఇప్పటికే డివిజన్ వ్యాప్తంగా రైల్వే కార్యాలయాలు, ఆసుపత్రులు, రైల్వేస్టేషన్లు, ఇతర భవనాల్లో సౌరశక్తిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విజయవాడ డివిజన్‌లో విద్యుత్తు వినియోగాన్ని గణనీయంగా తగ్గిస్తూ డీఆర్ఎంతో పాటు ఇతర అధికారులు ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రశంసించారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు కొండా శ్రీనివాసరావు, ఎడ్విన్, రైల్వే ఆసుపత్రి సీఎంఎస్ డాక్టర్ సారిబాల, సీనియర్ డీఈఈ(నిర్వహణ) టి.సురేష్‌బాబు, డీఈఈ ఎన్.గురుశ్రీనివాస్, విద్యుత్తు సీనియర్ సెక్షన్ ఇంజనీర్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

సత్వరమే మౌలిక వసతులు కల్పించండి

కొండపల్లి, న్యూస్‌టుడే: కొండపల్లి జగనన్న కాలనీలో యుద్ధ ప్రాతిపదికన మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మండల సీపీఎం బృందం గురువారం ఆ ప్రాంతంలో పర్యటించి అక్కడి రహదారులను, మురుగు నీటి పారుదల వ్యవస్థను పరిశీలించింది. ఈ సందర్భంగా వాళ్లు మాట్లాడుతూ నాలుగేళ్ల నుంచి అనేక మంది సొంత స్థలాల్లో నిర్మాణాలు ఏర్పాటు చేసుకుని ఉంటున్నా కనీసం ఏ మాత్రం మౌలిక వసతులు కల్పించకపోవడం దుర్మార్గమన్నారు. ఇంకా అనేక మందికి విద్యుత్తు కనెక్షన్లు లేవన్నారు. రహదారులు అన్నీ బురదమయంగా ఉండి రాకపోకలకు ఏ మాత్రం అనువుగా లేని ప్రాంతంలో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సెంటు స్థలాల పరిధి ఇంకా పురపాలిక పరిధిలోకి రాకపోవడంతో ఈ ప్రాంతం అభివృద్ధి ఆమడ దూరంలోనే ఉండిపోయిందన్నారు.


ఎంపికైన బాలుర జట్టుతో సమాఖ్య ప్రతినిధులు, ఎంపిక కమిటీ సభ్యులు, పీఈటీలు

రాష్ట్ర వాలీబాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: విజయనగరం జిల్లా బొబ్బిలిలో వచ్చే నెల 9 నుంచి 11వ తేదీ వరకు జరిగే ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్‌–14 బాల బాలికల వాలీబాల్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను గురువారం ఎంపిక చేశామని జిల్లా సమాఖ్య కార్యదర్శులు ఎం.శ్రీనివాసరావు (ఎన్టీఆర్), ఓ.శ్రీనివాసరావు (కృష్ణా)లు సంయుక్తంగా తెలిపారు. పటమటలోని కేబీసీ జడ్పీ హైస్కూల్ మైదానంలో గురువారం నిర్వహించిన ఉమ్మడి కృష్ణా జిల్లా అండర్‌–14 బాలబాలికల వాలీబాల్ జట్ల ఎంపిక పోటీల్లో పలువురు క్రీడాకారులు ఉత్సాహంగా తలపడ్డారని వెల్లడించారు. హాజరైన క్రీడాకారులకు నిర్వహించిన పోటీల్లో ప్రతిభగల వారిని జిల్లా జట్లకు ఎంపిక చేశామని వివరించారు. ఎంపికైన క్రీడాకారులను స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు జి.ఎన్.ప్రసాద్ రాణి, ఎస్‌ఏ పీఈ ఎల్.దుర్గారావు, పీఈటీ సింహాద్రి రమేష్, ఎంపిక కమిటీ సభ్యులు అభినందించారు.

బాలుర జట్టు: ఎ.సందీప్‌కుమార్, బి.కిరణ్, పి.ఆయ్యప్ప, కె.రాంబాబు, ఎస్.శ్రీనివాస్, కె.సుహాస్, ఆర్.సాయి, బి.యశ్వంత్, ఎం.యశ్వంత్, పి.ధనుష్, డి.వంశీ షణ్ముఖ్, జె.కౌశిక్‌శ్రీనివాస్‌కుమార్, పి.రేవంత్‌కుమార్, జి.గౌతమ్, పి.డానియేల్, జి.జీవన్‌కుమార్, బి.లోహిత్‌కుమార్, ఎం.పావన్.

బాలికల జట్టు: ఆర్.మన్విస్, కె.వర్షితాలక్ష్మి, జె.హేమాదేవి, వై.నిరుపమ, ఎస్.రూబీ, కె.దివ్య, టి.గీతాంజలి, సీహెచ్ సుప్రియ, ఒ.జ్యోతి, సీహెచ్ సుజన్య, పి.వైష్ణవి, కె.అశ్విని, యు.మేఘన, పి.యోగశ్రీ, జి.వైష్ణవి, కె.దుర్గ, ఆర్.శ్రావణి, కె.హారిక, జి.ఫణి నాగదీపిక.

పట్టభద్రుల ఓట్ల నమోదు

సత్యనారాయణపురం, న్యూస్‌టుడే : ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సత్యనారాయణపురంలోని తెదేపా కార్యాలయంలో ఓటర్ల నమోదు కార్యక్రమం గురువారం ప్రారంభించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటు నమోదు చేస్తున్నట్లు తెదేపా 33వ డివిజన్ ఇన్‌ఛార్జ్ గొర్రెపాటి విజయ్‌కుమార్ తెలిపారు. సత్యనారాయణపురం పరిసర ప్రాంతాల పట్టభద్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విజయవాడ మధ్య

పారిశుద్ధ్య నిర్వహణలో లోపాలు లేకుండా చూడాలి


అధికారులకు సూచనలు చేస్తున్న కమిషనర్

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలో పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగరంలోని సింగ్‌నగర్, బుడమేరు వంతెన, ఇందిరానాయక్‌నగర్ ప్రాంతాల్లో ఆయన గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా బుడమేరు కెనాల్ బండ్‌ను పరిశీలించి అక్కడ పేరుకుపోయిన గుర్రపుడెక్కను వెంటనే తొలగించాలని, ప్రజలు వ్యర్థాలు పడవేయకుండా డ్రోన్ సాయంతో ఎంఎల్ ఆయిల్‌ను పిచికారీ చేయాలని ఆదేశించారు. సింగ్‌నగర్ ఫ్లైఓవర్ ప్రాంతంలో పర్యటించి వంతెనపై రహదారికి అవసరమైన మరమ్మతులు త్వరగా చేపట్టి పూర్తిచేయాలని సూచించారు. ఇందిరానాయక్ నగర్ పరిసర ప్రాంతాల్లో పర్యటించి అక్కడ పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేదని గుర్తించారు. బాధ్యులైన అధికారులు, సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ ఖాళీస్థలాల్లో నిల్వఉన్న నీటిని యంత్రాల సాయంతో తొలగించాలని ఆదేశించారు. పర్యటనలో ఆయన వెంట అధికారులు శ్రీనాథ్‌రెడ్డి, పి.సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్, రామకోటేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

17 మందికి జరిమానా

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: నగరంలో రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై చర్యలు తీసుకుంటున్నారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ఆదేశాల మేరకు నగర వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. 2, 4 ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల అధికారులు.. 17 మందిపై కేసులు నమోదు చేశారు. సంబంధిత కోర్టులో ప్రవేశపెట్టగా.. ఆరుగురికి రూ.15వేలు, 11 మందికి రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి లెనిన్‌బాబు తీర్పు చెప్పారు.

మట్టి రోడ్డే గతి..!

● చినుకులు పడినా నడవలేరు
● నందమూరినగర్ వాసుల ఇక్కట్లు

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే


ఉత్తరం వైపు.. మూడో వీధి దుస్థితి..


కంకర డస్ట్‌తో వేసిన దారి..


భారతమాత కాలనీ మెయిన్‌రోడ్డు-I దక్షిణం వీధి బురదగా...

చిరుజల్లులు పడినా.. ఆ వీధుల్లోకి వెళ్లేందుకు ప్రజలు జంకుతారు. జోరున వర్షం పడిందంటే చాలు.. రాకపోకలు నిలిచిపోతాయి. ధైర్యం చేసి నడిచి వెళదామంటే.. జర్రున జారిపోతారేమోనన్న భయం. బురదలో ఇరుక్కుపోతామని బయటకు రావడం మానేస్తున్నారు. ఇది ఎక్కడో శివారు ప్రాంతంలో అనుకుంటే పొరపాటే. నగరం నడిబొడ్డున అజిత్‌సింగ్‌నగర్‌లో ఒక భాగమైన నందమూరినగర్‌లో కొన్ని వీధుల పరిస్థితి ఇది.

అధికారులు దృష్టిసారిస్తే...

నందమూరినగర్ ప్రధాన రహదారికి అనుసంధానంగా అంతర్గత రహదారులు అనేకం ఉన్నాయి. వీటిలో చాలా వాటికి రోడ్లు వేయక మట్టి దారులుగానే ఉన్నాయి. కొన్ని చోట్ల నగరపాలక సంస్థ అధికారులు ఇప్పుడిప్పుడే కంకర వేసి రోడ్లు నిర్మిస్తున్నారు. అత్యధికంగా మట్టిరోడ్లుగానే ఉన్నాయి. కొత్తగా ఇళ్లు కట్టుకునే వారితో పాటు నివాసితులు ఉంటున్నారు. వర్షం వచ్చిన రోజు.. రాకపోకలు నిలిచిపోతాయి. ఎక్కడ అడుగు వేస్తే జారిపోతామో అని భయం భయంగానే వెళుతుంటారు. ద్విచక్రవాహనాలు ముందుకు వెళ్లలేని పరిస్థితి. కొన్ని రోడ్లవైపు అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో స్థానికులే నల్లని మట్టి వేసుకుని మార్గం ఏర్పాటు చేసుకున్నారు. ఇటీవల పడిన వర్షాలకు ఇది గుల్లగా మారిపోయింది. నడిచి వెళ్లినా.. మట్టిలో దిగబడిపోతుండడంతో స్థానికులు భయపడుతున్నారు.

వానొస్తే బయటకు రాలేం

వర్షం పడితే చాలు రోడ్లన్నీ బురద మయంగా మారిపోతున్నాయి. అడుగు పెడితే జారిపోయేలా ఉండడంతో భయం భయంగా వెళ్లాల్సి వస్తోంది. ఏ మాత్రం అజాగ్రత్తగా నడిచినా జారి పడిపోతున్నారు. పెద్ద వర్షం పడిందంటే చాలు బయటకు రాలేం. నీరు రోజుల తరబడి నిల్వ ఉండటంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. **- వెంకట్రావ్, స్థానికుడు**

ద్విచక్ర వాహనమైనా ఇరుక్కుపోవాల్సిందే

మట్టి రోడ్డులో నడిచి వెళ్లడమే కష్టం. ద్విచక్రవాహనమైతే అడుగు ముందుకు పడదు. నల్లని మట్టిలో ఇరుక్కుపోతుంది. ఆకాశంలో మబ్బులు పట్టి వర్షం వచ్చేలా ఉంటే. బండిని బయటకు తీసుకువెళ్లి మెయిన్‌రోడ్డుపై పెట్టుకోవాలి. లేకపోతే బురదలో కదలక ఇరుక్కుపోతుంది. కళాశాలకు వెళ్లాలంటే ఈ తిప్పలు తప్పవు. **- రవళి, విద్యార్థిని**

గత ప్రభుత్వంలో చెప్పినా పట్టించుకోలేదు

కొత్తగా ఇల్లు కట్టుకుంటున్నా. ఇసుక, కంకర వాహనాలు మట్టి రోడ్డు అని రావడం లేదు. రోడ్డు మీద వేస్తే.. ఇంటి వరకు మోసుకునేందుకు ఖర్చు తడిచి మోపెడవుతోంది. గత ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులకు, అధికారులకు కొత్త రోడ్డు వేయమని మొరపెట్టుకున్నాం. పట్టించుకోలేదు. కొత్త ప్రభుత్వమైనా స్పందించి.. కంకర డస్ట్‌తో గట్టిగా రోడ్డు వేసినా చాలు. బురద ఇబ్బందులు తప్పుతాయి. **- రాజారావు, విశ్రాంత ఉద్యోగి**

బదిలీ అయ్యారు.. రిలీవ్ కాలేదు..



విజయవాడనగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళికా విభాగంలో సుదీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తున్న పలువురు ప్రణాళికాధికారులను ప్రభుత్వం సెప్టెంబరు నెలలో బదిలీ చేసింది. అప్పట్లో నగరంలో వరదలు సంభవించడంతో తాత్కాలికంగా వారు ఇక్కడే కొనసాగేందుకు వీలుగా ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. దీంతో నగరంలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న వీఎంసీ రమణారెడ్డి, కె.అరుణ, కె.ఆషా, కె.వెంకటేశ్వరరావు, శేషుబాబు, కొండలరావు తదితర టీపీవోలు, టీపీఎస్‌లు నాటి నుంచి ఇక్కడే విధుల్లో కొనసాగుతున్నారు. అప్పుడే వీరిని రిలీవ్ చేసేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించినా సంబంధిత అధికారులు వారిని రిలీవ్ చేయడం లేదు. దీని ఫలితంగా ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చిన వారు సైతం ఇక్కడ విధుల్లో చేరడం లేదు. నగరపాలక సంస్థ ఉన్నతాధికారులు కావాలనే వారిని రిలీవ్ చేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. అదే అదనుగా వీరిలో కొందరు ప్రణాళికాధికారులు పలు అక్రమాలకు పాల్పడుతూ అనుమతి లేని అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి.

డీసీపీ జూబెన్ స్థానచలనం

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థలో డిప్యూటీ సిటీ ప్లానర్(డీసీపీ)గా విధులు నిర్వహిస్తున్న జూబెన్ లిబర్ రాయ్ బదిలీ అయ్యారు. ప్రభుత్వం ఆయన్ను సీఆర్‌డీఏకు బదిలీ చేసింది. దీంతో ఆయన విధుల నుంచి రిలీవ్ అయ్యారు. డిప్యూటేషన్‌పై నగరపాలక సంస్థకు వచ్చిన ఆయన ఆమధ్య సీఆర్‌డీఏకు బదిలీ అయ్యారు. అయితే 10 రోజుల్లోనే నగరపాలక సంస్థకు తిరిగి బదిలీ చేయించుకున్నారు. అప్పటి నుంచి సర్కిల్-3 ఏసీపీ బాధ్యతలతోపాటు, ప్రకటనలు, నగర ప్లానింగ్ వంటి పలు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. చాలా కాలంగా ఇక్కడే పనిచేస్తుండడంతో టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్, ఎంఏయూడీ అధికారుల సూచనలను అనుసరించి ఆయన్ను ప్రభుత్వం ప్రస్తుతం బదిలీ చేసింది.

అంతర్గతంగా ఏసీపీలకు..

విజయవాడ నగరపాలక సంస్థ: ఇద్దరు ఏసీపీలకు అంతర్గత బదిలీ అయ్యింది. కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు ప్రణాళికాధికారులు వారిని అంతర్గతంగా బదిలీ చేశారు. నగరంలోని సర్కిల్-2 పరిధిలో పనిచేస్తున్న పి.మోహన్‌బాబును అక్కడ నుంచి సర్కిల్-3కి బదిలీ చేశారు. మరోవైపు గుడివాడ నుంచి ఇటీవల నగరానికి బదిలీపై వచ్చిన వై.రాంబును సర్కిల్-2కు సర్దుబాబు చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM 63036 11232

వ్యర్థాల తొలగింపు

స్పందనకు సలాం


ట్రాక్టర్‌లోకి చెత్త వేస్తున్న జేసీబీ

సీతారాంపురం: గుణదల ప్రశాంత్ కాలనీ శ్రీసాయి నిలయం వద్ద వరదలకు కొట్టుకొచ్చిన చెత్తను ఇప్పటికీ తొలగించలేదు. స్థానికులు ఈ సమస్యను 'మేమున్నాం.. మీకు తోడుగా..' దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఈ నెల 15వ తేదీన 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. వీఎంసీ ఏఎంవోహెచ్ వి.రామకోటేశ్వరరావు స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందితో పాటు జేసీబీ ద్వారా చెత్తను తొలగించారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

రాత పుస్తకాల అందజేత


విద్యార్థినికి పుస్తకాలు అందిస్తున్న ఎమ్మెల్యే ఉమా

మధురానగర్ : గుణదల ఒకటో డివిజన్‌లోని మడోనా మూగ, చెవిటి పాఠశాల విద్యార్థులకు కైకలూరు రాయల్ క్లబ్ అసోసియేషన్ వారు రాత పుస్తకాలు అందించారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు చేతుల మీదుగా 500 మంది విద్యార్థులకు ఏడాదికి సరిపడా పుస్తకాలు, జామెంట్రీ బాక్సులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఇతర విద్యార్థుల మాదిరిగానే బధిర విద్యార్థులకు చక్కని బోధన అందిస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. రాయల్ క్లబ్ అసోసియేషన్ తరఫున సుంకర కృష్ణ, వల్లభనేని సతీష్, కొమ్మినేని సురేష్, రామిశెట్టి విజయకుమార్ పాల్గొన్నారు.

వధూవరులకు వేద ఆశీర్వచనం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : ఇంద్రకీలాద్రిపై నూతన వధూవరులకు ఆశీర్వచన మండపంలో వేద పండితులు ఉచిత ఆశీర్వచనం చేస్తారని ఈవో రామారావు తెలిపారు. పెళ్లి దుస్తుల్లో వచ్చిన జంటలకు ఉచితంగా అమ్మవారి దర్శనంతోపాటు వేద ఆశీర్వచనం గురువారం చేశారు. నూతన జంటలు కొత్త జీవితం అమ్మవారి సన్నిధి నుంచి మొదలవుతుందన్న విశ్వాసం భక్తుల్లో నింపేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఈవో తెలిపారు.

బీసీ రక్షణ చట్టం ఏర్పాటుపై సంబరాలు


నేతల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న రాజు, లక్ష్మీతులసి

మధురానగర్, న్యూస్‌టుడే : బీసీ కులాల ప్రజలు గౌరవప్రదమైన జీవనం కోసం తొలిసారిగా బీసీ రక్షణ చట్టం రూపొందించడం అభినందనీయమని బీసీ ఐక్యవేదిక నగర అధ్యక్షుడు పి.వి.ఎల్.ఎన్.రాజు పేర్కొన్నారు. గురువారం మధురానగర్‌లోని నగర కార్యాలయంలో సంబరాలు నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ పిల్లి లక్ష్మీతులసి తదితరులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు బీసీ రక్షణ చట్టం తీసుకువచ్చారని కొనియాడారు. బీసీ డిక్లరేషన్‌లో భాగంగా అధికారం చేపట్టిన 3 నెలల్లోనే దీనిని తీసుకురావడం ముదావహమన్నారు. బీసీ ఎట్రాసిటీ కేసుల విచారణకు ప్రత్యేక కోర్టుల ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. 183 కులాల బీసీ ఐక్య వేదిక తరఫున ప్రభుత్వ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆదర్శనీయుడు వాల్మీకి


వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేస్తున్న సీపీ రాజశేఖరబాబు


గురుకుల కళాశాల కార్యక్రమంలో రమణమూర్తి, ప్రిన్సిపల్ నీరజ, బాలకృష్ణ తదితరులు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : వాల్మీకి మహర్షి జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని వక్తలు అభిప్రాయపడ్డారు. గురువారం ఆయన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సీపీ ఎస్.వి.రాజశేఖరబాబు.. వాల్మీకి గొప్పతనం వివరించారు. ఉన్నతమైన ఆదర్శాలను బోధించే రామాయణ మహాకావ్యాన్ని సంకలం చేసి.. రామాయణ మధుర కావ్యాన్ని సమాజానికి అందించారని కొనియాడారు. మానవ కుటుంబ సంబంధాలను సమాజానికి తెలియజేశారని తెలిపారు. రామాయణం స్ఫూర్తితో ధర్మబద్ధంగా జీవించాలని సీపీ సూచించారు. ఠాగూర్ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారిణి కె.రమాదేవి ఆధ్వర్యంలో వాల్మీకి చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. రామయణాన్ని రచించి శ్రీరాముడిని లోకోత్తర పురుషుడిగా పరిచయం చేశారని ప్రశంసించారు.

మాచవరం, న్యూస్‌టుడే : స్థానిక సాంఘిక సంక్షేమ ప్రభుత్వ గురుకుల కళాశాల (మహిళలు)లో వాల్మీకి జయంతి నిర్వహించారు. ఎస్సారార్ కళాశాల సంస్కృత విభాగాధిపతి ఉపద్రష్ట వేంకట రమణమూర్తి మాట్లాడుతూ.. వాల్మీకి బాల్యజీవనం, నేరప్రవృత్తి, పరివర్తన, తపస్సు, శోకం నుంచి శ్లోక ఆవిర్భావం అనే అంశాలను వివరించారు. ప్రిన్సిపల్ నీరజ మాట్లాడుతూ.. బోయవానిగా జీవిస్తూ సజ్జన సాంగత్యంతో జీవిత పరమార్థాన్ని తెలుసుకున్నారని పేర్కొన్నారు. తెలుగు విభాగాధిపతి బాలకృష్ణ, అధ్యాపకులు అరుణ, సుధారాణి, సత్యవాణి, సుమిత్ర, ప్రసాదరావు, నాగలక్ష్మి, విద్యార్థినులు పాల్గొన్నారు.

చేయిచేయి కలిపి.. సమస్య పరిష్కరించి..


దావుబుచ్చయ్య కాలనీ ఖాళీ స్థలాల్లో నిలిచిపోయిన నీరు


జేసీబీ ద్వారా కాలువ తవ్వుతూ...

ఒకవైపు బుడమేరు వరద నీరు, మరోవైపు వర్షం నీరు. బయటకు పోయే మార్గం లేదు. వీటివల్ల దోమలు పెరిగిపోయాయి. దావుబుచ్చయ్యకాలనీ వాసులకు కంటి మీద కునుకులేకుండా పోయింది. చాలా రోజులుగా ఇబ్బంది పడుతున్నారు. అధికారులకు ఎన్ని విజ్ఞప్తులు చేసినా పట్టించుకోలేదు. తమ కష్టాల గురించి ఎవరూ స్పందించక పోవడంతో కాలనీవాసులే.. తలా కొంత డబ్బులు వేసుకున్నారు. జేసీబీ ద్వారా కాలువలు తవ్వించి.. వర్షపు నీరు బయటకు పోయేలా చేసుకున్నారు. కాలనీ అసోసియేషన్ సభ్యులు అర్జా వెంకటేశ్వరరావు, బాబూరావు, మధు, సూర్యనరసింహమూర్తి, శ్రీనివాసరావు తదితరులు పనులను పర్యవేక్షించారు. **- న్యూస్‌టుడే, మధురానగర్**

యువతిపై కట్టర్‌తో దాడి

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్): తమ ఇంటి ముందు ఎందుకు గొడవ పడుతున్నారంటూ ప్రశ్నించిన ఓ యువతి (18)పై కొందరు యువకులు దాడిచేసి, గాయపరిచినట్లు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. న్యూరాజరాజేశ్వరీపేటకు చెందిన యువతి 9వ తరగతి వరకు చదివి మానేసి ఇంటి వద్దే ఉంటున్నారు. ఈ క్రమంలో కొద్ది రోజుల కిందట ఆమె ఇంటి వద్ద అజయ్, విజయ్‌లు గొడవ పడుతున్నారు. తమ ఇంటి ముందు ఎందుకంటూ ఆమె ప్రశ్నించారు. దీన్ని మనస్సులో ఉంచుకుని.. ఈ నెల 15వ తేదీ రాత్రి విజయ్, బుజ్జి, ప్రశాంత్, శివ, సంతోష్, ఆనంద్, మిసిక్, సురేష్, తేజ తదితరులు ఆమె ఇంటిపై దాడి చేశారు. అడ్డుకున్న బంధువును కర్రలతో కొట్టారు. కట్టర్ తీసుకుని ఆమె ఛాతిపై దాడి చేయడంతో రక్తపు గాయాలయ్యాయి. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తలుపులు పగలగొట్టి బంగారం చోరీ

పాయకాపురం (మధురానగర్): వాంబేకాలనీలోని ఓ ఇంట్లో రూ.50వేల విలువైన బంగారం చోరీ చేసినట్లు నున్న పోలీసులు కేసు నమోదు చేశారు. వాంబేకాలనీ ఎ బ్లాక్‌లో ఉండే సుమతి.. ఈ నెల 9న ఇంటికి తాళం వేసి శ్రీకాకుళం జిల్లాలో ఉన్న బంధువుల ఇంటికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. బుధవారం ఉదయం తిరిగి రాగా.. తలుపునకు వేసి ఉన్న తాళాలు పగలకొట్టి ఉన్నాయి. ఇంట్లో బీరువా తెరిచి ఉంది. బంగారు నెక్లెస్, చెవి దిద్దులు చోరీకి గురైనట్లు గుర్తించారు. నున్న పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెత్త సేకరణ బండ్ల పంపిణీ

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్): స్థానిక 58వ డివిజన్ సచివాలయాలకు గురువారం చెత్త సేకరణ బండ్లను అందించారు. పాతవి పాడైపోవడంతో తెదేపా నాయకులు అల తారక రామారావు తదితరులు నగరపాలక సంస్థ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. వారు స్పందించి అయిదు బండ్లను సమకూర్చారు. గురువారం వాటిని పారిశుద్ధ్య సిబ్బందికి అందించారు.


డీఆర్వో శ్రీనివాసరావుకి వినతి పత్రం అందిస్తున్న శంకర్, కాశీనాథ్, యుగంధర్, జోషి

కళాశాల స్థలాన్ని కాపాడండి

మాచవరం, న్యూస్‌టుడే : ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమణదారులు తమదని చెప్పుకోవడం దొంగే దొంగా.. దొంగా.. అని అరచినట్లుందని ఎస్సారార్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు పేర్కొన్నారు. బీఆర్టీఎస్ రోడ్డు గులాబీతోటలో ఉన్న కళాశాలకు చెందిన స్థలాన్ని కాపాడాలని గురువారం వారు ఎన్టీఆర్ జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావుకి వినతి పత్రం అందించారు. ఆయన స్పందించి.. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామని బదులిచ్చారని నాయకులు చెప్పారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు దోనేపూడి శంకర్, దోనేపూడి కాశీనాథ్, అధ్యక్షుడు లంకా జానయ్య, కార్యదర్శి చిగురుపాటి యుగంధర్, ఉపాధ్యక్షులు ఆళ్ల వేణుగోపాల్, వెలగా జోషి తదితరులు మాట్లాడారు. తక్షణమే కళాశాల యాజమాన్యం, ప్రభుత్వ యంత్రాంగం పూర్వ విద్యార్థులు చేసే న్యాయమైన పోరాటానికి అండగా నిలబడాలని కోరారు. నగర ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులు, విద్యార్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. త్వరలో విద్యాశాఖ మంత్రి, ముఖ్యమంత్రిని కలిసి వివరిస్తామని పేర్కొన్నారు.

వరద బాధితులకు ఆసరా

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే : బుడమేరుకు కనీవినీ ఎరుగని రీతిలో వరదలు రావడంతో ప్రజలు తీవ్రంగా నష్టపోయారని.. వారిని ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని జగతి ఫౌండేషన్ అధ్యక్షురాలు దుర్గా కల్యాణి పేర్కొన్నారు. హైదరాబాద్ కేర్ ఆసుపత్రి సహకారంతో సింగ్‌నగర్‌లోని బూదాల ఆదాం కల్యాణ మండపంలో వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. వరదలతో నష్టపోయిన వారికి తమ వంతు సాయంగా నిత్యావసరాలను అందిస్తున్నామని ఆమె చెప్పారు. అజిత్‌సింగ్‌నగర్ ఎస్సై సేనాపతి శ్రీనివాసరావు, ఏఎస్సై కోటేశ్వరరావు, జగతి ఫౌండేషన్, కేర్ ఆసుపత్రి ప్రతినిధులు పాల్గొన్నారు.


కిట్లు అందిస్తున్న దుర్గా కల్యాణి, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు

విద్యుత్తు పొదుపు తప్పనిసరి


సోలార్ ప్లాంట్ ప్రారంభోత్సవంలో పీసీఈఈ మిశ్రా, డీఆర్ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్, సీఎంఎస్ సౌరిబాల తదితరులు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : భవిష్యత్తు అవసరాల దృష్ట్యా విద్యుత్తును పొదుపుగా వాడాలని దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్(పీసీఈఈ) పి.డి.మిశ్రా అన్నారు. గురువారం రైల్వే ఆసుపత్రిలో కొత్తగా ఏర్పాటు చేసిన 60కేడబ్ల్యూపీ ఆన్ గ్రిడ్ సోలార్ ప్లాంట్‌ను డీఆర్ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్‌తో కలిసి ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. విద్యుత్తు స్థానంలో సౌరశక్తిని వినియోగించడం ద్వారా రూ.లక్షలు ఆదా అవుతాయన్నారు. ఇప్పటికే డివిజన్ వ్యాప్తంగా రైల్వే కార్యాలయాలు, ఆసుపత్రులు, రైల్వేస్టేషన్లు, ఇతర భవనాల్లో సౌరశక్తిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విజయవాడ డివిజన్‌లో విద్యుత్తు వినియోగాన్ని గణనీయంగా తగ్గిస్తూ డీఆర్ఎంతో పాటు ఇతర అధికారులు ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రశంసించారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు కొండా శ్రీనివాసరావు, ఎడ్విన్, రైల్వే ఆసుపత్రి సీఎంఎస్ డాక్టర్ సౌరిబాల, సీనియర్ డీఈఈ(నిర్వహణ) టి.సురేష్‌బాబు, డీఈఈ ఎన్.గురుశ్రీనివాస్, విద్యుత్తు సీనియర్ సెక్షన్ ఇంజినీర్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి కృషి

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పేర్కొన్నారు. స్థానిక ఐజీఎంసీ స్టేడియంలోని శాప్ కార్యాలయంలో శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడును గురువారం ఆయన మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసీఏ తరఫున క్రికెట్ పాటు క్రికెటేతర క్రీడలను కూడా ప్రోత్సహిస్తామన్నారు. ఛైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మార్గదర్శకం మేరకు అందరి ప్రోత్సాహంతో రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు.

పట్టభద్రుల ఓట్ల నమోదు


దరఖాస్తులు స్వీకరిస్తున్న విజయ్‌కుమార్, కోటేశ్వరరావు

సత్యనారాయణపురం, న్యూస్‌టుడే : ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సత్యనారాయణపురంలోని తెదేపా కార్యాలయంలో ఓటర్ల నమోదు కార్యక్రమం గురువారం ప్రారంభించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటు నమోదు చేస్తున్నట్లు తెదేపా 33వ డివిజన్ ఇన్‌ఛార్జి గార్లపాటి విజయ్‌కుమార్ తెలిపారు. సత్యనారాయణపురం పరిసర ప్రాంతాల పట్టభద్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రిపరేషన్ టెక్నిక్

పుస్తకంలో లేదా నోట్ బుక్‌లో చదివేటప్పుడు ముఖ్యమైన అంశాలను ఇబ్బందిలేని కలర్స్‌తో మార్క్ చేయడం లేదా అండర్‌లైన్ చేయడం ద్వారా హైలైట్ చేసుకోవాలి. దీని వల్ల ప్రధానమైన విషయాలను తేలిగ్గా గుర్తుంచుకోవచ్చు. వేగంగా రివిజన్ చేసుకోవచ్చు.

డీఎస్సీ - 2024

హిందీ కంటెంట్

కరెంట్ అఫైర్స్

■ ఇటీవల భారత నౌకాదళంలో చేరిన అణుశక్తితో నడిచే రెండో బాలిస్టిక్ క్షిపణి జలాంతర్గామి (ఎస్ఎస్‌బీఎన్) ఏది? (రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ జలాంతర్గామిని విశాఖపట్నంలో ప్రారంభించారు. అణుశక్తితో నడిచే భారత తొలి బాలిస్టిక్ క్షిపణి జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిహంత్)

జ: ఐఎన్ఎస్ అరిఘాత్



మాదిరి ప్రశ్నలు

■ జాతీయ పారిశ్రామిక కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎన్ఐసీడీపీ) కింద ఎన్ని కొత్త పారిశ్రామిక స్మార్ట్ సిటీస్ ఏర్పాటుకు ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఇటీవల ఆమోదం తెలిపింది. (ఈ ప్రాజెక్టుల అంచనా పెట్టుబడి మొత్తం రూ. 28,602 కోట్లు. వీటిని 10 రాష్ట్రాల్లో ఏర్పాటు చేయనున్నారు.) జ: 12

■ పౌరసత్వ (సవరణ) చట్టం (సీఏఏ) కింద భారత పౌరసత్వాన్ని పొందిన మొదటి గోవా వ్యక్తిగా ఇటీవల ఎవరు వార్తల్లో నిలిచారు?

జ: జోసెఫ్ ఫ్రాన్సిస్ పెరైరా

■ ఇరాన్ మొదటి మహిళా ప్రభుత్వ ప్రతినిధిగా ఇటీవల ఎవరు నియమితులయ్యారు? (ప్రముఖ విద్యావేత్త అయిన ఈమె గతంలో టెక్నికల్ అండ్ ఒకేషనల్ ట్రైనింగ్ యూనివర్సిటీ ఆఫ్ షరియాకి నాయకత్వం వహించారు.)

జ: ఫతేమెహ్ మొహజెరానీ

మరింత సమాచారం

ఈనాడు ప్రతిభ

pratibha.eenadu.net/eenadupratibha.net

విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

తేలినా.. మునిగినా.. ఉంటుందో సూత్రం!

జనరల్ స్టడీస్ - భౌతిక శాస్త్రం



భారీ ఓడ



జలాంతర్గామి

అంతపెద్ద ఓడ నీళ్లపై ఎలా తేలుతుంది? గాలితో నిండి ఇంత లావుగా మారిన బెలూన్ కూడా ఎగురుకుంటూ ఏవిధంగా వెళ్లిపోతుంది? ఒకే పరిమాణం ఉన్న చెక్క నీటిపై తేలితే, ఇనుము మునిగిపోతుంది ఎందుకని? ఎప్పుడైనా ఆలోచించారా? వీటన్నింటిలో కొన్ని భౌతికశాస్త్ర సూత్రాలు పనిచేస్తుంటాయి. పదార్థాల స్వభావాన్ని, స్థితిని వాటి సాంద్రత ప్రభావితం చేస్తుంది. తేలడం, మునగడం, ఎగరడాలను అదే నిర్ణయిస్తుంది. భౌతిక శాస్త్రంలో ప్రాథమికాంశాలైన ఈ నియమాలను అభ్యర్థులు తెలుసుకోవాలి. వాటి ఆధారంగా పనిచేసే పరికరాలు, ఉపయోగాలతోపాటు ఆర్కిమెడిస్, పాస్కల్, బెర్నౌలీ సూత్రాలు, సమీకరణాలను అర్థం చేసుకోవాలి. సంబంధిత అనువర్తనాలపై అవగాహన కలిగి ఉండాలి.

తేలియాడే వస్తువులు

కొన్ని రకాల వస్తువులు నీటిలో మునుగుతాయి, మరికొన్ని తేలుతాయి. అలాగే గాజు గోలీలు నీటిలో మునుగుతాయని, చెక్కముక్క నీటిలో తేలుతుందని అందరికీ తెలుసు.

1) రెండు కిలోగ్రాముల చెక్క ముక్క ఒక కిలోగ్రాము ఇనుము కంటే బరువైంది.

2) ఇనుము, చెక్క కంటే బరువైంది.

ఈ వాక్యాల్లో బరువు అనే పదం ఏ అర్థంలో వాడారో తెలుసుకోవాలి. విజ్ఞాన శాస్త్రంలో ఏ పదాన్ని అయినా అందరికీ ఒకే రకంగా అర్థమయ్యే విధంగా ఉపయోగిస్తారు. మొదటి వాక్యం ప్రకారం త్రాసులో ఒక పళ్లెంలో రెండు కిలోగ్రాముల చెక్కను, మరో పళ్లెంలో ఒక కిలోగ్రాము ఇనుమును ఉంచితే త్రాసు దండం చెక్కను ఉంచిన పళ్లెం వైపు వంగుతుంది.

◆ రెండో వాక్యం ప్రకారం.. ఇనుము, చెక్క కంటే బరువైనదంటే.. ఒకే పరిమాణం ఉన్న ఇనుము, చెక్క ముక్కలను త్రాసు పళ్లాల్లో చెరొక దాన్ని ఉంచితే త్రాసు దండం ఇనుప ముక్కను ఉంచిన పళ్లెం వైపు వంగుతుంది. విజ్ఞానశాస్త్ర పరిభాషలో చెక్క కంటే ఇనుము సాంద్రత ఎక్కువ. బరువు, తేలిక అనేవి సాంద్రత ఆధారంగా నిర్ణయమవుతాయి.

సాంద్రత: ప్రమాణ ఘనపరిమాణం ఉన్న పదార్థ ద్రవ్యరాశిని సాంద్రత అంటారు.

$\therefore$ సాంద్రత = $\frac{\text{ద్రవ్యరాశి}}{\text{ఘనపరిమాణం}}$

● నీటి సాంద్రత = 1 gm/cm^3

S.I. యూనిట్ ⟶ kg/m^3

CGS యూనిట్ ⟶ gm/cm^3

◆ ఎక్కువ సాంద్రత ఉండే పదార్థాలు బరువైనవని, తక్కువ సాంద్రత ఉండే పదార్థాలు తేలికైనవని చెప్పవచ్చు.

సాపేక్ష సాంద్రత/తారతమ్య సాంద్రత: ఒక వస్తువు సాంద్రతను నీటి సాంద్రతతో పోల్చడాన్ని సాపేక్ష సాంద్రత అంటారు.



బారోమీటర్

◆ వస్తువు సాపేక్ష సాంద్రత = $\frac{\text{వస్తువు సాంద్రత}}{\text{నీటి సాంద్రత}}$

◆ ద్రవం సాపేక్ష సాంద్రత = $\frac{\text{ద్రవం ద్రవ్యరాశి}}{\text{అంతే ఘనపరిమాణం ఉండే నీటి ద్రవ్యరాశి}}$

◆ పాదరసం సాపేక్ష సాంద్రత = 13.6 (సాపేక్ష సాంద్రతకు ప్రమాణాలు లేవు)

1) ఒకే ద్రవ్యరాశి ఉండే పాలు, నీరు కలిపినప్పుడు ఆ మిశ్రమం ఫలిత సాంద్రత = $\frac{2P_1P_2}{P_1+P_2}$

2) ఒకే ఘనపరిమాణం ఉండే పాలు, నీరు కలిపినప్పుడు ఆ మిశ్రమం ఫలిత సాంద్రత = $\frac{P_1+P_2}{2}$

వాతావరణ పీడనం(P_o) : భూమిపై ఉన్న అన్ని వస్తువులపై గాలి కలిగించే పీడనాన్ని వాతావరణ పీడనం అంటారు.

$\therefore P_o = pgh$

p = వాతావరణ సాంద్రత

g = గురుత్వ త్వరణం

h = వాతావరణం ఎత్తు

◆ వాతావరణ పీడనాన్ని కొలవడానికి బారోమీటర్ ఉపయోగిస్తారు.

భారమితి (బారోమీటర్): దీన్ని టారిసెల్లి అనే శాస్త్రవేత్త కనుక్కున్నాడు. ఇందులో పాదరసాన్ని ఉపయోగిస్తారు.

◆ సముద్ర మట్టం వద్ద సాధారణ వాతావరణ పీడనం P_o = 76 cm

◆ సముద్ర మట్టం వద్ద వాతావరణ పీడనం ఒక అట్మాస్ఫియర్ పీడనానికి సమానం.

$\therefore$ 1 Atma = 1.01×10^5 పాస్కల్

◆ భారమితిలో పాదరస స్తంభం ఎత్తు హఠాత్తుగా తగ్గడం తుపాను రాకను సూచిస్తుంది.

◆ భారమితిలో పాదరస స్తంభం ఎత్తు నెమ్మదిగా తగ్గడం వర్షం రాకను సూచిస్తుంది.

◆ సముద్ర మట్టం నుంచి ఎత్తుకు వెళ్లేకొద్దీ వాతావరణ పీడనం తగ్గుతుంది. లోతుకు వెళ్లేకొద్దీ పెరుగుతుంది.

నీరు - పీడనం: నీరు మూడు రకాల పీడనాలను కలిగిస్తుంది.

1) **ఊర్ధ్వ పీడనం:** నీరు వస్తువులపై ఊర్ధ్వ దిశలో కలిగించే పీడనాన్ని ఊర్ధ్వ పీడనం అంటారు.

2) **అధో పీడనం:** నీరు పాత్ర అడుగు భాగంలో కలిగించే పీడనాన్ని అధోపీడనం అంటారు.

3) **పార్శ్వ పీడనం:** నీరు పాత్ర పక్కతలాలపై కలిగించే పీడనాన్ని పార్శ్వపీడనం అంటారు.

ఉత్ప్లవన బలం: ద్రవంలో ఉన్న వస్తువులపై ఊర్ధ్వ దిశలో కలగజేసే బలాన్ని ఉత్ప్లవన బలం అంటారు.

◆ ద్రవాల సాంద్రతను కొలిచే పరికరం - హైడ్రోమీటర్

◆ పాల స్వచ్ఛతను కొలిచే పరికరం - లాక్టోమీటర్

ఆర్కిమెడిస్ సూత్రం: ద్రవంలో ఒక వస్తువును పూర్తిగా లేదా పాక్షికంగా ముంచినప్పుడు అది ఆ ద్రవంలో కోల్పోయినట్లు అనిపించే బరువు, ఆ వస్తువు తొలగించిన ప్రవాహి లేదా ద్రవం బరువుకు సమానం.

అనువర్తనాలు: 1) ఆభరణాల స్వచ్ఛతను కనుక్కోవడానికి ఉపయోగపడుతుంది. 2) జలాంతర్గాములు ఈ సూత్రం మీదే పనిచేస్తాయి.

పాస్కల్ నియమం: ప్రత్యేకమైన ఆకారం ఉండే పాత్రలో ద్రవం నింపి ఒకవైపు తక్కువ పీడనాన్ని కలిగిస్తే అది ఆ ద్రవంలో అన్ని వైపుల్లో సమానంగా పీడనాన్ని కలిగించి రెండో వైపు అధిక పీడనాన్ని ఉత్పత్తి చేస్తుంది. దీన్నే పాస్కల్ నియమం అంటారు.

అనువర్తనాలు: 1) హైడ్రాలిక్ బ్రేకులు 2) హైడ్రాలిక్ జాకీలు 3) పత్తి నుంచి పత్తి బేళ్ల తయారీ 4) బ్రామా ప్రెస్ పనిచేయడానికి ఈ నియమం ఉపయోగపడుతుంది.

బెర్నౌలీ సూత్రం: భూమికి క్షితిజ సమాంతరంగా, వేగంగా గాలి వీచినప్పుడు వస్తువు పైభాగంలో కంటే అడుగు భాగంలో అధిక పీడనం ఏర్పడి వస్తువులు పై దిశగా కదులుతాయి. దీన్నే బెర్నౌలీ సూత్రం అంటారు.


అనువర్తనాలు: ● విమానం గాల్లోకి ఎగరడం. ● ఫ్యాన్ గాలికి గోడకు తగిలించిన క్యాలెండర్ అడుగుభాగాన కాగితాలు పైకి కదలడం. ● తుపాను గాలికి తాటాకులు, గుడిసె పైకప్పులు ఎగిరిపోవడం. ● గాలిపటం భూమి నుంచి కొంత ఎత్తులో ఎగరడం.



రచయిత: చంటి రాజుపాలెం

SENIOR INTER

Botany



Special proteins in cell membrane

Q&A

Transport in plants (2 Marks)

1) Define water potential? What is the value of water potential of pure water.

A: The relative difference between the chemical potential of pure water to that of solution. Water potential of the solution increases with increase of water molecules. Water potential of pure water is maximum i.e., zero (0).

2) What are Porins? What role do they play in diffusion?

A: Special proteins present in cell membrane are called porins. Present in the membranes of mitochondria, plastids and bacteria and allow the hydrophilic (water loving) molecules of their size.

Photosynthesis In Higher Plants (2 Marks)

1) Define the Law of Limiting factors proposed by Blackman.

A: When photosynthesis is influenced by several factors, the rate of the process is limited by slowest factor and this factor is called limited factor. CO_2 is limiting factor for photosynthesis.

2) Where does the photolysis of H_2O occur? What is its significance?

A: Thylakoid lumen of the chloroplast. The oxygen (O_2) evolved in photolysis is life gas for all organisms during respiration.

Some More Imp Questions 2 Marks For Answers

Transport in plants

1) What are apoplast and symplast?

2) Differentiate Osmosis and Diffusion.

3) How does guttation differ from transpiration?

Photosynthesis In Higher Plants

1) What is the primary acceptor of CO_2 in C_3 plants? What is first stable compound formed in a Calvin cycle?

2) How many molecules of ATP and NADPH are needed to fix a molecule of CO_2 in C_3 plants? Where does this process occur?

-Dr. M. Chenna Kesavulu

SUBSCRIBE CHANNEL

నేత్రపర్వం.. ఆదిదంపతుల గిరిప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : పౌర్ణమిని పురస్కరించుకొని శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో ఆదిదంపతుల గిరిప్రదక్షిణను నేత్రపర్వంగా గురువారం నిర్వహించారు. దుర్గగుడి టోల్‌గేటు సమీపంలోని కామధేను అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అలంకరించిన వాహనంపై గంగా, పార్వతీ సమేత దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవమూర్తులను ఉంచి ప్రత్యేక పూజ చేసిన అనంతరం ఈవో రామారావు కొబ్బరికాయ కొట్టి గిరిప్రదక్షిణ ప్రారంభించారు. భాజాభజంత్రీలు, డప్పు వాయిద్యాలు, విచిత్ర వేషధారణల బృందాలతో కుమ్మరిపాలెం సెంటరు, నాలుగు స్తంభాల సెంటరు, సితార, కబేళా, పాలఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట మీదుగా మల్లికార్జున మహామండపం వరకు ఊరేగింపు సాగింది. దారి పొడవునా భక్తులు ఆదిదంపతులకు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులకు సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించి ప్రసాదాలు అందజేశారు. వైదిక కమిటీ సభ్యులు స్థానాచార్య శివప్రసాదశర్మ, శ్రీనివాసశాస్త్రి పాల్గొన్నారు.



ఆదిదంపతుల ఊరేగింపులో భక్తులు

ప్రాచీన కళలను భావితరాలకు అందజేయాలి

చిట్టూర్పు(ఘంటసాల), న్యూస్ టుడే: ప్రాచీన సాంస్కృతిక వారసత్వ సంపదను భావితరాలకు అందజేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. గురువారం రాత్రి కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల స్థాయిలో నిర్వహించిన తాళం భజన పోటీల ముగింపు సందర్భంగా విజేతలకు బుద్ధప్రసాద్‌తో పాటు అతిథులు విశాఖకు చెందిన అంతర్జాతీయ సామాజిక సేవా సంస్థ అధ్యక్షురాలు ఏవీఎస్ జయశ్రీ, అంతర్జాతీయ ఇన్నర్‌వీల్ సంస్థ జిల్లా ఉపాధ్యక్షురాలు జి.అరుణశ్రీ, తిరుపతికి చెందిన ప్రొ.మస్తానమ్మ, హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంత ప్రొ. మునిరత్నంనాయుడు, పలువురు తెదేపా నాయకులు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. తాళం భజన పోటీల్లో 40 భక్త, 8 మురళీ కోలాట సమాజాలు పాల్గొన్నాయి. స్థానికులు ప్రసన్న, నాగరాజు ఆధ్వర్యంలో విద్యార్థులచే నిర్వహించిన యోగా ప్రదర్శనలు, స్థానిక గాయకురాలు శివనాగలక్ష్మి ఆలపించిన భక్తిగీతాలు ఆకట్టుకున్నాయి.



అమీనాపురం భక్త సమాజానికి నగదు, ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, తెదేపా నేతలు

విజేతలకు బహుమతుల ప్రదానం

తాళం భజన పోటీల్లో పమిడిముక్కల మండలం అమీనాపురానికి చెందిన శ్రీరాజా రామ భక్త సమాజానికి ప్రథమ బహుమతిగా రూ.10 వేల నగదు, ప్రశంసాపత్రాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అందజేశారు. ☛ మురళీ కోలాటంలో ప్రథమ బహుమతి కింద పామర్రు మండలం కొండిపర్రుకు చెందిన ముద్దుల మురళీకృష్ణ కోలాటం భక్త సమాజానికి రూ.10వేల నగదు అందజేశారు.

సర్క్యూట్ బెంచ్ ఏర్పాటుకు విజ్ఞప్తి

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : విజయవాడ వినియోగదారుల ఫోరం నుంచి మచిలీపట్నం ఫోరానికి బదిలీ చేసిన 300 కేసులను.. నగరంలోనే విచారించాలని, దీనికోసం ఇక్కడ ఒక సర్క్యూట్ బెంచ్ ఏర్పాటు చేయాలని బెజవాడ బార్ అసోసియేషన్ కోరింది. ఈ మేరకు బీబీఏ అధ్యక్షుడు కొత్త చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి అరిగెల శివరామప్రసాద్ తదితరులు గురువారం పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. విజయవాడ ఫోరం కేసులు బదిలీ కావడంతో.. విచారణకు వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వీరి సమస్యను పరిశీలించి విజయవాడలో ఒక సర్క్యూట్ బెంచ్‌ను ఏర్పాటు చేయాలని కోరగా.. మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. మంత్రి మనోహర్‌ను సన్మానించారు. అనంతరం రాష్ట్ర వినియోగదారుల ఫోరం ఛైర్మన్ డి.శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం ఇచ్చామని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో చలసాని అజయ్‌కుమార్, సోము కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: రాజధాని ప్రాంతంలో జాతీయ క్రీడలు నిర్వహిస్తామని విజయవాడ ఎంపీ, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని చిన్ని చెప్పారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో గురువారం 35 సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీలను ఎంపీ కేశినేని, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు ప్రారంభించారు. క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని మాట్లాడుతూ రాష్ట్రం విడిపోయిన తర్వాత ఎలాంటి క్రీడా సౌకర్యాలు లేవన్నారు. 2027లో జాతీయ క్రీడల నిర్వహించేందుకు అమరావతిలో స్పోర్ట్స్ సిటీని నిర్మిస్తున్నామని తెలిపారు. క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రైవేటు విశ్వవిద్యాలయాలు ముందుకు రావాలని కోరారు. శాప్ ఛైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ క్రీడాంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని చెప్పారు. నియోజకవర్గాల్లో అసంపూర్తిగా ఉన్న క్రీడా మైదానాలను వెంటనే పూర్తిచేస్తామన్నారు. విద్యాశాఖ మంత్రి లోకేశ్ అన్ని పాఠశాలలో క్రీడా మైదానాలు ఏర్పాటుచేయాలని జీవో విడుదల చేయడం శుభసూచకమన్నారు. ఇన్‌ఛార్జి వీసీగంగాధర్, రెక్టార్ ఆచార్య రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, ఏపీ అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షుడు గౌతమ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



హర్డిల్స్‌లో యువతులు

తొలిరోజు విజేతలు వీరే.. అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలోం తొలిరోజు ఆంధ్ర క్రీడాకారులు సత్తా చాటారు. అండర్-20 పురుషుల విభాగంలో ఏపీ క్రీడాకారుడు షేక్ రోషన్ బంగారు పతకాన్ని సాధించారు. ఇదే విభాగంలో 1,500 మీటర్ల పరుగుపందెంలో తెలంగాణ క్రీడాకారుడు కట్రావత్ శ్రీను ప్రథమ, ఏపీ క్రీడాకారుడు కురుబ మహేంద్ర ద్వితీయ, 5వేల మీటర్ల పరుగుపందెంలో హరీష్ మల్లు తృతీయ స్థానాల్లో నిలిచారు. అండర్- 16 బాలుర విభాగంలో నిర్వహించిన 4 కిలోల షాట్‌పుట్ పోటీలలో ప్రణీత్‌కుమార్ మొదటి, ఇదే విభాగంలో నిర్వహించిన లాంగ్‌జంప్‌లో యశ్వంత్‌రాజ్ మూడో, అండర్-16 బాలికల విభాగంలో 60 మీటర్ల పరుగు పందెంలో డింపుల్ మహా శ్రీ మొదటి స్థానాలను సాధించారు.

నెమలి ఆదాయం రూ.22.59 లక్షలు

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన గంపలగూడెం మండలం నెమలిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. ఈ ఏడాది జూన్ 13 నుంచి గురువారం వరకు భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా ఆలయానికి రూ. 22,59,090 ఆదాయం లభించినట్లు సహాయ కమిషనర్ ఎన్.సంధ్య తెలిపారు. లెక్కింపును దేవాదాయ శాఖ గన్నవరం తనిఖీ అధికారిణి కె.అనురాధ పర్యవేక్షించారు.

క్రీడావికాస కేంద్రాల అభివృద్ధికి కృషి

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో క్రీడా వికాస కేంద్రాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో గురువారం భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరిని ఆయన మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో శాప్ అమలు చేస్తున్న విధి విధానాలను ఆమెకు వివరించారు. రాష్ట్రంలో ఖేలో ఇండియా-శాప్ ద్వారా నిర్వహిస్తున్న క్రీడా వికాస కేంద్రాలకు నిధుల లభ్యత పూర్తి స్థాయిలో లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆమె దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆమె స్పందిస్తూ శాప్ ద్వారా పూర్తి స్థాయి నివేదిక తయారు చేసి ఇస్తే కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు సమకూర్చేందుకు కృషి చేస్తానన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో భ్రష్టుపట్టిన క్రీడారంగాన్ని తిరిగి పునరుద్ధరిస్తామని రవినాయుడు వివరించారు. విశాఖలో క్రికెట్ హబ్, తిరుపతిలో కబడ్డీ, కాకినాడ, రాజమహేంద్రవరం వంటి నగరాల్లో అనుకూలమైన క్రీడలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంత క్రీడలపై టూరిజం హబ్ ఏర్పాటు చేస్తే..కనుమరుగవుతున్న ఆటలు నేటి తరం యువతకు తెలుస్తాయని పురందేశ్వరి సూచించారు. ఈ విషయంపై ప్రత్యేక దృష్టి పెడతామని రవినాయుడు వివరించారు.



ఎంపీ పురందేశ్వరికి పుష్పగుచ్ఛం అందిస్తున్న శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు

'రిజర్వేషన్లతోనే అట్టడుగు వర్గాలకు ప్రయోజనం'

విజయవాడ(గాంధీనగర్), న్యూస్ టుడే : ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు అమలైతేనే అట్టడుగు వర్గాలకు ప్రయోజనం చేకూరుతుందని, దీని కోసం ప్రత్యేక చట్టం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. సోషలిస్టు కూటమి ఆధ్వర్యంలో గురువారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన రాష్ట్ర సదస్సులో ఆయన మాట్లాడారు. దేశంలో ప్రభుత్వ రంగం 90 శాతం మేర ప్రైవేటుపరమైందని పేర్కొన్నారు. రిజర్వేషన్లు లేకపోవడంతో పేద వర్గాలు ఉపాధి అవకాశాలకు దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ శక్తులు ప్రభుత్వ రంగంలో చొరబాటు వల్ల ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులతో సరిపెడుతున్నారని.. వీరందరినీ రెగ్యులర్ చేయాలని కోరారు. 1981 జనాబా లెక్కల ప్రకారం రిజర్వేషన్లు అమలవుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ రంగాల్లో పెట్టుబడులను కేంద్రం వెనక్కి తీసుకోవడం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఉద్యోగాలు కోల్పోయారని వివరించారు. సోషలిస్టు కూటమి జాతీయ నాయకుడు ఎల్.జైబాబు మాట్లాడుతూ.. పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు పరిశ్రమల్లో రిజర్వేషన్లు కల్పించబోమని చెప్పడం అన్యాయమన్నారు. పారిశ్రామిక అభివృద్ధి పేరుతో అన్ని రకాల సౌకర్యాలు పొందుతున్నందున.. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. దీనిపై త్వరలోనే అన్ని జిల్లాల్లో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలతో సదస్సులు, సభలు నిర్వహిస్తామని తెలిపారు. మాజీ మేయర్ తాడి శకుంతల మాట్లాడుతూ.. ప్రైవేటురంగంలో రిజర్వేషన్లు అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు జి.అప్పలరాజు, వీరభాస్కర్, కె.ఎం.ఎ.సుభాన్, ఫణిరాజ్, గిద్దా శ్రీనివాస్ నాయుడు, అంగడాల పూర్ణ, అడపా మోహన్, పి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామకృష్ణ. హాజరైన జైబాబు, శకుంతల, అప్పలరాజు, వీరభాస్కర్, వివిధ సంఘాల నాయకులు

15 రోజుల్లో పచ్చదనం పనులు పూర్తి

రామవరప్పాడు, న్యూస్‌టుడే : విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు నుంచి గన్నవరం ఎయిర్ పోర్టు వరకు గ్రీనరీ, వెటర్నరీ కళాశాల వద్ద చేయాల్సిన బ్యూటిఫికేషన్ పనులను 15 రోజుల్లో పూర్తి చేస్తామని ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ జీఎం దయాకర్ బాబు, ప్రిన్సిపల్ ల్యాండ్ స్కేప్ ఆర్కిటెక్ సత్యనారాయణలు గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు వివరించారు. పచ్చదనం, సుందరీకరణ పనులపై ఎమ్మెల్యే సమావేశం నిర్వహించిన రెండు రోజుల్లోనే సంబంధిత అధికారులు గురువారం విజయవాడ పటమటలోని కార్యాలయంలో యార్లగడ్డ వెంకట్రావును కలిసి వారు తీసుకుంటున్న చర్యలను వివరించారు. జాతీయ రహదారిపై రామవరప్పాడు నుంచి విమానాశ్రయ ప్రవేశ ద్వారం వరకు పచ్చదనం అభివృద్ధి పనులను ఏపీజీ అండ్ బీసీ ద్వారా చేపట్టాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించి 15 రోజుల్లో పనులు పూర్తి చేస్తామన్నారు. గన్నవరం నుంచి చిన్నఅవుటుపల్లి వరకు చేపట్టే పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎయిర్‌పోర్ట్ కారిడార్ డెవలప్‌మెంట్, నిర్వహణ కోసం సమన్వయక కమిటీ వేసి ఛైర్మన్‌గా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును ఎన్నుకున్నారు. అధికారులు స్పందించి తీసుకున్న చర్యలను ఎమ్మెల్యే యార్లగడ్డ అభినందించారు.



ఎమ్మెల్యే వెంకట్రావుతో మాట్లాడుతున్న అధికారులు

గంజాయి అక్రమ రవాణా గుట్టురట్టు

145 కిలోల సరకు, నాటు తుపాకీ స్వాధీనం

పటమట, విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: విశాఖ జిల్లా నుంచి తమిళనాడుకు గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు సభ్యుల ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. ముఠా వాహనంలో 145 కిలోల గంజాయితోపాటు ఆరు బుల్లెట్లతో ఓ దేశవాళీ తుపాకీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడుకు చెందిన రమేష్ వినేష్‌కుమార్, కుమారన్ మారి మూర్తిలు విశాఖపట్నం ఏజెన్సీ ప్రాంతం నుంచి గురువారం కారులో గంజాయి తరలిస్తున్నారు. స్పష్టమైన సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్, పటమట పోలీసులు రామవరప్పాడు రింగ్ సమీపంలో జాతీయ రహదారిపై నిఘా ఏర్పాటు చేశారు. గంజాయి తరలిస్తున్న కారు రాగానే పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. కారులో గంజాయితోపాటు దేశవాళీ తుపాకీ ఉండడంతో పోలీసులు అవాక్కయ్యారు. నిందితులతోపాటు గంజాయి, తుపాకీని స్వాధీనం చేసుకుని పటమట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీనిపై పటమట పోలీసులు కేసు నమోదు చేశారు. మరింత లోతుగా విచారించగా వీరిపై విశాఖపట్నం, తమిళనాడుల్లో పలు కేసులు ఉన్నట్లు గుర్తించారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు